thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 303 కరీంనగర్ శుక్రవారం, 9 జనవరి 2026 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## ఎస్ఐఆర్ సంస్కరణ కాదు, బలవంతపు అణచివేత

న్యూఢిల్లీ: స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తీవ్రమైన పని ఒత్తిళ్ల కారణంగా పలువురు బూత్ లెవెల్ ఆఫీసర్లు ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఉదంతాలపై ఘాటుగా స్పందించారు. ఎస్ఐఆర్‌ను బలవంతపు అణిచివేతగా అభివర్ణించారు. ఈ ప్రక్రియ దేశ ప్రజలను వేధించేందుకు చేపట్టిన 'ఉద్దేశపూర్వక కుట్ర' అని ఆరోపించారు. సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఈమేరకు ఆయన ఒక ట్వీట్ చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ దేశంలో అలజడి రేపిందని, ప్రజాస్వామ్యానికి తిలోదకాలు వదిలి అధికారంలో ఉన్నవారికి కొమ్ము కాసేందుకు ఉద్దేశించిన ప్రక్రియ అని రాహుల్ పేర్కొన్నారు.

నిజమైన ఓటర్లను తప్పించడం ద్వారా ఎలక్టోరల్ ప్రక్రియను ఉద్దేశపూర్వకంగా తారుమారు చేయడం, ఓట్ల చోరీని అప్రతిహతంగా కొనసాగించం ఎస్ఐఆర్ లక్ష్యమని ఆరోపించారు. 'ఎస్ఐఆర్ పేరుతో పౌరులను వేధించేందుకు ఉద్దేశపూర్వకంగా కుట్ర జరిగింది. విపరీతమైన ఒత్తిడి బీఎల్ఓల మృతికి కారణమవుతోంది' అని తప్పుపట్టారు.



## సీఎం రేవంత్‌తో హిమాచల్ ప్రదేశ్ విద్యా శాఖ మంత్రి రోహిత్ కుమార్ బృందం

హైదరాబాద్ : తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో హిమాచల్ ప్రదేశ్ విద్యాశాఖ మంత్రి రోహిత్ కుమార్ బృందం భేటీ అయింది. ఈ సమావేశంలో విద్యాశాఖ కమిషనర్ యోగితా రాణా, పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ విద్యా వ్యవస్థలో తీసుకువస్తున్న సంస్కరణలు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు వివరాలను సీఎం హిమాచల్ ప్రదేశ్ మంత్రికి వివరించారు. 25 ఎకరాల సువిశాల స్థలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు ఒకే చోట మినీ యూనివర్సిటీ తరహాలో రూ. 200 కోట్లతో రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ తరహాలో త్వరలో తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీని తీసుకురానున్నట్లు తెలిపారు. మల్లెపల్లి ఐటీసీని సందర్శించాలని హిమాచల్ మంత్రి బృందానికి సూచించారు. మంత్రి రోహిత్ కుమార్ ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణంపై ఆసక్తి చూపించారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతానికి సీఎం రేవంత్ రెడ్డి విజన్ ను అభినందించారు.




గజ్వేల్: ఎర్రవెల్లిలోని తన నివాసానికి వచ్చిన మహిళా మంత్రులను భారత రాష్ట్రసమితి అధినేత కేసీఆర్ (ఖజ=) ఆత్మీయంగా పలకరించారు. అతిథి మర్యాదలతో పసుపు, కుంకుమ, చీర, తాంబూలాలతో సత్కరించారు. తెలంగాణ రాష్ట్ర మంత్రులు సీతక్క, కొండా సురేఖ గురువారం కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి.. మేడారం జాతర ఆహ్వాన పత్రికను అందజేశారు. మేడారం ప్రసాదం అందజేసి.. మరి కొద్ది రోజుల్లో ప్రారంభం కానున్న జాతరను సందర్శించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా.. తన ఇంటికి వచ్చిన ఆడబిడ్డలను ఆత్మీయంగా పలకరించి.. సాదరంగా ఆహ్వానించిన కేసీఆర్ దంపతులు సాంప్రదాయ పద్ధతిలో సత్కరించారు. కేసీఆర్ దంపతులు ఇచ్చిన తేనీటి విందు స్వీకరించిన మంత్రులు.. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తొలుత, ఎర్రవెల్లి నివాసానికి చేరుకున్న మహిళా మంత్రులకు మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ ఆహ్వానం పలికారు.

# ఉపాధి హామీని నిర్వీర్యం చేసే కుట్ర




## మోదీ సర్కార్‌పై నిప్పులు చెరిగిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 8: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ) ఎన్నో విప్లవాత్మక మార్పులు వచ్చాయని, దేశవ్యాప్తంగా దీనికి గుర్తింపు లభించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గురువారం నాడు గాంధీభవన్‌లో పీసీసీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం వల్ల వెట్టిచాకిరి ఆగిపోయిందని, గ్రామాల నుంచి వలసలు తగ్గాయన్నారు. అలాగే పనికితగ్గ వేతనం డిమాండ్ చేసే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. దేశంలో 80 శాతం మంది ఈ ఉపాధి హామీపై ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు.

**క్షమాపణ చెప్పాల్సిందే..** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రపన్నుతోందని సీఎం రేవంత్ ఆరోపించారు. పథకం పేరు మార్పు వెనుక ప్రధాని మోదీ కుట్ర ఉందని ఆయన ఆరోపించారు. ఎస్ఐఆర్ వెనుక పెద్ద కుట్ర ఉందని.. వీబీ జీ రామ్ జీ (వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్) చట్టాన్ని వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేశామన్నారు. ఉపాధి హామీని రద్దు చేస్తే మళ్లీ వలసలు ప్రారంభమవుతాయని హెచ్చరించారు. కార్పొరేట్ కంపెనీలకు లాభం చేకూర్చేందుకు, అదానీ-అంబానీలకు ప్రజలను కూలీలుగా మార్చేందుకు ఉపాధి హామీని రద్దు చేస్తున్నారని విమర్శించారు. వికసిత్ భారత్ కాదు.. సంక్షభ భారత్‌ను సృష్టిస్తున్నారని మండిపడ్డారు. నల్ల చట్టాల విషయంలో క్షమాపణ చెప్పే వరకు వదల్లేదని.. ఇప్పుడు ఉపాధి హామీ విషయంలోనూ క్షమాపణ చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. అధికారం ఉందని మోదీ ప్రభుత్వం ఇష్టారీతిన వ్యవహరిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ ఆరోపించారు.

**కార్యకర్తల త్యాగాల వల్లే...** ఈ సమావేశంలో పార్టీ కార్యకర్తల పాత్రను ముఖ్యమంత్రి రేవంత్ కొనియాడారు. కార్యకర్తల కష్టం, త్యాగాలతోనే అధికారంలో ఉన్నామని.. వచ్చిన పదవులన్నీ కార్యకర్తలు ఇచ్చినవేనని చెప్పారు. అందుకే స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ ఎన్నికల్లో 66 శాతంపైగా కాంగ్రెస్ గెలిచిందని, మున్సిపల్ ఎన్నికల్లోనూ గెలవాలని ధీమా వ్యక్తం చేశారు. కష్టపడినవాడు ఎప్పుడూ నష్టపోడని తెలిపారు. కాంగ్రెస్ మంత్రులంతా కష్టపడి పైకొచ్చినవారేనని, పార్టీ అవకాశం ఇస్తే తనతోపాటు ఎవరికైనా గుర్తింపు వస్తుందని పేర్కొన్నారు.

**జనవరి 20 నుంచి గ్రామ సభల్లో తీర్మానాలు చేయాలి:** పీబీ జీరామ్ జీ చట్టం విషయంలో ఏఐసీసీ నుంచి సంపూర్ణ కార్యాచరణతో ముందుకు వెళ్తామని సీఎం చెప్పారు. ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ తెలంగాణ అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానం చేసిందని ఇక రాష్ట్రంలోని 12,702 గ్రామాల్లో జనవరి 20 నుంచి 30వ తేదీ లోపు గ్రామసభలు నిర్వహించి ఈ చట్టాన్ని తిరస్కరించాలని సీఎం పిలుపునిచ్చారు. ఈ తీర్మానం చేయడం గ్రామ పంచాయతీల్లోని సర్పంచ్‌ల బాధ్యత మాత్రమే కాదని ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అన్నారు. అందువల్ల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్‌లు మినహా మిగతా 15 పార్లమెట్ సెగ్మెంట్లకు మంత్రులను ఇన్ చార్జులుగా పార్టీ పరంగా నియమించాలని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఏఐసీసీ వ్యవహారాల ఇన్ చార్జీ మీనాక్ష నటరాజన్‌ను కోరారు. అలాగే జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఒక్కొక్కరు ఒక మండలం బాధ్యతలు తీసుకోవాలని ముఖ్యమంత్రిగా తాను కూడా ఒక మండలం బాధ్యతను తీసుకుంటానన్నారు.

**జిల్లాల్లో బహిరంగ సభలు:** హైదరాద్ మినహా రాష్ట్రంలోని మిగతా 9 ఉమ్మడి జిల్లాల్లో ఫిబ్రవరి 3వ తేదీ నుంచి ఒక్కో రోజు ఒక్కో జిల్లా లో పీబీ జీ రామ్ జీ చట్టానికి వ్యతిరేకంగా లక్ష మందితో భారీ బహి రంగ సభ నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నుంచి ఈ సభను ప్రారంభించాలన్నారు. ఈ సభల్లో తాను పాల్గొంటానన్నారు. నరేంద్ర మోడీ దుర్మార్గమైన ఆలోచన, పేద ప్రజలు, రైతు కూలీలను కట్టుబానిసలుగా చేసే ప్రయత్నాన్ని తిరస్కరిస్తూ ఈ సభలు నిర్వహించాలన్నారు. ఈ తొమ్మిది సభలకు ఒక్కో జిల్లాల్లో ఒక్కో మంత్రికి బాధ్యతలు ఇవ్వాలన్నారు. ఈ సభల సమన్వ బాధ్యతలు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారు, ఈ కార్యక్రమాలన్నింటి పర్యవేక్షణ బాధ్యతలు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఏఐసీసీ వ్యవహారాల ఇన్ చార్జి మీనాక్ష నటరాజన్ తీసుకోవాలన్నారు.

ఉపాధి హామీ పథకాన్ని ఈ రాష్ట్రంలో చూస్తున్న శాఖకు మంత్రి సీతక్క. సీతక్క నియోజకవర్గంలో పెద్ద బహిరంగ సభను నిర్వహించి ఈ కార్యక్రమానికి ఆరోగ్యం సహకరిస్తే సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గేను ఆహ్వానిస్తామన్నారు.



# సభ్య సమాజం తలదించుకుంటోంది!

## తెలంగాణ రాజకీయాల్లో దిగజారిపోతున్న భాష!

## ఒకరిని మించి మరొకరు!!

హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు అభివృద్ధి కంటే అసభ్యత ఎక్కువగా వినిపిస్తోంది. ప్రజాప్రతినిధులు ఉండాల్సిన హుందాతనాన్ని పక్కన పెట్టి, వీధి స్థాయి మాటలతో పరస్పర విమర్శలకు దిగడం రాష్ట్ర ప్రజలను విస్మయానికి గురి చేస్తోంది. అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య సాగుతున్న ఈ భాషా యుద్ధం అంతకంతకూ పెరుగుతోంది.

**తెలంగాణ రాజకీయంలో బూతుల పర్వం..** తెలంగాణ గడ్డపై రాజకీయాలు ఎప్పుడూ వేడిగా ఉన్నప్పటికీ, ఇటీవలి కాలంలో నాయకులు వాడుతున్న భాష మాత్రం సరిహద్దులు దాటుతోంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిల మధ్య సాగుతున్న వ్యక్తిగత దూషణలు ఇప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వర్సెస్ కేటీఆర్ అనే స్థాయికి చేరుకున్నాయి. ఇటీవల వరంగల్ వేదికగా జరిగిన సభలో కేటీఆర్ మాట్లాడుతూ.. రాహుల్ గాంధీని, రేవంత్ రెడ్డిని ప్రజలు ఎన్నిసార్లు ఉరి తీసినా పాపం లేదని వ్యాఖ్యానించడం తీవ్ర దుమారం రేపింది. అశోక్ నగర్ వేదికగా నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు, రైతు రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆయన ఈ ఘాటు వ్యాఖ్యలు చేశారు. దీనికి కౌంటర్గా వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అత్యంత తీవ్రంగా స్పందించారు. కేటీఆర్ తన భాష మార్చుకోవాలి. మళ్లీ వరంగల్కు వస్తే చెప్పులతో కొట్టిస్తాం అంటూ ఆయన బహిరంగంగా హెచ్చరించడం తెలంగాణ రాజకీయాల్లో స్థాయి ఎంతగా దిగజారిందో తెలియజేస్తోంది.

**సభలోనూ అసభ్య పదజాలం...** కేవలం బయట సభల్లోనే కాకుండా, పవిత్రమైన అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు కూడా చర్చనీయాంశమయ్యాయి. ప్రతిపక్ష నేత కేసీఆర్ గతంలో చేసిన వ్యాఖ్యలను గుర్తు చేస్తూ.. మా చిత్తశుద్ధిని ప్రశ్నిస్తే చూస్తూ ఊరుకోం.. మీ నాలుకలు కోస్తాం" అని సీఎం అనడం సంచలనం సృష్టించింది. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో ఉండి, శాసనసభ రికార్డుల్లో ఉండేలా ఇటువంటి పరుష పదజాలాన్ని వాడటం ఏమాత్రం సమంజసం కాదని మేధావులు అభిప్రాయపడుతున్నారు. రేవంత్ రెడ్డి అత్యంత అసభ్యకరమైన పద ప్రయోగం చేశారని బీఆర్ఎస్ తో పాటు బీజేపీ కూడా విమర్శలు గుప్పించింది.

**రాజకీయాల్లో పిహెచ్డీ ల స్థాయి తిట్లు..** నాయిని రాజేందర్ రెడ్డి వంటి నేతలు మాట్లాడుతూ.. మాకు తిట్టడంలో పీహెచ్డీలు ఉన్నాయి, మేము మొదలు పెడితే మీరు తల దాచుకోవడానికి చోటు ఉండదు అని అనడం గమనిస్తే, రాజకీయాల్లో మేధోపరమైన చర్చ కంటే వ్యక్తిగత దూషణలకే ప్రాధాన్యత పెరిగిందని అర్థమవుతోంది. కేటీఆర్, రేవంత్ రెడ్డి ఇద్దరూ చదువుకున్న వారు, ప్రపంచ జ్ఞానం ఉన్న వారు అయినప్పటికీ.. రాజకీయ ప్రత్యర్థులపై దాడి చేసే క్రమంలో వాడుతున్న పదజాలం యువతకు తప్పుడు సందేశాన్ని ఇస్తోంది. తెలంగాణ ఉద్యమ సమయంలో భాష ఒక ఆయుధంగా ఉండేది. కానీ ఇప్పుడు అది కేవలం ప్రత్యర్థులను కించపరిచే సాధనంగా మారింది. ప్రజల సమస్యల కంటే, ఎవరు ఎవరిని ఎంత ఎక్కువగా తిట్టారనే దానిపైనే సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది.

ఈ సంస్కృతి ఇలాగే కొనసాగితే, భవిష్యత్తులో సామాన్య ప్రజలు ప్రజాప్రతినిధులపై గౌరవం కోల్పోయే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా నాయకులు ఆత్మపరిశీలన చేసుకుని, భాషా హుందాతనాన్ని కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చురకలు





కరీంనగర్: కృష్ణా జలాల అంశంలో ప్రజలను కేసీఆర్ పదేపదే మోసం చేశారని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 571 టీఎంసీలు రావాల్సి ఉంటే.. 299 టీఎంసీలకే ఆయన ఎందుకు అంగీకారం తెలిపారని ప్రశ్నించారు. కరీంనగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సంజయ్ మాట్లాడారు. పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని తరలించినప్పుడు ఎవరూ స్పందించలేదన్నారు. "వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు నదీ జలాల అంశాన్ని తెరపైకి తెచ్చాయి. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాను పూర్తిగా వాడుకోలేదు. అవసరం ఉన్నప్పటికీ వినియోగించుకోలేదు. అప్పటికే నిర్మాణంలో ఉన్నవాటికి అభ్యంతరం చెప్పొద్దని ఏపీ పునర్విభజన చట్టంలో ఉంది. ఆ చట్టంలో పాలమూరు-రంగారెడ్డికి పేరే లేదు. పోతిరెడ్డిపాడు ద్వారా 4 టీఎంసీల నీటిని ఏపీకి తరలించారు. దీన్ని గతంలో అడ్డుకోలేదు. కాంగ్రెస్, కేసీఆర్ చేసిన మోసాలు చూస్తే నాకు ఆశ్చర్యం వేసింది" అని బండి సంజయ్ అన్నారు.




## మిర్యాలగూడ ప్రణయ్ హత్య కేసులో కీలక పరిణామం.. శ్రవణ్ కుమార్‌కు బెయిల్..

మిర్యాలగూడ ప్రణయ్ హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. శ్రవణ్ కుమార్‌కు తెలంగాణ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ప్రణయ్ పరువు హత్య కేసులో గతంలో అమృత బాబాయ్ శ్రవణ్ కుమార్‌కు న్యాయస్థానం జీవిత ఖైదు విధించింది. శ్రవణ్ జీవిత ఖైదును సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. పిటిషన్ విచారణ ముగిసేవరకు బెయిల్ ఇవ్వాలని కోర్టును కోరాడు. తెలంగాణ హైకోర్టు శ్రవణ్ వయసు, జైలు జీవితాన్ని దృష్టిలో పెట్టుకుని బెయిలు మంజూరు చేసింది.

**దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన కేసు..** 2018లో జరిగిన ప్రణయ్ హత్య కేసు దేశ వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. నల్గొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన వ్యాపారవేత్త మారుతీరావు కూతురు అమృత వేరే సామాజిక వర్గానికి చెందిన ప్రణయ్‌ని ప్రేమించి పెళ్లి చేసుకుంది. ఈ పెళ్లి నచ్చని మారుతీరావు.. సుపారీ గ్యాంగ్ సాయంతో ప్రణయ్‌ని దారుణంగా హత్య చేయించాడు. బీహార్‌కు చెందిన సుభాష్ శర్మ అనే వ్యక్తి ప్రణయ్‌ని చంపేశాడు. ఈ కేసులో సుభాష్, మారుతీ రావు, శ్రవణ్ కుమార్‌లు అరెస్ట్ అయ్యారు. మారుతీ రావు, సుభాష్ శర్మలు బెయిల్ మీద విడుదల అయ్యారు. బెయిల్‌పై బయటకు వచ్చిన మారుతీ రావు చింతల్‌బస్తీలోని ఆర్య వైశ్య సత్రంలో ఆత్మహత్య చేసుకున్నాడు.




## జనగణన తొలిదశకు రంగం సిద్ధం.. కేంద్రం నోటిఫికేషన్ జారీ

న్యూఢిల్లీ, జనవరి 08: దేశవ్యాప్తంగా జనగణనకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జనగణన తొలి దశగా ఇళ్ల గణన (హౌస్ లిస్టింగ్) ప్రక్రియను చేపట్టనున్నారు. ఈ మేరకు కేంద్ర హోం శాఖ గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమై.. సెప్టెంబర్ 30వ తేదీతో ఈ ప్రక్రియ ముగియనుంది. దేశంలోని ప్రతి రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతంలో కనీసం 30 రోజులపాటు ఈ ప్రక్రియను నిర్వహించనుంది. హౌస్ లిస్టింగ్‌లో భాగంగా అన్ని రకాల ఇళ్లు, నివాసాలు, భవనాలు, నిర్మాణాల వివరాలను సేకరించనున్నారు. దేశంలో ప్రతి పదేళ్లకు ఒకసారి జనగణన నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. 2021లో ఈ జనగణన ప్రక్రియను నిర్వహించాల్సి ఉంది. కానీ కొవిడ్ కారణంగా.. ఈ ప్రక్రియను వాయిదా వేశారు. తాజాగా ఈ జనన గణన ప్రక్రియను నిర్వహించాలని కేంద్రం నిర్ణయించింది. అయితే ఈ ప్రక్రియను రెండు దశల్లో నిర్వహించేందుకు కేంద్రం ఏర్పాట్లు చేస్తోంది. తొలి దశలో ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు జరుగనుంది. ఇక రెండో దశలో జనాభా లెక్కల సేకరణ వచ్చే ఏడాది అంటే.. 2027 ఫిబ్రవరి నుంచి మార్చి 1వ తేదీ వరకు నిర్వహించనున్నారు. అందుకోసం కేంద్ర ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ జనాభా లెక్కలు పూర్తిగా డిజిటల్ రూపంలో చేయనుంది. ఈ జనగణనతోపాటే కులగణనను సైతం చేపట్టాలని ఇప్పటికే కేంద్రం నిర్ణయించింది. మరోవైపు తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే రాష్ట్రంలో కులగణన ప్రక్రియను చేపట్టి.. పూర్తి చేసింది. దీనిని ఆధారంగా చేసుకుని.. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా కులగణన చేపడుతుందంటూ మోదీ ప్రభుత్వంపై ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ విమర్శలు సంధిస్తున్న సంగతి తెలిసిందే.




హైదరాబాద్: సమాజం కోసం ఆలోచించడం, పని చేయడం 'ఈనాడు' డీఎన్ఏలోనే ఉందని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. శాస్త్రీయ అంశాలకు పత్రికలో ప్రముఖ స్థానం కల్పిస్తోందని చెప్పారు. తెలుగు పత్రికా రంగంలో విప్లవాన్ని సృష్టించిన రామోజీరావు ఒక ధ్రువతార అని కొనియాడారు. నగరంలోని బీఎం బిర్లా సైన్స్ సెంటర్‌లో 'ఈనాడు' గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ల్యాబ్ టూ సొసైటీ- రోల్ ఆఫ్ సైన్స్ కమ్యూనికేషన్ ఇన్ బిల్డింగ్ వీబీ-2047' కార్యక్రమానికి వెంకయ్యనాయుడు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. "క్రమశిక్షణ, అంకితభావం, దూరదృష్టి రామోజీరావు సొంతం. తెలుగు పాఠకులకు శాస్త్ర విజ్ఞానాన్ని అందించాలని ఆయన తాపత్రయపడ్డారు. సమాజంలో శాస్త్ర, సాంకేతికతపై నమ్మకాన్ని పెంపొందించడం మరింత అవసరం. శాస్త్రీయ విజ్ఞానాన్ని ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా చేరవేయాలి. సమాజంలో శాస్త్ర, సాంకేతికతపై నమ్మకాన్ని పెంపొందించాలి. దీనిపై అవగాహన పెంచే బాధ్యత శాస్త్రవేత్తలు, నిపుణులు తీసుకోవాల్సిన అవసరముంది. శాస్త్రవిజ్ఞానం నాలుగు గోడల మధ్యే ఆగిపోకూడదు.. ప్రజలకు చేరాలి. విద్యార్థుల్లో సైన్స్‌పై ఉత్సుకతను మరింత పెంచాలి. క్లిష్టమైన సైన్స్ అంశాలను సాధారణ ప్రజలకు అర్థమయ్యేలా 'ఈనాడు'లో జ్ఞాననేత్రం శీర్షికన ప్రచురిస్తున్నారు. సైన్స్‌పై ఎంత ఆదరణ పెంచగలిగితే ఆ రంగంలో దేశం అంత ముందుంటుంది. మన దేశంలో మేధస్సుకు కొదవ లేదు. రామానుజం, శకుంతలాదేవి, సీవీ రామన్ వంటి ప్రముఖులు దేశ కీర్తిని విశ్వవ్యాప్తం చేశారు. అబ్దుల్ కలాం వంటి మహానుభావులు స్వదేశీ పరిజ్ఞానంతో ఉపగ్రహాలు, క్షిపణులను తక్కువ ఖర్చుతో అభివృద్ధి చేశారు. ఇప్పుడు ఎగుమతి చేసే స్థాయికి మనం చేరుకోవడం సంతోషించదగ్గ విషయం. శాస్త్ర విజ్ఞానంలో అగ్రస్థానంలో భారత్ ఉండాలన్నదే మన లక్ష్యం. మానవ జీవన నాణ్యత పెంచడంలో శాస్త్ర సాంకేతికత పాత్ర చాలా కీలకమైనది. ఈ రంగంలో దూసుకెళ్లేందుకు ప్రైవేటు సంస్థలు చాలా కీలకంగా వ్యవహరిస్తున్నాయి. హరిత విప్లవ పితామహుడు ఎం.ఎస్.స్వామినాథన్ కృషి వల్లే ఆహార రంగంలో భారత్ స్వయం సమృద్ధిని సాధించింది" అని వెంకయ్యనాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో 'ఈనాడు' ఏపీ ఎడిటర్ ఎం.నాగేశ్వరరావు, ఏఎస్‌టీసీ గౌరవ అధ్యక్షుడు డా.ఆర్‌బీఎన్ ప్రసాద్, ఎస్ఏసీ-ఏఎస్‌టీసీ ఛైర్మన్ డా.సీహెచ్ మోహన్‌రావు, డబ్ల్యూహెచ్‌వో మాజీ శాస్త్రవేత్త డా.సౌమ్యా స్వామినాథన్, అనంత్ టెక్నాలజీస్ సీఎండీ డా.పావులూరి సుబ్బారావు, సీఎస్ఐఆర్ డైరెక్టర్ డా.డి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వీబీ-జీ రామ్ జీ చట్టానికి వ్యతిరేకంగా పోరాడాలి: మహేశ్ కుమార్ గౌడ్



హైదరాబాద్, జనవరి8 : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వీబీ-జీ రామ్ జీ (వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) పై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ షాకింగ్ కామెంట్స్ చేశారు. జీ రామ్ జీ చట్టానికి వ్యతిరేకంగా పోరాడాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. జీ రామ్ జీ చట్టానికి వ్యతిరేకంగా గ్రామ సభలు ఏర్పాటు చేద్దామని సూచించారు. ఇవాళ(గురువారం) గాంధీ భవన్‌లో పీసీసీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ అధ్యక్షతన సమావేశం ప్రారంభమైంది. వందేమాతరం గీతంతో ఈ సమావేశం మొదలైంది. ఈ సమావేశానికి సీఎం రేవంత్‌రెడ్డి, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్ష నటరాజన్, మంత్రులు హాజరయ్యారు.

**పునరుద్ధరించాలి..** ఈ సందర్భంగా జీ రామ్ జీ చట్టంపై చర్చించారు. అలాగే టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశం అజెండా రూపొందించారు.

జాతీయ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసే కుట్రను నిరసిస్తూ తీర్మానం చేశారు. వీబీ జీ రామ్ జీ పథకాన్ని వెనక్కు తీసుకుని.. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా జనవరి 10వ తేదీ నుంచి ఫిబ్రవరి 25వ తేదీ వరకు నిరసన కార్యక్రమాలను చేపట్టాలని మార్గనిర్దేశం చేశారు.

**నిరసనలు ఉధృతం చేయాలి..** ఏఐసీసీ సూచన మేరకు జీ రామ్ జీ చట్టానికి వ్యతిరేకిస్తూ నిరసనలు ఉధృతం చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. సంక్రాంతి తర్వాత 20 నుంచి 30వ తేదీల్లో అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాలని సూచించారు. MANREGA చట్టం గొప్పతనం వివరిస్తూ ప్రతి నియోజకవర్గానికి ఐదు వేల చొప్పున కరపత్రాలు పంపిణీ చేయాలని మార్గనిర్దేశం చేశారు. ప్రతి కరపత్రం గ్రామాలు, వాడవాడకూ చేరాలని సూచించారు. విదేశాల్లో ఉన్న వ్యక్తులు కూడా ఉపాధి హామీ పథకం గురించి ఆరా తీశారని పేర్కొన్నారు. ఈ పథకం గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారని చెప్పుకొచ్చారు. జీ రామ్ జీ చట్టంతో పేదల హక్కు కాలరాసేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. జీ రామ్ జీ చట్టానికి వ్యతిరేకంగా నిరసనలు చేస్తూ డీసీసీలు గ్రామసభలు నిర్వహించి తీరాల్సిందేనని హుకుం జారీ చేశారు. జీ రామ్ జీ చట్టంపై సీఎం రేవంత్‌రెడ్డి ఆయా జిల్లాల్లో బహిరంగ సభల్లో పాల్గొంటారని తెలిపారు. కాంగ్రెస్ శ్రేణులు భారీగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. డీసీసీ పదవి బాధ్యతగలదని.. అన్ని కార్యక్రమాలను దగ్గరుండి పర్యవేక్షంచాలని మహేశ్ కుమార్ గౌడ్ దిశానిర్దేశం చేశారు.

## ప్రపంచాన్ని బెదిరించే స్థాయికి ట్రంప్.. రామకృష్ణ ఫైర్..



ఖమ్మం జిల్లా, జనవరి8 : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై సీపీఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ సంచలన వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ పిచ్చోడి చేతిలో రాయిలాగా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఒక దేశ అధ్యక్షుడి ఇంటిపై దాడి చేసి కిడ్నాప్ చేసే నీచ స్థితికి ట్రంప్ దిగజారారని షాకింగ్ కామెంట్స్ చేశారు. ప్రపంచాన్ని బెదిరించాలనే దుస్సాహసానికి ట్రంప్ పాల్పడ్డారని ఆరోపణలు చేశారు. ఇంత జరుగుతున్నా.. ప్రధాని నరేంద్రమోదీ ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. తనను సంతృప్తిపరచాల్సిన బాధ్యత మోదీపై ఉందని డొనాల్డ్ ట్రంప్ ఇటీవల అన్నారని ప్రస్తావించారు. ఒకప్పుడు ప్రపంచ దేశాలకు నాయకత్వం ఇచ్చిన ఇండియా.. ఇప్పుడు మాట్లాడలేని పరిస్థితికి ఎందుకు దిగజారిందని నిలదీశారు. మోదీ పాలనలో ప్రపంచ దేశాల్లో భారతదేశానికి విలువ లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇవాళ(గురువారం) ఖమ్మం జిల్లాలో రామకృష్ణ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌కు వెళ్లారు. అక్కడ మీడియా సమావేశంలో మాట్లాడారు రామకృష్ణ.

**18న భారీ బహిరంగ సభ..** ఖమ్మం నగరంలో ఈ నెల 18వ తేదీన సీపీఐ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీపీఐ జాతీయ నాయకులంతా ఈ బహిరంగ సభలో పాల్గొంటారని పేర్కొన్నారు. 18వ తేదీన నగరంలో భారీ ర్యాలీ నిర్వహిస్తామని చెప్పుకొచ్చారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా సంఘీభావంగా ఈ ర్యాలీలో పాల్గొంటారని పేర్కొన్నారు. సీపీఐ ఆవిర్భావం నుంచి పోరాటాల పంథ కొనసాగించిందని తెలిపారు. పేదలు, కార్మికుల హక్కుల కోసం ఎంతోమంది జైలుకు వెళ్లారని అన్నారు. దేశం కోసం సీపీఐ ఎన్నో త్యాగాలు చేసిందని ప్రస్తావించారు. వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పోరాటాల గడ్డ ఖమ్మంలో శతాబ్ది ఉత్సవాలు జరుపుకోవడం చాలా సంతోషకరంగా ఉందని చెప్పుకొచ్చారు. ఈ నెల 19, 20, 21 తేదీల్లో ఖమ్మంలో జాతీయ కౌన్సిల్ సమావేశం ఉంటుందని తెలిపారు. 20వ తేదీ వామపక్ష పార్టీల జాతీయ నాయకులు ఆహ్వానించి సెమినార్ ఏర్పాటు చేశామని అన్నారు. 18వ తేదీ నుంచి 21వ తేదీ వరకు జరిగే ఈ సెమినార్‌కు ఎనలేని ప్రాధాన్యత ఉందని వివరించారు. ఈ సెమినార్‌లో వామపక్ష పార్టీలు పాల్గొంటాయని వెల్లడించారు. వామపక్ష పార్టీలు దేశంలో ఇతర పార్టీలను కలుపుకొని పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు రామకృష్ణ.

**పోలవరం పూర్తిచేయడం చాలా సంతోషం...** పోలవరం ముంపు ప్రాంతాల మండలాల్లో ఈరోజు(గురువారం) సమావేశం ఉందని రామకృష్ణ తెలిపారు. ఏపీ ముఖ్యమంత్రి 2027 మార్చి నాటికి పోలవరం పూర్తిచేసి జాతికి అందిస్తామని అంటున్నారని అన్నారు. పోలవరం పూర్తిచేయడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. పోలవరం ఏర్పాటుకు త్యాగాలు చేసిన భూ నిర్వాసితుల పరిస్థితి గురించి మాట్లాడటం లేదని అన్నారు. ఆగస్టు నెల వస్తే ఆ మండలాల్లోనే గ్రామాలు మునిగిపోతున్నాయని చెప్పుకొచ్చారు. 135 అడుగుల వరకు మాత్రమే సాయం చేస్తామని కేంద్ర ప్రభుత్వం చెబుతోందని అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు నాయుడు పోలవరం ముంపు బాధితులను గాలికి వదిలేశారని ఆరోపించారు. నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ డిమాండ్ చేస్తోందని అన్నారు. మావోయిస్టుల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన ఆపరేషన్ కగార్‌ను సీపీఐ పార్టీ ఖండిస్తోందని తెలిపారు. తక్షణమే నక్సల్స్‌తో చర్చలు జరపాలని కోరారు. మావోయిస్టు అగ్రనేత హిడ్మా ఎన్‌కౌంటర్ కూడా బూటకమేనని, పట్టుకొచ్చి కాల్చి చంపారని ఆరోపణలు చేశారు. ప్రశ్నించే వాళ్లని అర్బన్ నక్సల్స్ పేరుతో కేంద్ర ప్రభుత్వం వేధింపులకు గురిచేస్తోందని రామకృష్ణ విమర్శించారు.




## చెట్టును ఢీ కొన్న కారు... నలుగురు విద్యార్థుల దుర్మరణం


శంకర్‌పల్లి: రంగారెడ్డి జిల్లా మోకిల పరిధిలో గురువారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగింది. మీర్జాగూడ వద్ద చెట్టును కారు ఢీ కొట్టిన ఘటనలో నలుగురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ముగ్గురు ఐసీఎఫ్ఏఐ వర్సిటీ విద్యార్థులు కాగా, మరొకరు ఎంజీఐటీ విద్యార్థి. మృతులను సూర్యతేజ, సుమిత్, శ్రీనిఖిల్, రోహిత్‌గా గుర్తించారు. నక్షత్ర అనే విద్యార్థినికి తీవ్రగాయాలయ్యాయి. ఆమెను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరంతా మోకిల నుంచి హైదరాబాద్ వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.




పశ్చిమ బెంగాల్‌లోని కర్సియోంగ్ రేంజ్ డౌన్ హిల్ ఫారెస్ట్ ఏరియాలో అపురూపమైన దృశ్యం వెలుగుచూసింది. అరుదైన నల్ల జింక ఒకటి అటవీ అధికారులకు కనిపించింది. డివిజినల్ ఫారెస్ట్ ఆఫీసర్ బుధవారం డౌన్ హిల్ ఫారెస్ట్ ఏరియాలో సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో దట్టమైన అడవిలో ఓ అరుదైన నల్ల జింక ఆయనకు కనిపించింది. వెంటనే ఆయన ఫొటోలు, వీడియోలు తీశారు. నల్ల జింకకు సంబంధించిన ఓ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇక, నల్ల జింక కనిపించటంపై అటవీ అధికారులు మాట్లాడుతూ.. 'ఆ ప్రాంతంలో నల్ల జింక కనిపించటం సాధారణమైన విషయం కాదు. జెనటిక్ మ్యూటేషన్ కారణంగా జింక చర్మం నల్లగా మారి ఉంటుంది. అది ప్రత్యేకమైన జాతికి చెందిన జింక కాదు. డౌన్ హిల్, బగోరా ఫారెస్ట్ ఏరియాలో నల్ల జింకలు కనిపించిన సంఘటనలు ఇది వరకు కూడా ఉన్నాయి. అది కూడా అత్యంత నిర్మానుష్యమైన ప్రదేశాల్లో మాత్రమే నల్ల జింకలు కనిపించాయి. ఇండియా మొత్తంలో నల్ల జింకలు అత్యంత అరుదుగా ఉన్నాయి' అని అన్నారు. కాగా, ఇండియాలో చాలా రకాల జింక జాతులు నివసిస్తున్నాయి. మచ్చల జింక, సాంబార్ జింక, చిత్తడి జింక, మొరిగే జింక, కాశ్మీర్ జింక, మణిపూర్ సాంగై , కస్తూరి జింక, హాగ్ డీర్‌లు వివిధ అటవీ ప్రాంతాలలో కనిపిస్తాయి. ఇక, ఈ వీడియోపై స్పందిస్తున్న నెటిజన్లు.. 'ఆ జింక దూడ పిల్లలాగా కనిపిస్తోంది. జింకలాగా అస్సలు లేదు'..'ఈ ప్రకృతిలో ఇలాంటి వింతలు చాలా దాగి ఉన్నాయి. అప్పుడప్పుడూ ఇలా వెలుగులోకి వచ్చి అందరినీ ఆశ్చర్యపరుస్తూ ఉంటాయి'..'నల్ల జింకను ఇప్పటి వరకు నేనెప్పుడూ చూడలేదు. నల్ల జింక వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేసినందుకు ధన్యవాదాలు' అంటూ కామెంట్లు చేస్తున్నారు.

# కృత్రిమ జన్యువు సృష్టి కర్త ఖోరానా

## – జనవరి 9... హరగోవింద్ ఖోరానా జన్మదినం



కృత్రిమ జన్యువును నిర్మించిన శాస్త్రవేత్తగా హరగోవింద్ ఖోరానా ఆధునిక జీవశాస్త్రములో ఒక విప్లవానికి తెర లేపాడు. ప్రతి అమినో ఆమ్లపు నిర్మాణ క్రమము మూడు న్యూక్లియోటైడ్ల అమరికతో జన్యువులలో పొందుపరచడి ఉన్నదని కనుగొన్న జీవ శాస్త్ర వేత్త హర గోవింద ఖోరానా. వరుసగా ఉన్న కృత్రిమ జీన్ (డిఎన్ఏ) ముక్కను ప్రయోగశాలలో మొదటిసారిగా సృష్టించడం ద్వారా ఎన్నో పరిశోధనలకు బాట వేశాడు. ఖోరానా నూతన ఆవిష్కరణ జెనెటిక్ ఇంజనీరింగ్ అనే నూతన శాస్త్ర అధ్యయనానికి దారి తీసింది. ప్రయోగశాలలో డీఎన్ఏ (డీ ఆక్సీ రైబో న్యూక్లిక్ ఆమ్లం) సంశ్లేషణ చేయగలిగిన మొట్టమొదటి శాస్త్రజ్ఞుడిగా హరగోవింద్ ఖోరానా పేరుపొందాడు. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన నోబెల్ పురస్కార గ్రహీతలలో సర్. సి.వి.రామన్ తదనంతరం పేర్కొనదగిన శాస్త్రవేత్త హరగోవింద్ ఖోరానా. పంజాబ్ (ఇప్పుడు పాకిస్తాన్) లో ఓ గ్రామంలోని ఏకైక అక్షరాస్యత కుటుంబంలో జన్మించి, చదవడం, వ్రాయడం తన తండ్రి ద్వారా నేర్చుకుని, నోబెల్ బహుమతి గ్రహీతగా... కృత్రిమ జన్యువును నిర్మించిన మొదటి వ్యక్తిగా ఎదిగాడు హరగోవింద్ ఖోరానా. హరగోవింద్ ఖోరానా (9 జనవరి 1922– 9 నవంబర్ 2011) భారతీయ సంతతికి చెందిన, నోబెల్ బహుమతి పొందిన ప్రఖ్యాత జీవ శాస్త్రజ్ఞుడు. 1922 జనవరి 9న అవిభక్త భారత దేశములోని పంజాబ్ రాష్ట్రమునకు చెందిన రాయపూరు అనే గ్రామములో జన్మించాడు (ప్రస్తుతం పాకిస్తాన్లో ఉన్నది). తండ్రి పన్నులు వసూలు చేసే గ్రామ పట్వారి. అయిదుగురు సంతానములో చివరి వాడు. తొలుత తండ్రి శిక్షణలోను, తదుపరి ముల్తాన్ లో చిన్నతనం నుండే సైన్స్ పట్ల ఆసక్తితుడైన హర్ గోవింద్ చెట్టు కింద గుమిగూడిన ముల్తాన్ లోని దయానంద్ ఆర్య విద్యా ఉన్నత పాఠశాల నుండి తన పాఠశాల విద్యను పూర్తి చేశాడు. పంజాబ్ విశ్వ విద్యాలయము, లాహోర్ (ప్రస్తుతం పాకిస్తాన్) 1943 లో బీ.ఎస్సీ 1945లో ఎం.ఎస్సీ పట్టాలు పొందాడు. లివర్ పూల్ విశ్వ విద్యాలయములో 1945 నుండి 1948 వరకు శాస్త్ర పరిశోధనలు చేసి పీ.హెచ్.డీ పట్టా పొందాడు. సేంద్రియ కెమిస్ట్రీలో డాక్టరేట్ పొందిన తరువాత, ప్రొఫెసర్ వ్లాదిమిర్ ప్రిలాగ్తో కలిసి తదుపరి రెండు సంవత్సరములు పని చేయడానికి జూరిచ్ వెళ్లాడు. వ్లాదిమిర్ ఒక గురువుగా వ్యవహరించాడు. సైన్స్ పట్ల తనకున్న ప్రేమను హరగోవింద్ ఖోరానా మరింత పెంచుకున్నాడు. 1951–52లో విశ్వవిఖ్యాత కేంబ్రిడ్జ్ విశ్వ విద్యాలయములో మాంసకృత్తులు, న్యూక్లిక్ ఆమ్లములను సంధించిన పరిశోధన మొదలు పెట్టాడు. 1952లో కెనడా లోని బ్రిటిష్ కొలంబియా (వ్యంకూవర్) విశ్వ విద్యాలయములో చేరాడు. అక్కడ అతను తన జన్యు పరిశోధనను ప్రారంభించాడు. అటు పిమ్మట 1960 లో అమెరికా లోని విస్కాన్సిన్ విశ్వ విద్యాలయములో (మెడిసిన్) ఆచార్యునిగా చేరాడు.1966 లో అమెరికన్ పౌరసత్వం పొందాడు. 1970లో ప్రతిష్ఠాత్మకమైన మసాచుసెట్స్ సాంకేతిక సంస్థలో రసాయన శాస్త్ర ఆచార్యునిగా చేరాడు. 2007లో పదవీ విరమణ చేశాడు. అప్పటి నుండి గౌరవ ఆచార్యునిగా పరిశోధనలు సాగించాడు. జీవ శాస్త్రవేత్తలు ఎప్పటినుండో ఎదుర్కొంటున్న ప్రశ్న– ప్రయోగ శాలలో జీవాన్ని కృత్రిమంగా సృష్టించడం సాధ్యమేనా? ఈ దిశలో వంశ పారంపర్యముగా సంక్రమించు జీవ నిర్మాణానికి దోహదం చేసే "కృత్రిమ జీనును సృష్టించ గలిగాడు. ఈ ఆవిష్కరణ జెనెటిక్ ఇంజనీరింగ్ (+అవజిఖ జుఅఫ్రఅఅవజిఅఅఅ) అనే నూతన శాస్త్ర అధ్యయనానికి దారి తీసింది. జన్యువులలోని కోడ్‌ను సూక్ష్మంగా వివరించ గలగడం తో, జన్యువులలో తగు విధంగా మార్పులు చేయటం, జీవరాశులలో జన్యు మార్పిడి విధానాల ద్వారా జన్యువులలో అవాంఛిత లక్షణాలు తొలగించటం, అవసరమైనచోట్ల జన్యు మార్పిడి చేయగలగటం వంటి ఎన్నో విధానాలు అమలులోకి వచ్చాయి. ఖోరానా చేసిన ఈ పరిశోధనల ఫలితంగా ఈ రంగం 'బయో టెక్నాలజీ' అనే ప్రత్యేకమైన శాస్త్ర విభాగంగా ఏర్పడింది. ప్రతి అమినో ఆమ్లపు నిర్మాణ క్రమము మూడు న్యూక్లియోటైడ్ల అమరికతో జన్యువులలో పొందు పరచడి ఉన్నదని ఖోరానా కనుక్కొన్నాడు. వరుసగా ఉన్న కృత్రిమ జీన్ (డీఎన్ఏ ) ముక్కను ప్రయోగశాలలో మొదటిసారిగా సృష్టించాడు. డీ ఎన్ ఏ ముక్కలను అతికించు డీఎన్ఏ లిగసే అనబడు ఎంజైమును కనుగొన్నాడు. ఈ పరిశోధనల మూలముగా ఆధునిక జీవశాస్త్రములో ఒక విప్లవము వచ్చింది. 1968 లో వైద్య శాస్త్రములో నోబెల్ బహుమతి లభించింది. రాబర్ట్ హెూలీ, మార్షల్ నైరెన్‌బర్గ్‌తో కలిసి అందుకున్నాడు. గైరిందర్ ఫౌండేషన్ ఇంటర్నేషనల్ అవార్డు, లూయిసా స్థూల హెర్విట్జ్ బహుమతి, ప్రాథమిక మెడికల్ రీసెర్చ్ ఆల్బర్ట్ లస్కెర్ అవార్డు, విల్లార్డ్ గిబ్స్ అవార్డు, పద్మ విభూషణ్ అవార్డులను అందుకున్నాడు. 1968లో ఫిజియాలజీ/మెడిసిన్‌లో కణాల జన్యు సంకేతాన్ని కలిగి ఉన్న న్యూక్లియిక్ ఆమ్లాలలో న్యూక్లియోటైడ్ల క్రమం, కణాల ప్రోటీన్ల సంశ్లేషణను ఎలా నియంత్రిస్తుందో చూపించే పరిశోధన కోసం మార్షల్ డబ్ల్యు. నైరెన్‌బర్గ్ మరియు రాబర్ట్ డబ్ల్యు హెూలీతో కలిసి ఖోరానా నోబెల్ పురస్కారం పంచుకున్నాడు. నోబెల్ బహుమతి పొందిన తరువాత ఒక సందర్భంలో, డాక్టర్ ఖోరానా ఇలా వ్రాశాడు: 'పేదవాడు అయినప్పటికీ, నా తండ్రి తన పిల్లలకు విద్యను అందించడానికి జీవితాన్ని అంకితమిచ్చాడు. సుమారు 100 మంది నివసించే గ్రామంలో ఏకైక అక్షరాస్య కుటుంబం మేము.' అర్ధ శతాబ్దానికి పైగా, డాక్టర్ ఖోరానా – వేలాది మంది విద్యార్థులకు శాస్త్రీయ విద్యను అందించడం ద్వారా, మానవ జ్ఞాన రంగాలను అభివృద్ధి చేయడం ద్వారా తన తండ్రి వారసత్వాన్ని కొనసాగించాడు. ఖోరానా నవంబర్ 9, 2011 న కంకార్డ్, మసాచుసెట్స్ లో 89వ ఏట సహజ మరణము చెందాడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# ఓటు బ్యాంకులుగా ప్రవాసీ భారతీయులు...

## ఆచరణకు నోచుకోలేని ప్రభుత్వాల హామీలు - జనవరి 9...ప్రవాస భారతీయుల దినోత్సవం




ఒకనాడు ఉన్నత విద్య అనంతరం మోహన్ దాస్ కరమ్ చాంద్ గాంధీ దక్షణా ఆఫ్రికా వెళ్లి న్యాయ వాద వృత్తి చెప్పట్టేలా చేసింది. 1893 లో దక్షణాఫ్రికాకు వెళ్ళిన మహాత్మా గాంధీ, దేశం బానిస రాజుల చేతిలో మగ్గి పోతుంది అనే వాస్తవాన్ని గ్రహించి, 9 జనవరి 1915 న దక్షణాఫ్రికా నుంచి భారత దేశానికి జాతిపిత మహాత్మాగాంధీ తిరిగి వచ్చిన దినం సందర్భంగా, మహాత్ముడు ప్రవాసీ నాయకుడే అనే భావనతో, ప్రవాస భారతీయుల దినోత్సవము జనవరి 9 న జరుపుకొన బడుతున్నది. భారతదేశ అభివృద్ధికి విదేశీ భారతీయ వర్గాల సహకారాన్ని గుర్తించడానికి భారతదేశపు రిపబ్లిక్ ద్వారా జనవరి 9 న ఏటా జరిగే వేడుక రోజు. ఎల్.ఎమ్. సింగ్వి నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ జనవరి 2002 లో ఈ దినోత్సవాన్ని సిఫారసు చేసింది. 2003 నుండి ప్రతి సంవత్సరం జనవరి 9 న ప్రవాస భారతీయుల దినోత్సవాన్ని జరుపు తున్నారు. భారత ప్రభుత్వ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ మరియు ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ సమాఖ్య, భారత పరిశ్రమల సమాఖ్య మరియు నార్త్ ఈస్టర్న్ రీజియన్ యొక్క అభివృద్ధి మంత్రిత్వ శాఖ చేత స్పాన్సర్ చేయబడింది. దేశం యావత్తు ప్రవాసీ భారతీయ దివస్ పేరిట ఎన్నో కార్యక్రమంలో నిర్వహిస్తూ వస్తున్నది భారత ప్రభుత్వం. వివిధ దేశాల్లో భారత సంతతి వారు అందరూ కలిసి దాదాపు 3కోట్ల వరకూ వివిధ దేశాల్లో స్థిరపడ్డారు. మాతృ దేశ అభివృద్ధికి ఎందరో దేశాభిమానంతో విశేష కృషి చేస్తున్నారు. నేడు భారత జాతి ప్రగతిలో ప్రవాస భారతీయుల భాగస్వామ్యం చిరస్మరణీయం. ప్రవాస భారతీయుల దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో ప్రశంసనీయమైన కృషి చేసిన ప్రవాస భారతీయులకు భారతదేశ వృద్ధిలో ప్రవాసి భారతీయుల పాత్రను అభినందించడానికి, వారిలో అసాధారణమైన యోగ్యత కలిగిన వ్యక్తులకు, భారత రాష్ట్రపతి ప్రతిష్టాత్మక ప్రవాసీ భారతీయ సమ్మాన్ పురస్కా రాలను ప్రతి సంవత్సరం అంద జేస్తారు. మానవ జాతి పరిణామ క్రమంలో వలస ఒక ముఖ్యమైన మార్గం, విశ్వ వ్యాపితంగా నా భారతావని అనే స్వామి వివేకానందుల మాటలను నిజం చేస్తూ భారతీయ మూలాలు లేని మనుషులు లేరు. ఈ దేశంలో అని ప్రపంచ దేశాల్లో ఒక్క దేశాన్ని కూడా చూపించ లేము. భారతీయుల మేధాశక్తి ఒక దశలో వలస పోయింది ఆనకుండ మేధో వలస అనే పరిస్థితి వచ్చింది. చదువు మేధా సంపత్తి వైట్ కాలర్ ఉద్యో గాల పేరిట యూరోప్ వైపు వల సలు జరిగితే, అపార కండర బలం ఉండి శ్రామికులుగా గల్ఫ్ దేశాలకు నిరక్షరాసులైన కార్మిక వర్గం విస్తృత స్థాయిలో వలసలు జరిగాయి. వలసల ప్రక్రియ భారత జాతి వికాసానికి గణనీయమైన బాటలు పరిచింది. వ్యక్తి గత అభివృద్ధితో పాటు దేశాభివృద్ధి శరవేగంగా జరగడం ప్రారంభ మైంది. 90వ దశకంలో వచ్చిన ఆర్థిక సరళీకరణ, ప్రపంచీ కరణ విధానాలు కూడా కొంత అభివృధికి దోహద పడ్డాయి. ఈ వలసలకు అభివృద్ధికి గల ప్రముఖమైన సంబంధాన్ని కాదనలేము, విస్మరించ లేము. కానీ ఈ ప్రవాసీ భారతీయ దివస్ బడా పారిశ్రామిక వేత్తల పెట్టుబడిని ఆహ్వానించే ఒక సంపన్నుల కార్య స్థలంగా రూపు దిద్దు కొన్నదే కానీ, శ్రమ జీవులను ఒక్క తాటికి తీసుకొచ్చె శ్రమైక జీవన సౌందర్యాన్ని ఒక వేదికపై ఆవిష్కరించ లేక పోయింది. ఈ వలసలను విస్తృత కోణంలో అర్థం చేసుకో గలిగితే ప్రతి ఒక్కరి ప్రయోజనాలు నెరవేరుతాయి, సమిష్టి ప్రయోజనాలు మెరుగు పడుతాయి. ఒక వైపు ప్రపంచం ఒక కుగ్రామం అయినా నేడు సంపన్న పాశ్చాత్య దేశాల భారతీయుల సేవలు ఇంకా అవసరమైన దేశాలు స్థిర నివాసం ఏర్పరుచు కొనుట కోసం ఎన్నో రాయితీ ప్రయోజనాలు వలస మార్గాలను సులభతరం చేశాయి. అనేక దేశాలలో ప్రవాస భారతీయులు అక్కడి దేశపు చట్ట సభల్లో ప్రముఖమైన స్థానాల్ని కైవసం చేసు కుంటున్నారు. మరో వైపు ఈ గల్ఫ్ దేశాలకు పెద్ద సంఖ్యలో మన దేశం నుండి కార్మికుల వలసలు 1970 నుండి మొదలై, నేటికీ కొనసాగు తున్నాయి. వీరి ఆర్జన మొత్తం ఈ దేశానికి పంపుతున్న... ఆర్థిక సైనికులైన గల్ఫ్ వలస కార్మికుల వలస జీవితాల్లో గణనీయమైన మార్పు రావాల్సి ఉంది. కార్మికులుగా వలస వెళ్లిన వీరు తిరిగి కుటుంబాన్ని కలవాలి అంటే అది ఒక గొప్ప విజయమే, ఇట్టి కార్మికులు గల్ఫ్ నుండి 48 డిగ్రీల పై ఉండే అధిక ఉష్ణోగ్రతలో తమ రక్తాన్ని చెమట చుక్కలుగా, ఆపై విదేశీ మారకంగా మార్చి పంపుతున్న క్రమంలో, విదేశీ మారకంతో క్రూడాయిల్, పెట్రోల్ వంటివి కొనడానికి ఉపయోగ పడుతున్నాయి. కార్మికుడిగా వెళ్లి ఎన్నో వ్యాపారాల్లో ఉన్నత స్థాయి అందుకున్న మన భారతీయ గల్ఫ్ ప్రవాసీలు, ప్రవాసీ భారతీయ దివస్ లో ప్రవాసీ సమ్మాన్ అవార్డు అందుకోలేక పోతున్న అంశమే బాధాకరం. టాక్స్ ల రూపంలో అందుకుంటున్న ప్రభుత్వాలు, వారి దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి విధాన పరమైన నిర్ణయాలు తీసుకున్న దాఖలాలే లేక పోగా... వారిని ఓటు బ్యాంక్ గా మార్చు కుంటూ, ఆచరణకు నోచులోని హామీలతో కాలం వెళ్లదీవడం అత్యంత శోచనీయం. గల్ఫ్ వలస కార్మికులకు కనీస ప్రాతినిథ్యం లేని, ప్రవాసీ భారతీయ దివస్ ను "మజ్దూర్ ప్రవాసీ భారతీయ దివసు గా మార్చాలని దశాబ్దానికి పైగా ప్రవాసుల సంక్షమ వేదిక అధ్యక్షులు మంద భీం రెడ్డి నిరంతరం కార్మికుల హక్కులకోసం అవిశ్రాంతంగా పోరాడుతూనే ఉన్నారు. కార్మికుల జీవిత భీమా, ఆరోగ్య సంరక్షణ, మృత ధన సహాయం, పునరావాసం పునరేకీకరణ, నైపుణ్యంతో తిరిగి వచ్చిన కార్మికులకు తోడ్పాటు, ప్రధానంగా గల్ఫ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, అప్పుడే ప్రవాసీ ల కృషికి గుర్తింపు ఇచ్చి నట్లు అవుతుందని ప్రవాసీ లేబర్ యూనియన్ అధ్యక్షులు స్వదేశ్ పరికి పండ్ల అభిప్రాయ పడు తున్నారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**



**మాడుగుల హల్వా.. టేస్ట్ అదిరింది:** గుంటూరు కలెక్టరేట్: గుంటూరు నగర శివారులో సరస్ ప్రదర్శన – అఖిల భారత డ్వాక్రా బజార్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం పరిశీలించారు. ప్రదర్శనలో భాగంగా ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం స్వయంగా పరిశీలించారు. ఒక స్టాల్‌లో ఏర్పాటు చేసిన మాడుగుల హల్వా రుచి చూసి.. టేస్ట్ బాగుందని నిర్వాహకులను అభినందించారు. అనంతరం స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులను సీఎం ఆసక్తిగా తిలకించారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, స్థానిక ఎమ్మెల్యే మాధవి, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా కార్యక్రమంలో పాల్గొన్నారు.

# చట్టాలు రాతిపై చెక్కిన శిల్పాలు కావు.. ఎంపీ షాకింగ్ కామెంట్స్..



రాజమండ్రి : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్)' (వీబీ–జీ రామ్ జీ)పై బీజేపీ రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి కీలక వ్యాఖ్యలు చేశారు. విబ్ జీ రామ్ జీ పథకంపై ప్రతిపక్షలు ఉద్దేశపూర్వకంగా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని విమర్శించారు. చట్టాలు రాతిపై చెక్కిన శిల్పాలు కావని అందరూ గుర్తించాలని పేర్కొన్నారు. రాజ్యాంగంలో కూడా అనేక సవరణలు చేసుకున్నామని ప్రస్తావించారు. ఇవాళ రాజమండ్రిలో పురందేశ్వరి పర్యటించారు. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు పురందేశ్వరి.

**మార్పులు తీసుకొచ్చాం..** మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకంలో కూడా కొన్ని మార్పులు తీసుకొచ్చామని చెప్పుకొచ్చారు.

ఉపాధి హామీ పథకం ద్వారా శాశ్వత నిర్మాణ పనులు పెద్దగా జరగడం లేదని తెలిపారు. అందువల్లే మార్పులు చేయాల్సి వచ్చిందని అన్నారు. పలు రాష్ట్రాల్లో ఈ పథకం ద్వారా కూలీలకు సరైన సమయంలో వేతనాలు అందడం లేదని తెలిపారు. ఈ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని చాలా డిమాండ్లు ఉన్నాయని గుర్తుచేశారు. వికసిత్ భారత్ సాధించాలంటే వికసిత్ గ్రామాలు ఉండాలని చెప్పుకొచ్చారు పురందేశ్వరి.

**గ్రామసభల్లో తీర్మానం చేయాలి..** గ్రామాల్లో చేయబోయే అభివృద్ధి కార్యక్రమాలపై ముందుగా గ్రామసభల్లో తీర్మానం చేయాలని సూచించారు. తాజాగా ఉపాధి హామీ చట్టసవరణ ద్వారా 15 రోజుల్లోగా కూలి చెల్లించకుంటే జరిమానాతో కలిపి లబ్ధిదారుడికి అందజేస్తామని స్పష్టం చేశారు. విపత్తుల సమయంలోనూ రైతులను, సాధారణ ప్రజలను ఆదుకునేందుకు ఈ నిధులు వినియోగించుకోవచ్చని వివరించారు. ప్రస్తుతం ఈ సవరణ ద్వారా కేంద్ర ప్రభుత్వం 60శాతం నిధులు ఇస్తే రాష్ట్రాలు 40శాతం సమకూర్చుకోవాలని సూచించారు పురందేశ్వరి.

**నిధుల దుర్వినియోగం..** దీని ద్వారా రాష్ట్రాలపై కూడా బాధ్యత ఉంటుందని తెలిపారు. పశ్చిమబెంగాల్, పంజాబ్ రాష్ట్రాల్లో నిధుల దుర్వినియోగం బయటపడిందని అన్నారు. పనిదినాలు కచ్చితంగా పెంచి చూపిస్తామని చెప్పుకొచ్చారు. ప్రతిపక్షలు ఒకసారి ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవు పలికారు. వ్యవసాయ పనుల సమయంలో ఈ సవరణ ద్వారా పనులను తాత్కాలికంగా నిలుపుదల చేస్తామని దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు.

# వైసీపీకి ధీటుగా బదులివ్వండి.. మంత్రులకు లోకేష్ కీలక సూచనలు




అమరావతి, జనవరి 8: వైసీపీలా రప్పారప్పా విధానం తమది కాదని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. గురువారం ఉండవల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో టీడీపీ మంత్రులతో మంత్రి లోకేష్ అల్పాహార విందు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మంత్రి పలు కీలక సూచనలు చేశారు. జగన్‌లా ప్రజల్ని భయపెట్టడం, బెదిరించడం, దౌర్జన్యాలకు పాల్పడటం వంటివి టీడీపీ సంస్కృతి కాదని స్పష్టం చేశారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ ఎంత మేర సేవ చేశామన్నదే మన అజెండా కావాలని తెలిపారు. అభివృద్ధి – సంక్షమం రెండింటినీ సమన్వయం చేస్తూ ప్రజలకు ఎంత ప్రయోజనం చేకూర్చామన్నదే కూటమి ప్రభుత్వ విధానమని తేల్చిచెప్పారు. వైసీపీ కుట్రలను పార్లమెంట్ వారీగా నేతలు సమర్థంగా తిప్పికొట్టాలని, పార్లమెంట్ కేంద్రాల్లో నేతలు ఏకతాటిపైకి వచ్చి వైసీపీ అసత్య ప్రచారాలకు ధీటుగా బదులివ్వాలని మంత్రి సూచించారు. మంత్రులు ప్రజావేదికలో తమకు వచ్చే ఫిర్యాదులు పరిష్కారమయ్యేలా బాధ్యత తీసుకోవాలని చెప్పారు. తమ తమ శాఖలకు సంబంధించిన అర్జీల పరిష్కారానికి మంత్రులు చొరవ చూపాలని ఆదేశించారు. పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా క్యాడర్‌ను ఏకతాటిపైకి తెచ్చేందుకు ఇన్‌ఛార్జి మంత్రులు పనిచేయాలని మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు.

# అనర్హత భయంతోనే రిజిస్టర్‌లో వైకాపా ఎమ్మెల్యేల సంతకాలు: యనమల




అమరావతి: జగన్ అసెంబ్లీ కార్యకలాపాలను బహిష్కరిస్తున్నట్లు ప్రకటిస్తే.. వైకాపా ఎమ్మెల్యేలు మాత్రం ఆయనకు తెలియకుండా రిజిస్టర్‌లో సంతకాలు చేయడం ఆ పార్టీలో అంతర్గత విభేదాలను ప్రతిబింబిస్తోందని తెదేపా సీనియర్ నేత, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. ఈ పరిణామాలు భవిష్యత్తులో వైకాపాలో చీలికకు దారితీయొచ్చని అభిప్రాయపడ్డారు. సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించేందుకు ప్రజలు వారిని ఎన్నుకుంటే సమావేశాలను బహిష్కరించడాన్ని ప్రజలు గమనించాలన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 190 (4) ప్రకారం అనర్హత వేటు పడుతుందనే భయంతోనే వారు ఇలా చేస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తోందని వ్యాఖ్యానించారు.

# జగన్ ఎన్ని ప్రయత్నాలు చేసినా అమరావతి ఆగదు: మంత్రి నారాయణ



అమరావతి: జగన్ ఎన్ని ప్రయత్నాలు చేసినా రాజధాని అమరావతి నిర్మాణం ఆగదని పురపాలకశాఖ మంత్రి నారాయణ అన్నారు. అమరావతిపై అవగాహన లేకుండా జగన్ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రాజధాని అమరావతిపై జగన్ చేసిన ఆరోపణలను మంత్రి నారాయణ ఖండించారు. "నదీ గర్భంలో నిర్మాణాలు చేస్తున్నామని అసత్య ప్రచారం చేస్తున్నారు. కోర్టుల్లో కేసులు వేయిస్తున్నారు. అక్కడ ఎలాంటి పరిస్థితుల్లో కూడా నిర్మాణాలు జరగవు. నేతలు పూర్తిగా అవగాహన చేసుకుని మాట్లాడాలి. అమరావతి మాస్టర్ ప్లాన్‌ను జగన్ అర్థం చేసుకుని స్పందించాలి. మిడి మిడి జ్ఞానంతో మాట్లాడం తప్పు. రివర్‌బెడ్, రివర్ బేసిన్‌కు తేడా తెలుసుకోవాలి. వాస్తవాలు తెలియకుండా ప్రజలను తప్పుదోవ పట్టించడం తగదు. రెండో విడత భూ సమీకరణకు రైతులు ముందుకు వస్తున్నారు. గంటల వ్యవధిలో వందల ఎకరాలు ప్రభుత్వానికి ఇచ్చారు. ఇది చూసి ఓర్వలేకే జగన్ అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. అమరావతి ముందుకెళ్లిపోతోందన్న అసూయతోనే అవాస్తవాలు మాట్లాడుతున్నారు. ఇలాగే వ్యవహరిస్తే.. ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడితే జగన్‌కు ప్రస్తుతం ఉన్న 11 సీట్లు సున్నాకు చేరుకుంటాయి. ఏ రాష్ట్రానికైనా ఒక రాజధాని ఉంటుంది. ప్రతి జిల్లాకు హెడ్ క్వార్టర్, కలెక్టర్ కార్యాలయం ఉంటాయి. రాజధానిలో మంత్రులు, కార్యదర్శులు, అధికారులు అందరూ ఉండి.. ప్రజల సమస్యలను పరిష్కరిస్తారు. వచ్చే ఏడాదిన్నరలో రాజధానిలో ట్రంక్ రోడ్లు పూర్తి చేస్తాం. రెండున్నరేళ్లలో లేఔట్ రోడ్లు పూర్తి చేస్తాం. మూడేళ్లలో ఐకానిక్ భవంతుల నిర్మాణం పూర్తవుతుంది" అని నారాయణ తెలిపారు.

# అనంతపురం, చిత్తూరు కోర్టులకు బాంబు బెదిరింపులు



అనంతపురం, చిత్తూరు: ఏపీలోని అనంతపురం, చిత్తూరు కోర్టులకు బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. కోర్టుల్లో ఉన్న న్యాయవాదులు, కక్షదారులను బయటకు పంపించి తనిఖీలు చేపట్టారు. ఈ–మెయిల్ ద్వారా బెదిరింపులు వచ్చినట్లు అనంతపురం జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు తెలిపారు. మెయిల్ ద్వారా వచ్చిన లేఖలను న్యాయాధికారులు పోలీసులకు అందించారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మరోవైపు చిత్తూరు జిల్లాలోని మిగిలిన కోర్టుల్లోనూ తనిఖీలు చేపట్టారు.

చురకలు

## సంపాదకీయం

### బంగ్లా చేసిన పిచ్చి పని...భారత్ ఆగ్రహం

భారతదేశం ఎంతో సహన వంతమైన దేశంగా చెప్పుకుంటారు. అందరూ బాగుండాలి అందులో తాను ఉండాలని నమ్మే దేశంగా ప్రపంచంలో పేరుంది. విశ్వానికి మిత్రుడు అన్న పదం ఒక్క భారత్ కే సరిపోతుంది. శతృవు అన్న మాట భారత్ వైపు నుంచి ఉండదు, తమ జోలికి ఎవరైనా వస్తేనే మూడో కన్ను తెరుస్తుంది. పాక్ దాయాదిగా ఉంటూ శతృవుగా మారినా కూడా భారత్ ఎన్నో అవకాశాలు ఇచ్చింది. మారాలని కోరింది అయినా వినిపించుకోక తన బుద్ధి చూపించుకోగ్వడంతోనే ఆపరేషన్ సింధూర్ లాంటి గట్టి ప్రయోగం చేయాల్సి వచ్చింది. అలాగే సింధు జలాలను నిలుపు చేసి పాక్ గొంతు ఎండబెట్టాల్సి వచ్చింది.

**ఊపిరి పోసిన చోట :** ఇక మరో పొరుగు దేశం బంగ్లాదేశ్ గురించి చెప్పాలంటే ఆ దేశం ప్రతీ రోజూ భారత్ పేరు తలచుకోవాల్సిందే అని అంటారు. ఒక్కసారి చరిత్ర పుటల్లోకి వెళ్తే కనుక పాక్ కబంధ హస్తాల నుంచి తూర్పు పాకిస్తాన్ ని కాపాడి ఒక ప్రత్యేక దేశంగా ఏర్పాటు చేసిన మంచితనం భారత్ ది అని చెబుతారు. తూర్పు పాకిస్తాన్ ని అలా కనుక వదిలేసి ఉంటే ఈ రోజున బెలూచిస్తాన్ మాదిరిగా అన్ని విధాలుగా అణచివేతకు గురి అయి పాక్ చేతిలో హింస పడుతూ దిన దిన గండంగా ఉండేది. అంతకు ముందు కూడా మొదటి మూడు దశాబ్దాల పాటు అలాగే తూర్పు పాకిస్తాన్ హింసకు గురి అయింది భారత్ ని శరణు కోరడంతో న్యాయ సమ్మతంగా అది ఉండడంతో భారత్ శ్రీమతి ఇందిరాగాంధీ నాయకత్వంలో పాక్ తో యుద్ధం చేసి 1971లో బంగ్లాదేశ్ ఆవిర్భావానికి నాంది పలికింది. ఒక కొత్త దేశం ప్రపంచ పటం మీద ఊపిరి పోసుకోవడానికి దోహదదం అయింది. అంతటితో ఊరుకోలేదు నిన్నా మొన్నటి వరకూ ఆర్థికంగా అన్ని విధాలుగా బంగ్లాదేశ్ ని ఆదుకుంటూనే వచ్చింది. కానీ గత ఏడాదిన్నరగా మారిన పరిణామాలతో బంగ్లాదేశ్ భారత్ కి శతవుగా మారిపోయింది.

**విషం చిమ్ముతూ :** తన ఒకనాటి శత్రువు అయిన పాక్ తో చేతులు కలిపి భారత్ మీద విషం చిమ్మడంతో పోటీ పడుతోంది బంగ్లాదేశ్. ఆ దేశం తాజాగా చేసిన పిచ్చి పనికి భారత్ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. పాక్ కి టెంపరరీగా ఒక ప్రధాని ఉన్నారు. ఆయనే మహమ్మద్ యూనస్. ఆయన భారత్ మీద అదే పనిగా తన వ్యతిరేకతను చాటుకుంటూనే ఉంటారు. తాజాగా ఈ పెద్ద మనిషి ఇంకో సారి భారత్ పై తనకు ఉన్న అసూయను వ్యతిరేకతను చాటుకున్నారు. భారత్ కు చెందిన కీలకమైన భూభాగాలను బంగ్లాదేశ్ దేశం మ్యాప్ లో ఆయన చూపించారు. ఇది ఒక విధంగా బరితెగింపు అని చెప్పాల్సి ఉంటుంది. అంతే కాదు చాలా గొప్పగా దానిని పాక్ నేస్తాలకు బహూకరించారు.

**పెడ ధోరణికి :** ఇదంతా బంగ్లాదేశ్ పెడ ధోరణికి నిదర్శనం అని అంటున్నారు తమది కానిది తమకు చెందనిది అయిన భూములను ప్రాంతాలను ఎలా కలుపుకుంటారు అని భారత్ లో ఆగ్రహం వ్యక్తం అవుతోంది. ఇది దిగజారుడు తనం చౌకబారుతనం బరితెగింపు అని అంటున్నారు. ఈ విధంగా తయారు చేసిన మ్యాప్ ని ఆయన పాకిస్థాన్ జనరల్ షంషాద్ మీర్జాకు ఇవ్వడం మరో రకమైన పైత్యానికి నిదర్శనంగా చూస్తున్నారు. ఇక బంగ్లా ఈ విధంగా రూపొందించిన మ్యాప్ లో చూస్తే భారత దేశంలోని ఈశాన్య రాష్ట్రాలు అన్నీ ఉండడం గమనార్హం. వాటిని తమ సొంతంగా సొత్తుగా బంగ్లా తాత్కాలిక పాలకుడు చూపించుకుంటూ మురిసిపోవడం కంటే తెంపరితనం వేరొకటి ఉండదని అంటున్నారు

**బంగ్లాకు తగిన గుణపాఠం :** ఈ మధ్యనే పాకిస్థాన్ కు చెందిన జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాప్ కమిటీ ఛైర్ పర్సన్ జనరల్ షంషాద్ మీర్జా బంగ్లాదేశ్ లో పర్యటించడం జరిగింది. ఈ సందర్భంగానే ఆయనకు ఈ తాత్కాలిక ప్రధాని అయిన యూనస్ మహాశయుడు ఒక బుక్ ని ప్రజెంట్ చేశారు. ఆ బుక్ కి వేసిన కవర్ పేజి చిత్రంలో భారత్ లోని భూభాగాలను కలుపుకుంటూ ఉన్న మ్యాప్ లో ఉంది. భారత్ లో ఈశాన్యంలో ఏకంగా ఏడు రాష్ట్రాలు మావే అంటూ చేసిన ఈ మ్యాప్ ప్రదర్శన బంగ్లా బుద్దిని బయట పెట్టింది. అంతే కాదు పిచ్చి తనాన్ని బయటపెట్టింది అని అంటున్నారు. దీని మీద మొత్తం భారతదేశం ఆగ్రహంగా ఉంది. సమయం చూసి భారత్ బంగ్లాకు తగిన గుణపాఠం చెప్పాలని అంతా కోరుకుంటున్నారు.

## తెలంగాణ తొలి ఉద్యమ పూర్వాపరాలు - జనవరి 9...తెలంగాణ తొలి దశ ఉద్యమ ప్రారంభ దినం




తెలంగాణ ప్రజలకు అన్ని రంగాలలో జరుగుతున్న అన్యాయానికి ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు మాత్రమే పరిష్కారమని, రాష్ట్ర సాధనకై పోరాటం తప్పదనే భావన తెలంగాణ యువతలో అంకురించింది. అలా తెలంగాణ తొలి ఉద్యమం తెలంగాణా హక్కుల పరిరక్షణ ఉద్యమంగా మొదలైంది. తెలంగాణా రక్షణలను అమలు చెయ్యాలని కోరుతూ 1969, జనవరి 9 న ఖమ్మం పట్టణంలో బి.ఎ. స్టూడెంట్, నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ నాయకుడైన రవీంధ్రనాథ్ గాంధీచౌక్ దగ్గర నిరవధిక దీక్ష ప్రారంభించాడు. తొలి దశ ఉద్యమ ప్రారంభ పూర్వా పరాలు తెలుసుకునే ప్రయత్నం ఇది. ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలు కలిసి ఆంధ్ర ప్రదేశ్ ఏర్పాటు కావడంలో కీలకమైనది పెద్దమనుషుల ఒప్పందం. 1956లో తెలుగు మాట్లాడే ప్రాంతాలన్నీ ఏకమై ఒకే రాష్ట్రంగా ఏర్పడటానికి రాయలసీమ, తెలంగాణ ఆంధ్ర ప్రాంతాల నాయకులతో కలిసి. 1956, ఫిబ్రవరి 20 న ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇదే పెద్దమనుషుల ఒప్పందం. న్యూ ఢిల్లీలో పెద్దమనుషుల ఒప్పందంపై సంతకాలు చేసిన వారు తెలంగాణ తరపున, బూర్గుల రామ కృష్ణారావు, కె.వి.రంగారెడ్డి, మర్రి చెన్నారెడ్డి, జె.వి. నరసింగరావు; ఆంధ్ర తరపున నీలం సంజీవరెడ్డి, బెజవాడ గోపాలరెడ్డి, అల్లూరి సత్యనారాయణ రాజు, గౌతు లచ్చన్న ఉన్నారు. తెలంగాణ అభివృద్ధికి, తెలంగాణ సమానత్వ పరిరక్షణకు సంబంధించిన నిబంధనలు ఏర్పరచు కున్నారు. ఈ ఒప్పందాన్ననుసరించి 1956, నవంబర్ 1 న ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. ఆంధ్ర ప్రాంతానికి చెందిన నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. అయితే, ఈ ఒప్పందం అమలు విషయమై కొద్దికాలంలోనే తెలంగాణా ప్రజల్లో అసంతృప్తి తగిలింది. ఒప్పందాన్ననుసరించి ఉప ముఖ్యమంత్రి పదవిని తెలంగాణా వాసికి ఇవ్వలేదు; అసలు ఆ పదవినే సృష్టించలేదు. అయితే 1959లో దామోదరం సంజీవయ్య ముఖ్యమంత్రి కాగానే ఉప ముఖ్యమంత్రిగా తెలంగాణ ప్రాంతానికి చెందిన కొండా వెంకట రంగారెడ్డి (కె.వి.రంగారెడ్డి) ని నియమించాడు. అయితే మళ్ళీ 1962 నుండి 1969 వరకు ఉపముఖ్యమంత్రి పదవి లేదు. 1969లో తెలంగాణ ప్రాంతానికి చెందిన జె.వి.నర్సింగరావును ఉప ముఖ్యమంత్రిగా నియమించారు. ఈ విధంగా రాజకీయ పదవుల విషయంలో తమకు అన్యాయం జరిగిందని తెలంగాణ వారు భావించారు. అలాగే ఆంధ్ర ప్రాంతం నుండి తరలి వచ్చిన ప్రజలు తెలంగాణ ప్రాంతంలో భూములు కొని, వ్యవసాయం చేసారు. ఇది తమ భూముల ఆక్రమణగా కొందరు తెలంగాణా ప్రజలు భావించారు. ప్రభుత్వ ఉద్యోగాలు, ఉపాధ్యాయుల నియామకాల్లో తమకు అన్యాయం జరిగిందనే భావన కూడా తెలంగాణా ప్రజల్లో బలంగా కలిగింది. తెలంగాణ విద్యాసంస్థల్లో కూడా తమకు తగినన్ని సీట్లు రాలేదని విద్యార్థుల్లో అసంతృప్తి నెలకొని ఉంది. ఈ నేపథ్యం లోనే "తెలంగాణ తొలి ఉద్యమం"... "తెలంగాణ హక్కుల పరిరక్షణ ఉద్యమం"గా మొదలైంది. తెలంగాణ రక్షణలను అమలు చెయ్యాలని కోరుతూ 1969, జనవరి 9 న ఖమ్మం పట్టణంలో బి.ఎ. స్టూడెంట్, నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ నాయకుడైన రవీంధ్రనాథ్ గాంధీ చౌక్ వద్ద నిరవధిక దీక్ష ప్రారంభించాడు. ఆరోజు జరిగిన ఊరేగింపులో హింసాత్మక ఘటనలు జరిగాయి. మరుసటి రోజు ఉద్యమం నిజామాబాదుకు పాకింది. జనవరి 10 న హైదరాబాదులోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగిన విద్యార్థుల సమావేశంలో – తెలంగాణా రక్షణల అమలుకై జనవరి 15 నుండి సమ్మె చెయ్యాలని ప్రతిపాదించారు. అయితే, జనవరి 13 న అదే విశ్వవిద్యాలయంలో జరిగిన ఒక సమావేశంలో విద్యార్థులలోని ఒక వర్గం "తెలంగాణ విద్యార్థుల కార్యాచరణ సమితి"గా ఏర్పడి, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనే తమ ధ్యేయంగా ప్రకటించారు. జనవరి 13న ఉస్మానియా యూనివర్సిటీలో "తెలంగాణ విద్యార్థుల కార్యాచరణ సమితి" ఏర్పడింది. ఆ రోజు మొట్టమొదటి సారిగా ప్రత్యేక తెంగాణ సాధనను తమ లక్ష్యంగా విద్యార్థులు ప్రకటించుకున్నారు. విద్యార్థుల కార్యాచరణ సమితి మెడికల్ విద్యార్థి మల్లిఖార్జున్‌ను ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకుంది. విద్యార్థులు ఎలాంటి త్యాగాలకైనా సిద్ధం కావాని మల్లిఖార్జున్ పిలుపునిచ్చారు. అదే రోజున పురప్రముఖులు కొందరు "తెలంగాణా పరిరక్షణల కమిటీ"ని ఏర్పాటు చేసారు. జనవరి 18 న విద్యార్థుల్లోని రెండు వర్గాలు (తెలంగాణ రక్షణల కోసం ఉద్యమించిన వారు, ప్రత్యేక తెలంగాణ కోరేవారు) వేరువేరుగా హైదరాబాదులో ఊరేగింపులు జరిపారు. ఈ రెండు ఊరేగింపులు ఆబిడ్స్ లో ఎదురైనపుడు ఘర్షణ చెలరేగింది. పోలీసులు లాఠీఛార్జి చెయ్యవలసి వచ్చింది. అదేరోజు శాసనసభలోని ప్రతిపక్ష పార్టీలు తెలంగాణా రక్షణల అమలు కొరకు ప్రభుత్వాన్ని వత్తిడి చేసాయి. ఉద్యమ కారుల కోరికలను చర్చించడానికి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం జనవరి 19 న అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఆ సమావేశం ఒక ఒప్పందానికి వచ్చింది. తెలంగాణలో పనిచేస్తున్న ఆంధ్ర ఉద్యోగులను వెనక్కి పంపించాలి. పెద్దమనుషుల ఒప్పందం లోని తెలంగాణ రక్షణలను అమలు చెయ్యాలి. అయితే ప్రత్యేక తెలంగాణ వాదులు ఈ ఒప్పందానికి సమ్మతించలేదు. ప్రత్యేక రాష్ట్రమే తమ ధ్యేయమని, అది నెరవేరే వరకు తమ ఉద్యమం కొనసాగుతుందని ప్రకటించారు. జనవరి 24న సదాశివపేటలో కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో 14 మంది గాయపడ్డారు. గాయపడ్డ వారిలో 17 ఏళ్ల శంకర్ మరుసటి రోజు గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. 1969 తెలంగాణ ఉద్యమంలో తొలి అమరుడు శంకర్. కాల్పులకు నిరసనగా కొండా లక్ష్మణ్ బాపూజీ తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. ప్రత్యేక తెలంగాణ కాంగ్రెస్ సమితిని ఏర్పాటు చేశారు. అఖిలపక్ష కమిటీ ఒప్పందాన్ని అమలు చేస్తూ జనవరి 22న ప్రభుత్వం ఒక ప్రభుత్వ ఉత్తర్వును జారీ చేసింది. దీని ప్రకారం ఫిబ్రవరి 28 కల్లా స్థానికులు కాని ఉద్యోగులని వారి వారి స్థానాలకు వెనక్కి పంపివేస్తారు. తెలంగాణ రక్షణల అమలుకై మిగులు నిధుల అంచనాకు ఢిల్లీనుండి ఒక బృందం వస్తుంది. ఈ హామీలతో ఉద్యమానికి ఆద్యుడైన ఖమ్మం విద్యార్థి రవీంద్ర నాథ్ తన దీక్షను విరమించాడు. దీనితో తెలంగాణ రక్షణల అమలు ఉద్యమం ఆగిపోయింది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం రెండవ దశలోకి ప్రవేశించింది. జనవరి 28న వరంగల్లులో కాళోజీ నారాయణరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో ముఖ్యమంత్రి రాజీనామా చెయ్యాలని, రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని తీర్మానం చేసారు. 1969 ఫిబ్రవరి 28 న యువకులు, మేధావి వర్గాలు కలిసి హైదరాబాదులో తెలంగాణ ప్రజాసమితి ని స్థాపించారు. జూన్ 4న తెలంగాణ పరిస్థితి తీవ్రతను తెలుసుకున్న ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ హైదరాబాద్ నగరానికి వచ్చి విద్యార్థి నాయకులు, తెలంగాణ ప్రజా సమితి నాయకులతో చర్చలు జరిపింది. తెలంగాణ తొలి ఉద్యమ కాలంలో మొత్తం 95 సార్లు కాల్పులు జరిగాయి. హైదరాబాద్, వరంగల్ నగరాల్లో కర్ఫ్యూ విధించారు. ఉద్యమంలో 369 మంది చనిపోగా, ప్రభుత్వ లెక్కలు మాత్రం 57 మంది చనిపోయినట్టుగా చెప్పాయి. తెలంగాణ ప్రజా సమితి నేతతో కేంద్రం చర్చలు జరిపింది. సెప్టెంబర్‌లో చెన్నారెడ్డి ఢిల్లీలో చర్చలు జరిపి వచ్చిన తర్వాత విద్యార్థులు తరగతులకు హాజరు కావాలని చెన్నారెడ్డి, విద్యార్థి నాయకుడు మల్లికార్జున్ ఒక ప్రకటన చేశారు. చదువులు కొనసాగిస్తూనే ఉద్యమంలో పాల్గొనాని విజ్ఞప్తి చేశారు. ఈ విధంగా ఉద్యోగులను, విద్యార్థును ఉద్యమం నుంచి పక్కకు తప్పించారు. మర్రి చెన్నారెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రజాసమితి 1971 లో పార్లమెంటుకు జరిగిన మధ్యంతర ఎన్నికలలో 10 సీట్లు సాధించడం, ఆ ఎన్నికల్లో ఇందిరా గాంధీకి సంపూర్ణ ఆధిక్యత రావడంతో తెలంగాణా ప్రజాసమితి మద్దతు కీలకం కాకపోవడం,1971 సెప్టెంబర్ 24 న బ్రహ్మానంద రెడ్డి రాజీనామా చేసాక కొద్దిరోజులకు చెన్నారెడ్డి తెలంగాణా ప్రజా సమితిని రద్దు చేయడం, ఆ పార్టీని జాతీయ కాంగ్రెస్ పార్టీలో విలీనం చేయడం క్రమానుగతంగా జరిగి పోయాయి. అలా తొలి దశ ఉద్యమం నీరు గారి పోవడం తెలిసిందే... 2001 ఏప్రిల్ 27న కేసిఆర్ నేతృత్వంలోని తెరాస ఉద్యమ పార్టీ ఏర్పాటు కావడం, సుదీర్ఘ మలి ఉద్యమ పోరాటాల, అత్మ బలిదానాల ఫలితంగా, భారత ప్రభుత్వం 2 జూన్ 2014 ను తెలంగాణ నిర్మాణ దినంగా ప్రకటించడం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు జరగడం అందరికీ తెలిసిందే.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

## బహుముఖ ప్రజ్ఞాశాలి టి.ఎన్.ఆర్. - జనవరి 9...తుమ్మల నరసింహారెడ్డి జయంతి

టీఎన్ఆర్ గా జన బాహుళ్యానికి చేరువై, అతి తక్కువ సమయంలో ప్రజాదరణ పొందిన బహుముఖ ప్రజ్ఞుడు తుమ్మల నరసింహారెడ్డి. దర్శకుడు కావాలనుకుని సినీ పరిశ్రమలో కాలూని, కొన్నాళ్లు రచయితగా ఎల్బీ శ్రీరాం వద్ద పని చేసి, తర్వాత మీడియా లోకి వెళ్లి, యూట్యూబ్‌లో తనదైన శైలిలో ఇంటర్వ్యూలు చేస్తూ గుర్తింపు పొందడమే కాకుం డా, ఒక నటుడిగా అవకాశాలు చేజిక్కిం చుకుని, తెలుగు ప్రేక్షకులకు చేరు వైన ప్రతిభాశాలి ఆయన. టి. ఎన్. ఆర్ అంటే వెంటనే గుర్తుకు వచ్చేది ఐడ్రీమ్ మీడియాలో "ఫ్రాంక్లీ స్పీకింగ్ విత్ టిఎన్ఆర్. టి.ఎన్.ఆర్.గా పేరొందిన తుమ్మల నరసింహా రెడ్డి (1976 జనవరి 9 – 2021 మే 10) తెలుగు ఇంటర్వ్యూ హెూస్ట్, సినిమా జర్నలిస్టు, నటుడు. "ఫ్రాంక్లీ స్పీకింగ్ విత్ టి ఎన్ ఆరు పేరిట ఆయన నిర్వహించిన ఇంటర్వ్యూ సీరీస్ ద్వారా ప్రాచు ర్యం పొందాడు. పలువురు తెలుగు సినీ నటీనటులు, సాంకేతిక నిపుణులు, ఇతర ప్రముఖులను "ఫ్రాంక్లీ స్పీకింగ్ విత్ టిఎన్ఆర్ " షోలో భాగంగా ఇంటర్వ్యూ చేయ గా వాటిలో పలు వీడియోలు యూట్యూబ్‌లో విశేష ప్రాచుర్యం, ప్రేక్షకుల ఆదరణ, అగణిత వ్యూలు పొందాయి. తుమ్మల నరసింహారెడ్డి 1976 జనవరి 9న జన్మించాడు. స్వగ్రామం తెలంగాణ లోని నూతన మంచిర్యాల జిల్లా పావునూరు. తండ్రి రాజిరెడ్డి గ్రామ సర్పంచ్ గా మూడు సార్లు ఎన్నికైనాడు. హైదరాబాద్‌లోనిశ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో, వివేకవర్ధిని కళాశాలలో చదువుకుని డిగ్రీ పొందాడు. టి.ఎన్.ఆర్. దర్శకత్వంపై ఆసక్తితో డిగ్రీ పూర్తికాగానే సినిమా రంగం లోకి వచ్చాడు. 1992లో దేవదాస్ కనకాల వద్ద దర్శకత్వం గురించి నేర్చుకున్నాడు. సినిమా రచయిత ఎల్. బి. శ్రీరామ్ వద్ద సహాయ రచయితగా పని చేశాడు. ఆ తర్వాత టెలివిజన్ జర్నలిస్టుగా పలు టెలివిజన్ ఛానళ్ళలో పని చేశాడు. ఈటీవీలో ప్రసారమైన నేరాలు – ఘోరాలు కార్యక్రమానికి సంబంధించి కొన్ని ఎపిసోడ్స్ కు దర్శకత్వం వహించాడు. ఎన్ టీవీలో క్రైమ్ స్టోరీస్, క్రిమినల్ వంటి కార్యక్రమాలు రూపొందించి నిర్వహించాడు. ఐడ్రీమ్ మీడియాలో "ఫ్రాంక్లీ స్పీకింగ్ విత్ టిఎన్ఆర్" అన్న ఇంటర్వ్యూ సీరీస్‌లో ఇంటర్వ్యూయర్‌గా తెలుగు సినిమా ప్రముఖులను ఇంటర్వ్యూలు చేశాడు. ఈ కార్య క్రమం లోని పలు ఇంటర్వ్యూలకు యూట్యూబ్‌లో మిలియన్ల కొద్దీ వ్యూలు లభించా యి. 2018 అక్టోబరు నాటికే టిఎన్ఆర్ ఇంటర్వ్యూలకు కోట్ల వీక్షణలు లభించినట్టు పత్రికా కథనాలు. మొదట్లో దర్శకుడు తేజతో చేసిన ఇంటర్వ్యూ వైరల్ కావడంతో "ఫ్రాంక్లీ స్పీకింగ్ విత్ టిఎన్ఆరు ప్రారంభమైంది. రామ్ గోపాల్ వర్మ, కృష్ణ వంశీ, విజయ్ దేవరకొండ, మోహన్ బాబు వంటి సినిమా ప్రముఖులతో టిఎన్ఆర్ చేసిన ఇంటర్వ్యూలు బాగా ప్రాచుర్యం పొందాయి. 4 – 8 గంటల సుదీర్ఘ మైన సమయం ప్రేక్షకుల ఆసక్తి కోల్పోకుండేలా టి.ఎన్.ఆర్. పలువురు సినిమా ప్రముఖులను ఇంటర్వ్యూలు చేశాడు. కృష్ణవంశీ, తనికెళ్ళ భరణి వంటివారిని 4 గంటల పైచిలుకు ఇంటర్వ్యూలు చేశాడు. తాను గురువుగా భావించే ఎల్. బి. శ్రీరామ్ తో చేసిన ఇంటర్వ్యూ ఏకంగా 8 గంటల పాటు చేసి రికార్డు సృష్టించాడు. ఇంటర్వ్యూయర్‌గా ప్రాచుర్యం పొంది, తన ప్రతిభను బహిర్గత పరిచాక, ఆయనకు నటన అవకా శాలు పెరిగాయి. నేనే రాజు నేనే మంత్రి, జార్జ్ రెడ్డి, సుబ్రహ్మణ్య పురం, ఉమామహేశ్వర ఉగ్రరూ పస్య, జాతిరత్నాలు, ది రోజ్ విల్లా, నేడే విడుదల వంటి సినిమాల్లో టి.ఎన్.ఆర్. పాత్రలు పోషించాడు. కమెడియన్ సత్య హీరోగా సందీప్ కిషన్ నిర్మాతగా వివాహ భోజనంబు సినిమాలోనూ నటించాడు టిఎన్ఆర్. సర్కస్ సత్తిపండు, జై భజరంగ్ దళ్ , పిట్టల దొర వంటి ఎన్నో సినిమా లకు సహాయక దర్శకుడిగా పని చేశాడు. దర్శకుడిగా ఒక మంచి విలువ లున్న సినిమాను తీయాలని మదిలో తలచి, అందుకు స్క్రిప్ట్ కూడా రెడీ చేసుకుని,




ఆపై కొందరు నటీనటులతో సంప్రదింపులు కూడా జరిపి, కరోనా పాజిటివ్ రావడంతో హాస్పిటల్ లో చేరి, దర్శకునిగా రాణించాలనే కోరిక తీర కుండానే చివరి శ్వాస వరకు పోరాడుతూ కన్ను మూశాడు. సిని మాలలో మంచి మంచి పాత్రలు వేస్తూ తనకంటూ నటుడిగా ప్రత్యేక గుర్తింపు సంపాదించు కుంటున్న సమయం లోనే కోవిడ్ కోరలకు బలై, ప్రైవేట్ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందు తూ, కేవలం 46 ఏళ్ళకే టిఎన్ఆర్ 2021 మే 10న తనువు చాలించాడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

## నాలుగు దశాబ్దాల క్రితం ఎన్టీఆర్ తొలిసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం

ఎన్టీ రామారావు తొలిసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి 42 ఏళ్లు అయింది. అటు సినీరంగంలో అటు రాజకీయ రంగంలో మకుట రహిత మహారాజుగా ఖ్యాతిని ఆర్జించిన నందమూరి తారక రామారావు తొలిసారి ముఖ్యమంత్రిగా 1983 జనవరి 9వ తేదీన ప్రమాణ స్వీకారం చేశారు. తెలుగు, తమిళం, హిందీ భాషలలో కలిపి దాదాపు 400 చిత్రాలలో నటించి తెలుగు ప్రేక్షకుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిన తెలుగు కళామతల్లి ముద్దుబిడ్డ ఎన్టీఆర్... సినీ కళామతల్లి సేవలతో పాటు, ప్రజా సేవ కూడా చేయాలని నిర్ణయించుకొని, రాజకీయ పార్టీని స్థాపించి కేవలం తొమ్మిది మాసాల్లోనే ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ పార్టీ ఏకచ్ఛత్రాధిపత్యానికి తెరదించి, హస్తానికి అధికారాన్ని గతం చేసి, తెలుగుదేశం పక్షన హస్తగతం చేసుకున్నారు. మూడు విడతలు గా ఏడు సంవత్సరాల పాటు అవిభక్త ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా పని చేశారు. నాలుగు దశాబ్దాల సినీ ప్రస్థానంలో, పదమూడేళ్ల రాజకీయ జీవితంలో చిరస్మరణీయునిగా వెలుగొందారు ఆయన. విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు"గా ఖ్యాతిగాంచారు. 1982 మార్చి 29న తెలుగుదేశం పార్టీని స్థాపించి, కేవలం తొమ్మిది మాసాల కాల వ్యవధి లోనే, అప్పటి వరకు అప్రతిహతంగా కొనసాగిన కాంగ్రెస్ పాలనకు చరమగీతం పాడించి, ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనా పగ్గాలు చేత బుచ్చుకుని, ఎనిమి దేళ్ళు ముఖ్యమంత్రిగా, ప్రజల హృదయాలలో స్థిర స్థానం పొందారు. చిత్ర సీమలో రారాజుగా ఉన్న ఎన్టీఆర్ "ప్రజా సేవ" చేయడానికి నిర్ణయించు కున్నారు. 1982 మార్చి 21న మార్చి 29 సాయంత్రం, రాజకీయ పార్టీని స్థాపించ నున్నట్లు ప్రకటించి, "తెలుగు దేశం" అని పేరు ఖాయం చేశారు. తన "చేవ్రోలెటు కారునే "చైతన్య రథం"గా మార్పించి, దానిపై నలు మూలలా ఆంధ్రదేశ మంతటా పర్యటించి, ప్రచారం చేశారు. ఆంధ్రుల ఆత్మగౌరవ నినాదంతో, ప్రజల మనోభావాలను ప్రభావితం చేసి "ఢిల్లీలో తాకట్టు పెట్టిన ఆత్మగౌరవ పునరుద్ధరణ" పార్టీ లక్ష్యమని చాటి, ఎన్నికల బరిలో దిగి సర్వం తానే అయి, ప్రజాకర్షణతో, ఉద్వేగ భరితంగా, ఉద్రేక పూరితంగా ప్రసంగాలతో ప్రజా మద్దతు పొందారు. 1983 జనవరి 7న ప్రకటిత శాసన సభ ఫలితాలలో, 199 స్థానాలను సునాయాసంగా గెలుచుకొని, 97 ఏళ్ల కాంగ్రెస్ పాలనకు బ్రేక్ వేయ గలిగారు. ముఖ్యమంత్రిగా ఎన్టీ రామారావు 1983 జనవరి 9వ ప్రమాణ స్వీకారం చేశారు. 1984 ఆగస్టు 15న నాదెండ్ల భాస్కరరావు ద్వారా తొలిసారి




వెన్నుపోటు ఎదుర్కొని పదవి కోల్పోయారు ఎన్టీఆర్. అయితే ప్రజా పోరాటంతో నెలరోజుల్లోనే నాదెండ్ల భాస్కరరావు ప్రభుత్వాన్ని గద్దె దింప గలిగారు ఎన్టీఆర్. 1984 సెప్టెంబర్ 16న మరోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతర పరిణామాలలో... అసెంబ్లీ రద్దు చేసి 1985 మార్చ్ నెలలో ఎన్నికలకు వెళ్లి మరో సారి 200 పైగా సీట్లు సాధించారు. మార్చ్ 9న మూడవసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. అంటే వరుసగా 1983, 1984, 1985లో మూడు సంవత్స రాలు మూడుసార్లు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఘనత దక్కించు కున్నారు. 1989 ఎన్నికల్లో 73 సీట్లకే పరిమితమై ప్రతిపక్ష నేతగా నిలిచారు. 1994 ఎన్నికల్లో మళ్లీ గెలిచి 220 సీట్లు సాధించుకున్నారు. 1995 ఆగస్టులో రెండవసారి అల్లుడు చంద్రబాబు చేతిలో వెన్నుపోటుకు గురై...మళ్లీ పదవి కోల్పోయారు. వెండి తెర, రాజకీయ జీవితాల్లో వెలుగు వెలిగిన ఎన్టీఆర్ 1996 జనవరి 18న, 73 సంవత్సరాల వయసులో గుండెపోటుతో మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# 'అంటు'కుంది.. ఉపాధి!

కూసుమంచి : కూసుమంచి మండలం లోక్యాతండాకు చెందిన పలువురు యువకులు గతంలో ఉపాధి కోసం వలస వెళ్లేవారు. రాజమహేంద్రవరం,కడియంలో మామిడి మొక్కలను అంటుకట్టే కూలీ పనులు చేసేవారు. స్వగ్రామంలో మామిడి అంటు మొక్కల నర్సరీలు ఏర్పాటుచేస్తే లాభసాటిగా ఉండటంతో పాటు వందలాది మందికి ఉపాధి కల్పించవచ్చునని భావించారు. సుమారు 15ఏళ్ల క్రితం పది మంది యువకులు తమ వ్యవసాయ క్షేత్రాల్లో మొక్కల పెంపకాన్ని ప్రారంభించారు. వీరిని చూసి ఇంకొందరు ముందుకొచ్చారు. ఇప్పుడు లోక్యాతండాలో సుమారు 60 నర్సరీలు నిర్వహిస్తున్నారు. ఇక్కడి నుంచి నాణ్యమైన అంటు మొక్కలు ఎగుమతి అవుతున్నాయి.

**ఏప్రిల్ నుంచి పనులు**

నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ తదితర జిల్లాల్లో మామిడి టెంకలను ఏప్రిల్‌లో సేకరిస్తారు. ఆయా జిల్లాల్లో ఆంచూర్ కోసం మామిడి వినియోగం ఎక్కువ. అందుకే అక్కడ టెంకలు విరివిగా లభిస్తాయి. లక్ష మొక్కలు పెంచాలనుకునే నర్సరీ నిర్వాహకులు రెండు లక్షల టెంకలు సేకరిస్తారు. నర్సరీలకు చేరిన నాణ్యమైన మట్టిని ప్లాస్టిక్ సంచుల్లో నింపుతారు. ప్రతి పాకెట్‌కు 70 పైసల చొప్పున కూలీలకు



చెల్లిస్తారు. లక్ష మొక్కల నర్సరీ ద్వారా కూలీలకు రూ.70వేలు సమకూరుతాయి. పాకెట్లు నింపుతున్న కూలీలకు ఎరువు కలిపిన మట్టిని చేరవేసేందుకు పురుషులను నియమిస్తారు. ఒక్కొక్కరికి రూ.800 చొప్పున రూ.20వేలు వెచ్చిస్తారు.

అంటుకట్టేందుకు (గ్రాఫ్టింగ్) నిపుణులకు ప్రతి మొక్కకు రూ.2 చొప్పున నిర్వాహకులు చెల్లిస్తారు. ఈరకంగా రూ.2లక్షలు ఖర్చవుతాయి. కలుపు తీసేందుకు పది మంది చొప్పున కనీసం పది రోజుల పాటు కూలీలు అవసరం. వీరికి రూ.50వేలు చెల్లిస్తారు.

టెంకల శుద్ధి, మట్టి నింపిన సంచుల్లో టెంకలు నాటేందుకు 50 పైసల చొప్పున ఖర్చవుతుంది. తద్వారా రూ.50వేలు కూలీలకు చేరుతాయి. నాణ్యమైన మొక్కలు ఎంపిక (గ్రేడింగ్) చేసి అంటుకడతారు. డిసెంబర్ చివరి నాటికి అంటు మొక్కలను లారీల్లో ఎగుమతి చేస్తారు. 60 పైసల చొప్పున లక్ష మొక్కల ఎగుమతికి రూ.60వేలు చెల్లిస్తారు. టెంకల సేకరణ నుంచి మొక్కల ఎగుమతి వరకు లక్ష మొక్కల నర్సరీకి సుమారు రూ.16-18లక్షలు పెట్టుబడి పెడతారు.

ఖర్చులు పోనూ తొమ్మిది నెలలకు సుమారు రూ.6లక్షలకు పైగా ఆదాయం సముపార్జిస్తారు. ఈసారి అధిక వర్షాలతో ఆదాయం రూ.5లక్షల వరకు పరిమితమవుతోందని సమాచారం. ప్రతి సీజన్‌లో సుమారు 2వేల మందికి లోక్యాతండాలో ఉపాధి లభిస్తుండటం గమనార్హం. సుమారు లక్ష మొక్కలు పెంచే నిర్వాహకులు రూ.5.50 లక్షల వరకు కూలీలకు చెల్లిస్తున్నారు. లోక్యాతండా, సమీప గ్రామాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వేలాది మంది కూలీలు వస్తుంటారు.

వడ్తియా ధర్మా, నర్సరీ నిర్వాహకుడు

# టెండర్లకు అనూహ్య స్పందన

ఖమ్మం : రాష్ట్ర ప్రభుత్వ రంగసంస్థ ఖమ్మం విజయడెయిరీ నూతన దుకాణాల సముదాయానికి అనూహ్య స్పందన లభించింది. మొత్తం పది దుకాణాలకు సంబంధించి టెండరు ప్రక్రియ మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో పూర్తి చేశారు. అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి సమక్షంలో నిర్వహించిన కార్యక్రమంలో కమిటీ సభ్యులు, టెండరు దరఖాస్తుదారులు పాల్గొన్నారు. మొత్తం పది దుకాణాలకు గానూ 39 దరఖాస్తులు విక్రయించగా.. 33 మంది పాల్గొన్నారు. ఆరుగురు పాల్గొనలేదు. గత అక్టోబరు 30న అధికారులు టెండరు ప్రకటన విడుదల చేశారు. టెండరు ఫారం ధర రూ.1,000గా నిర్ణయించారు. ఈనెల 25 టెండరు గడువు పూర్తి కాగా ఒక రోజు ముందు వరకు కేవలం 8 మంది దాఖలు చేయగా.. చివరి రోజు 25 మంది పాల్గొన్నారు.

**ఊహించని రీతిలో..**

ఒక్కో దుకాణానికి నెలకు రూ.15వేల అద్దెతో పాటు ఈఎండీ రూ.20వేలు, సెక్యూరిటీ డిపాజిట్లు రూ.2లక్షల చొప్పున నిర్ణయించారు. అధికారులే ఆశ్చర్యపోయే విధంగా ఊహించని రీతిలో ఒక్కో దుకాణానికి గరిష్ఠంగా రూ.29,100, కనిష్ఠంగా రూ.17,800 చొప్పున దరఖాస్తుదారులు కోట్ చేయటం విశేషం. ఒకటో నంబరు దుకాణానికి అత్యధిక అద్దె కోట్ చేశారు. ప్రధాన రోడ్డు పక్కనే ఉ



ండటంతో ఇక్కడ ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని టెండరుదారులు పోటీపడి మొత్తం పది దుకాణాలకు కూడా నిర్ణయించిన దానికంటే ఎక్కువ అద్దెను కోట్ చేశారు. ఈ లెక్కన ఏడాదికి దుకాణాల సముదాయం ద్వారా రూ.2లక్షల వరకు డెయిరీకి ఆదాయం సమకూరనుంది. సెక్యూరిటీ డిపాజిట్ రూ.20లక్షల వరకు సంస్థలో నిల్వ ఉంటోంది.

**మంత్రి తుమ్మల ఆదేశాలతో..**

వాస్తవానికి దుకాణాలు నిర్మించి మూడు సంవత్సరాలు గడిచింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఖాళీగా ఉంటున్నాయి. ఇటీవల వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు డెయిరీని సందర్శించిన సమయంలో దుకాణాలు ప్రారంభించని విషయం ఆయన దృష్టికి వచ్చింది. వెంటనే సంబంధిత అధికారులను పిలిపించి టెండర్ల ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించడంతో పూర్తి చేశారు.

టెండర్ల ప్రక్రియ పూర్తి చేశాం. పది దుకాణాల ద్వారా ప్రతి నెలా డెయిరీకి ఆదాయం వస్తుంది. జిల్లాలో పాల సేకరణ, పాల అమ్మకాలను పెంచటంతో పాటు రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా నిలిపేందుకు కృషి చేస్తాం.

కె.రవికుమార్, డెయిరీ ఉపసంచాలకుడు, ఉమ్మడి ఖమ్మం జిల్లా

# కొలువుల కల.. వీసాల వల!




హైదరాబాద్ : హిమాయత్‌నగర్‌లోని ఓ కన్సల్టెన్సీ నిర్వాహకులు.. వారంలోనే వీసాలు, పక్కా ప్లేస్‌మెంట్ ఇప్పిస్తామంటూ ఏజెంట్ల ద్వారా ప్రచారం చేయించారు. ఎటువంటి విద్యార్హతలు, అనుభవం లేకుండానే విదేశాల్లో కొలువులనగానే ఎంతోమంది పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. నకిలీ వీసాలు అంటగట్టి 25 మంది నుంచి రూ.కోటి కాజేశారు. ..ఇలాంటి కేసుల్లో కొద్దిరోజులు కన్సల్టెన్సీల కార్యాలయాలు మూసివేస్తున్నారు. పేరు మార్చుకొని మరోచోట పాగా వేసి దోచుకుంటున్నారు. సామాజిక మాధ్యమాల్లో ఆకట్టుకునే ప్రకటనలు.. ఖరీదైన ప్రాంతాల్లో కార్యాలయాలు.. తక్కువ సమయంలో విదేశాల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామంటూ నకిలీ కన్సల్టెన్సీలు మోసాలకు పాల్పడుతున్నాయి. వీరి ద్వారా వర్క్‌పర్మిట్ వీసాపై విదేశాలకు వెళ్లిన కొందరు సైబర్, డ్రగ్స్ ముఠాల చేతుల్లో బానిసలుగా మారుతున్నారు. ఈ మోసాలపై కఠిన చర్యలకు పోలీసు యంత్రాంగం సిద్ధమైంది. విద్యాసంస్థలు, శిక్షణా కేంద్రాలున్న ప్రాంతాల్లో సదస్సులు నిర్వహించి అవగాహన కల్పించనున్నారు.

**ఎలా మోసపోతున్నారంటే..**

అమీర్‌పేట్, మాదాపూర్, ఎస్సార్‌నగర్, అబిడ్స్, నారాయణగూడ, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, కూకట్‌పల్లి పరిసర ప్రాంతాల్లో కార్యాలయాలు ప్రారంభిస్తారు. కమీషన్ ఇస్తామని ఏజెంట్లను ఏర్పాటు చేసుకుంటారు. టెలిగ్రామ్, స్నాప్‌చాట్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌ల్లో విదేశాల్లో ఉద్యోగాల పేరిట ప్రకటనలిస్తారు. నిజమని భావించి వెళ్లిన అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తారు. రిజిస్ట్రేషన్ ఫీజులు వసూలుచేస్తారు. గల్ఫ్ దేశాలకు పంపే వారికి విజిటింగ్, టూరిస్ట్‌వీసాలు అంటగడతారు. అమెరికా, జర్మనీ, ఆస్ట్రేలియా, జపాన్ తదితర దేశాలకు వెళ్లాలనుకునే వారికి నకిలీ వర్క్‌పర్మిట్‌లు, జాబ్ ఆఫర్ లెటర్లు చేతికిస్తారు. గతేడాది నకిలీల బారిన పడిన 750 మంది బాధితులు సుమారు రూ.200 కోట్లు పోగొట్టుకున్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**నిర్ధారించుకున్నాకే నిర్ణయం తీసుకోండి**

సామాజికమాధ్యమాలు, యూట్యూబ్‌ల్లో పోస్ట్ చేసే ప్రకటనలను ధ్రువీకరించుకోవాలి. ఆయా కన్సల్టెన్సీలపై ఏమైనా పోలీసు కేసులున్నాయనేది పరిశీలించాలి. ఇమ్మిగ్రేషన్ వెబ్‌సైట్ ద్వారా కన్సలెన్సీలు అందించిన జాబ్‌లెటర్, స్పాన్సర్‌షిప్ సర్టిఫికెట్లను ధ్రువీకరించుకోవాలి. గతంలో అక్కడ నుంచి ఉద్యోగం పొందిన వారికి ఫోన్ చేసి నిర్ధారించుకున్నాకే నిర్ణయం తీసుకోవాలి.

ఎం.శ్రీనివాసులు, అదనపు సీపీ, నగర సీసీఎస్

# దోపిడీ ఉచితం.. ఆదాయం అదనం



హైదరాబాద్: జీహెచ్ఎంసీ అధికారుల ఉదాసీనత కొన్ని వ్యాపార కేంద్రాలకు అదనపు ఆదాయ వనరుగా మారింది. పార్కింగ్ ఉచితమైనా..నగర ప్రజలను దోచేస్తున్నాయి. రూ.కోట్ల దందా జరుగుతున్నా ఆచూకీ తెలుసుకునే ప్రయత్నం కనిపించడం లేదు.

ఇవీ షరతులు: రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 1, 2018న నగరంలో ఉచిత పార్కింగ్ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. దీనికి కొన్ని షరతులూ ఉన్నాయి. షాపింగ్ మాల్, కమర్షియల్ కాంప్లెక్స్, మల్టీప్లెక్స్, ఇతర వ్యాపార కేంద్రాలకు వినియోగదారు వాహనంతో వెళ్లినప్పుడు.. తన వాహనాన్ని అరగంటపాటు ఉచితంగా పార్కింగ్ చేసుకోవచ్చు. ఏదేనీ వస్తువును కొనుగోలు చేస్తే గంట వరకు..

గంటకుపైగా వాహనాన్ని నిలిపితే మాత్రం.. కొనుగోలు చేసిన వస్తువు విలువ.. పార్కింగ్ సమయానికి విధించే రుసుముకన్నా అధికంగా ఉండాలి.

ఫీజు కడితేనే లోపలికి..


బేగంపేట్ మెట్రోస్టేషన్ వద్ద మైహోం ట్రైకూన్, వైట్‌హౌజ్ అనే వాణిజ్య కేంద్రాలున్నాయి. వాటిలో పదుల కొద్దీ షాపింగ్ కేంద్రాలు ఉన్నాయి. కార్లు, ద్విచక్ర వాహనాలతో రోజూ వేయి మందికిపైగా సందర్శిస్తారు. లోపలికి ప్రవేశించగానే పార్కింగ్ తాత్కాలిక రసీదు చేతిలో పెట్టి, కారుకు రూ.50, ద్విచక్ర వాహనానికి రూ.20 చొప్పున వసూలు చేస్తున్నారు.

మైత్రివనం చౌరస్తాలోని ఆదిత్య ఎన్‌క్లేవ్, అబిడ్స్, కోఠి, పంజాగుట్ట, దిల్‌సుఖ్‌నగర్‌లోని వాణిజ్య కేంద్రాల్లోనూ ఈ దందా జరుగుతోంది.

వీళ్లేం చేస్తున్నారో..:

జీహెచ్ఎంసీలో గతంలో ఈవీడీఎం(ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్) విభాగం ఉండేది. దానిని హైడ్రాగా మార్చారు. ఆ బాధ్యతను నిర్వర్తించాల్సిన జీహెచ్ఎంసీ అధికారులు..తమకు సంబంధమేలేనట్టు వ్యవహరిస్తున్నారు.

# జల వలయం.. నగరానికి అభయం



హైదరాబాద్: వేగంగా విస్తరిస్తున్న మహానగరంలో అన్ని ప్రాంతాలకు అంతరాయం లేని తాగునీటి సరఫరా వ్యవస్థ ఏర్పాటుకు జలమండలి భారీ కార్యాచరణ సిద్ధం చేస్తోంది. కృష్ణా, గోదావరి, సింగూరు, మంజీరా, ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలవనరులను అనుసంధానం చేస్తూ నగరం చుట్టూ 140 కిలోమీటర్ల పరిధిలో రేడియల్ రింగ్ మెయిన్‌ను ఏర్పాటు చేయనుంది. రింగ్ మెయిన్‌ను అనుసంధానం చేస్తూ మరో 96 కిలోమీటర్ల మేర పైపులైన్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయనున్నారు. రూ.8 వేల కోట్ల వ్యయంతో ఈ భారీ ప్రాజెక్ట్ చేపడుతున్నట్లు జలమండలి ప్రకటించింది.

**రింగ్ మెయిన్ అంటే?**

నగరానికి అంతరాయం లేని నీటి సరఫరా కోసం ఏర్పాటు చేయనున్న ప్రధాన పైప్‌లైన్ నెట్‌వర్క్ రింగ్ మెయిన్. ప్రధానంగా ఓఆర్ఆర్ వెంబడి దీన్ని ఏర్పాటు చేయాలనేది ప్రతిపాదన. రింగ్ మెయిన్‌కు అనుసంధానంగా వివిధ ప్రాంతాలను కలుపుతూ ప్రత్యేకంగా పైపులైన్లు ఏర్పాటు చేస్తారు. **ఎందుకోసం..?** రాజధానికి తొలుత జంట జలశయాల నుంచి తాగునీరు అందేది. తర్వాత సింగూరు, మంజీరా తోడయ్యాయి. తాగునీటి అవసరాలు పెరగడంతో కృష్ణా, గోదావరి నదుల నుంచి నీటిని తీసుకుని శుద్ధి చేసి సరఫరా చేస్తున్నారు. కొన్నేళ్లుగా మంజీరా పైపులైన్లు మరమ్మతులకు గురవుతున్నాయి. కృష్ణా, గోదావరి పైపులైన్లకు ఆటంకం ఏర్పడినా, ఇతర సమస్యలు ఎదురైనా సరఫరాకు అంతరాయం తప్పడం లేదు. నగరానికి నీటిని అందించేందుకు వనరులు ఉన్నా అనుసంధానం కాకపోవడంతో పలు ప్రాంతాలపై ప్రభావం పడుతోంది.ఏ ప్రాంతంలోనూ అంతరాయంలేని నీటి సరఫరాకు రింగ్ మెయిన్ ఉపకరిస్తుందని జలమండలి ఉన్నతాధికారులు వివరిస్తున్నారు. మరో రెండేళ్లలో గోదావరి 2, 3 దశలు అందుబాటులోకి వస్తుండటంతో అన్ని వనరులను రింగ్‌మెయిన్ ద్వారా అనుసంధానం చేస్తే నీటిని అందించేందుకు సానుకూలత ఏర్పడుతుందని అధికారులు పేర్కొంటు న్నారు. ప్రయోజనాలు ఒక ప్రాంతంలో మరమ్మతులు ఏర్పడినా.. ఇతర ప్రాంతాలపై ప్రభావం పడకుండా నీటిని అందించడం. 24 గంటల నీటి సరఫరా లక్ష్యంలో కీలకమైన వ్యవస్థ.అన్ని ప్రాంతాలకు సమాన ఒత్తిడితో నీరు అందించడం

# నైపుణ్య శిక్షణ.. ఉపాధికి నిచ్చెన..!

ఖమ్మం : ఏటీసీ(ఐటీఐ)లను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం వివిధ రకాల కోర్సులను ప్రవేశపెడుతోంది. పారిశ్రామిక అవసరాలు తీర్చటానికి మార్కెట్లో డిమాండ్ ఎక్కువగా ఉన్న కోర్సులను ఎంపిక చేసి నిరుద్యోగులకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. ఇలాంటి పలు రకాల కోర్సులకు అర్హుల నుంచి ఖమ్మం నగరం టేకులపల్లిలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. తద్వారా యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించాలని సర్కారు భావిస్తోంది. కేవలం పదోతరగతి అర్హతపైనే ఈకోర్సులు చదువుకునే అవకాశముంది. ఎలాంటి వయోపరిమితి లేకపోవటం విశేషం. నైపుణ్య శిక్షణ ద్వారా సొంతంగా యూనిట్లు నెలకొల్పవచ్చు లేదా ప్రైవేటుగా ఉద్యోగాలు చేసుకోవచ్చు. ప్రస్తుతం మార్కెట్లో టర్నర్, సోలార్ టెక్నీషియ




న్, డ్రోన్ ఆపరేటర్ లాంటి కోర్సులకు ఎక్కువ డిమాండ్ ఉంది.

**మొదలైన రిజిస్ట్రేషన్ ప్రక్రియ..**

ప్రధానమంత్రి కౌశల్ పథకం ద్వారా ఖమ్మం ఏటీసీలో వివిధ రకాల స్వల్పకాలిక కోర్సులను ప్రవేశపెట్టారు. ఈ కోర్సులకు మూడు నెలల పాటు శిక్షణ ఇస్తారు. ట్రైనింగ్ పూర్తయినట్లు సర్టిఫికెట్ జారీ చేస్తారు. ఈ కోర్సులకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలైంది.

**కులవృత్తుల వారికీ..**

పీఎం విశ్వకర్మ యోజన ద్వారా కులవృత్తుల వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఇవి కేవలం 15 రోజుల కోర్సులు మాత్రమే. ప్రస్తుతం కార్పెంటర్(వడ్రంగి) పనిలో 20 మందికి శిక్షణ ఇచ్చేందుకు పేర్లు నమోదు చేసుకున్నారు. త్వరలోనే శిక్షణ మొదలుపెడతారు. 'విద్యార్థులు స్వల్పకాలిక కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి. గ్రామీణ ప్రాంతాల్లోని కులవృత్తులవారు తమ నైపుణ్యం పెంచుకునేందుకు ఇక్కడ శిక్షణ పొందవచ్చు. మార్కెట్లో డిమాండ్ ఉన్న కోర్సులకు అనుగుణంగా తర్ఫీదు ఇస్తాం' అని ప్రిన్సిపల్ ఎ.శ్రీనివాసరావుకు తెలిపారు.

# నోరూరించే.. నాంచారి పచ్చళ్లు

ఇల్లెందు : మెప్మా రుణాలు మహిళల ఆర్థికాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతున్నాయి. ఏదైనా వ్యాపారం చేసి ఆర్థికంగా ఎదగాలనే మహిళలకు మెప్మా అందిస్తున్న రుణాలు భరోసానిస్తున్నాయి. మెప్మా ద్వారా తీసుకున్న రుణంతో వ్యాపారం ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి పొందుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్న పట్టణానికి చెందిన గిరిజన మహిళగొగ్గెల నాంచారిపై ప్రత్యేక కథనం..

ఇల్లెందు పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన నాంచారి 18 ఏళ్ల క్రితం మెప్మాలో చేరి మణికంఠ గ్రూపు ద్వారా రూ.50వేలు రుణం తీసుకుని అల్లికలు, మగ్గం పనులు చేసేవారు. ఆ పనిలో ఆశించిన అభివృద్ధి లేకపోవడంతో మరో వ్యాపారం చేయాలని నిర్ణయించుకున్నారు. నాంచారి వంటలు ఎంతో రుచికరంగా ఉంటాయని పలువురు ప్రోత్సహించడంతో ఆమెకు పచ్చళ్లు తయారు చేయాలనే ఆలోచన వచ్చింది. 8 ఏళ్ల క్రితం పచ్చళ్లు తయారు చేయడం ప్రారంభించారు. మొదట్లో మామిడి, ఉసిరి, కాకర, టమాటా, పచ్చిమిర్చి, నిమ్మకాయ వంటి పచ్చళ్లు తయారు చేసి సింగరేణి కార్మిక కుటుంబాలకు విక్రయించేవారు. దశలవారీగా వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకుని చికెన్, చేప, నాటు కోడి, ప్రాన్స్ తదితర పచ్చళ్లు తయారు చేసి విక్రయించడం ప్రారంభించారు. ప్రస్తుతం రూ.2 లక్షల రుణం తీసుకుని రుచికరమైన పచ్చళ్లు చేయడంతో ఆర్డర్లు పెరిగి కుమారుడు ప్రశాంత్, కోడలు భవానీ సైతం పచ్చళ్ల తయారీలో నిమగ్నమై చేతి నిండా సంపాదించుకుంటున్నారు.

ఆర్నెళ్లుగా విదేశాలకు కొరియర్ ద్వారా వివిధ రకాల పచ్చళ్లు ఎగుమతి చేస్తున్నారు. ఇల్లెందులోని తన కుమారుడి దుకాణంలోనూ విక్రయాలు చేస్తున్నారు. నెలకు రూ. 40 వేలకు పైగా సంపాదిస్తున్నానని నాంచారి అన్నారు. కిలో చికెన్ పచ్చడి రూ.1000, ఉసిరి కాయ పచ్చడి పావుకిలో రూ.150 చొప్పున అమ్ముతున్నానన్నారు.

విదేశాలకు ఎగుమతి..నాంచారి తయారు చేసే పచ్చళ్లు ఇంటి వద్ద అమ్మడంతోపాటు, ఇల్లెందు, చుట్టు పక్కన మండలాలు, ఖమ్మం, కొత్తగూడెం, ఆంధ్రప్రదేశ్‌లోని జంగారెడ్డిగూడెంనకు సరఫరా అవుతున్నాయి. సింగరేణి కార్మికుల కుటుంబాల్లోని పిల్లలు చాలా మంది అమెరికా, దుబాయ్ వెళ్లి స్థిరపడిన వారున్నారు. ఆమె పచ్చళ్లకు అలవాటు పడిన వారంతా ఆర్డర్లపై కుటుంబ సభ్యులతో తెప్పించుకుంటున్నారు. తేగాక సామాజిక మాధ్యమాలను ఆమె వినియోగించుకుంటూ పచ్చళ్ల వ్యాపారాన్ని పెంపొందించుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు.

# అసంపూర్తి రోడ్డుతో అవస్థలు

ఖమ్మం : ఖమ్మం నగరంలోని వెలుగుమట్ల అర్బన్ పార్కుకు వెళ్లే రోడ్డు అసంపూర్తిగా ఉంది. నిర్మాణ పనులు నిలిచిపోవటంతో రాకపోకలకు ఇబ్బందవుతోంది. నిత్యం వేల మంది ఈ రహదారిలోనే అటవీ పార్కును సందర్శించేందుకు వెళ్తుంటారు. రోడ్డు నిర్మాణం కోసం 2024, నవంబరు నెలలో నగరపాలక సంస్థ నిధులు రూ.2కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో వైరారోడ్డు నుంచి పార్కు వరకు సీసీ రోడ్డును, డివైడర్లను అభివృద్ధి చేయాల్సి ఉంది. ప్రధాన రోడ్డు నుంచి కొద్ది దూరం వరకు రోడ్డు పూర్తి కాలేదు. కంకరలేచి ఉంది. అదేవిధంగా మధ్యలో కొంతదూరం వరకు డివైడర్లను నిర్మించారు. వాటికి ఇరువైపులా ఉన్న రోడ్డును ఇంతవరకు పూర్తి చేయలేదు. స్థల వివాదం నేపథ్యంలోనే పనులకు బ్రేక్ పడిందని తెలుస్తోంది. ఇంకోపక్క కంకర లేచి ఉండటంతో సందర్శకులు నడవాలంటే అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. పార్కు నుంచి బయలుదేరి ప్రధాన రోడ్డు వరకు రావాలంటే తల ప్రాణం తోకకు వచ్చినట్టవుతోంది. ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలు సైతం వెళ్లేందుకు కూడా రోడ్డు అనుకూలంగా లేదు. శని, ఆదివారాల్లో పార్కుకు సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. పబ్లిక్ హెల్త్ డిపార్టుమెంట్ అధికారులను వివరణ కోరగా నిర్మాణ స్థలం తమదంటూ కొందరు ప్రతిఘటించటంతో పనులు నిలిచిపోయినట్టు తెలిపారు.

## అక్రమార్కులను హడలెత్తించిన హైడ్రా

హైదరాబాద్: సికింద్రాబాద్ బుద్ధభవన్‌లో హైడ్రా నిర్వహించిన ప్రజావాణిలో 37 ఫిర్యాదులందగా.. అదనపు కమిషనర్ ఆర్.సుదర్శన్ అర్జీలను స్వీకరించారు. ప్రాథమిక సమాచారాన్ని పరిశీలించి.. విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎల్బీనగర్‌లోని వెంకటేశ్వర కాలనీ ఫేజ్-2 లేఅవుట్‌లో 1200 గజాల స్థలాన్ని బస్టాపు కోసం కేటాయించగా.. తప్పుడు పత్రాలతో కొందరు కబ్జా చేశారంటూ స్థానికులు హైడ్రాను ఆశ్రయించారు.
హైడ్రా ప్రగతినగర్ చెరువు(అంబీర్ చెరువు) సంరక్షణ చర్యలను ప్రారంభించారు. మొదటి రోజే 30 ట్రక్కుల వ్యర్థాలను తొలగించామని



రంగనాథ్ తెలిపారు.

**రూ.2,500 కోట్ల విలువైన భూమికి కంచె..**
నార్సింగి మండలం నెక్నాంపూర్‌లో సర్వే నెంబరు 20లోని 23ఎకరాల 16గుంటల భూమిని చెరబట్టేందుకు కొందరు ప్రయత్నిస్తుండగా.. హైడ్రా వారి చర్యలను అడ్డుకుంది. మార్కెట్లో ఆ భూమి విలువ రూ.2,500 కోట్లని, రేకుల షెడ్లు, గోడల నిర్మాణాలను తొలగించినట్లు కమిషనర్ వెల్లడించారు.

## సాగే బలం.. శ్రమే ఆయుధం

హైదరాబాద్: రైతుకు తెలిసింది సాగు ఒక్కటే. తెల్లవారుజామునే పొలానికి పరుగు తీస్తారు. కష్టమొచ్చినా.. నష్టమొచ్చినా వ్యవసాయమే ఊపిరిగా సాగుతారు. శ్రమను ఆయుధంగా చేసుకొని సాగు ఒడిని నమ్ముకుంటాడు. రైతన్న అందరి ఆకలి తీర్చేందుకు శ్రమిస్తారు. ఇదే క్రమంలో కొందరు తమ రెక్కల కష్టంతో పిల్లలను వృద్ధిలోకి తీసుకురాగా, మరికొందరు ఉన్నతవిద్యాభ్యాసం పూర్తిచేసి పొలం వైపే అడుగేయడం విశేషం. నేడు రైతు దినోత్సవం సందర్భంగా వారిపై కథనం.

**కొలువుకు గుడ్ బై చెప్పి..**
సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం మంబాపూర్‌కు చెందిన హనీఫ్ పీజీ పూర్తిచేశారు. అనంతరం పోలీసు ఉద్యోగానికి ప్రకటన వెలువడటంతో దరఖాస్తు చేశారు. అన్ని పరీక్షల్లో ఉత్తీర్ణులై కానిస్టేబుల్‌గా విధుల్లో చేరారు. ఈ క్రమంలో వ్యవసాయంపై మక్కువతో కొలువు వదులుకొని స్వగ్రామానికి చేరుకున్నారు. సొంతూరిలో ఆరెకరాలను కౌలుకు తీసుకొని సాగుకు ఉపక్రమించారు. స్వల్ప కాలంలో చేతికొచ్చే కూరగాయలను నమ్ముకున్నారు. ప్రధానంగా బీర, కాకర, సొర, టమాట వంటి తీగ జాతి రకాలను మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా పండిస్తున్నారు. ప్రతి నెలా అన్ని రకాలకు కలిపి క్వింటా వరకు దిగుబడి వస్తోంది. వీటి విక్రయంతో రూ.70 వేల వరకు ఆర్జిస్తూ సాగుతున్నారు.
గుమ్మడిదల

**కలెక్టర్‌గా తీర్చిదిద్ది..**
సిద్దిపేట జిల్లా కొండపాకకు చెందిన బుద్ధి లలిత, నరేష్ దంపతులది సాధారణ రైతు కుటుంబం. వీరికి ఇద్దరు సంతానం అఖిల్, అజయ్. నరేష్ నిత్యం తెల్లవారగానే పొలానికి వెళ్లడమే అలవాటు. తమకున్న వరి, పత్తి, మొక్కజొన్న సాగు చేస్తూ ఇద్దరు పిల్లలను చదివించారు. పంటల సాగునే నమ్ముకున్న నరేష్.. తన పిల్లలను అన్ని రకాలుగా ప్రోత్సహించారు. ఈయన కష్టాన్ని చూసిన అఖిల్ చిన్నప్పటి నుంచి తండ్రికి చేదోడువాదోడుగా ఉంటూ వచ్చారు. ఎలాగైనా ఉన్నత స్థాయికి చేరాలన్న ఉద్దేశంతో కష్టపడి చదివారు. బీటెక్ పూర్తిచేశాక సివిల్స్‌కు సిద్ధమయ్యారు. ఇంట్లోనే ఉండి పరీక్ష రాశారు. రెండు సార్లు ఫలితం దక్కకపోయినా తండ్రి ప్రోత్సాహంతో మూడో సారి ఉత్తీర్ణులయ్యారు. ప్రస్తుతం పాండిచ్చేరిలో సబ్‌కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.
కొండపాక

**అసంతృప్తిని వీడాలని..**
మెదక్ జిల్లా పాపన్నపేటకు చెందిన రాములు, రాములమ్మ దంపతుల చిన్న కుమారుడు నర్సింహ (విక్కి).. పీజీ పూర్తిచేశారు. రెండేళ్ల పాటు కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో పరిశోధకుల వద్ద పని చేశారు. ఐదంకెల వేతనం పొందారు. అయినా అసంతృప్తి వెంటాడింది. అదే సమయంలో ఉద్యాన శాఖలో పని చేసే ఇతడి మిత్రుడు సాగుతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేశారు. అంతే దాన్నే జీవనాధారం చేసుకోవాలని నర్సింహ వెంటనే స్వగ్రామానికి వచ్చేశారు. తమకున్న 35 ఎకరాలలో కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్నారు. సేంద్రియ ఎరువులు వాడుతున్నారు. అన్ని రకాలు కలిపి ప్రతి నెలా 200 క్వింటాళ్ల మేర దిగుబడి వస్తోంది. వాటి విక్రయంతో రూ.1.50 లక్షలకు పైగా ఆర్జిస్తున్నారు. మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా ముందుకు సాగుతున్నారు. మెదక్ టౌన్, పాపన్నపేట

## చాటుమాటుగా కాదు.. దర్జాగా..

రామచంద్రాపురం : పేదల కోసం ప్రభుత్వం అందజేస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. అక్రమాల కట్టడికి ప్రభుత్వం ఎన్ని చర్యలు చేపడుతున్నా, ఫలితం ఉండటం లేదు. అక్రమార్కులకు అధికారులే అండగా నిలుస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. స్థానికంగా ఇటీవల చోటుచేసుకున్న ఘటనలు ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.
**పాత భవనాల్లో నిల్వ**పటాన్‌చెరు, రామచంద్రాపురం శివారు ప్రాంతాల్లో ఇటీవల రేషన్ సన్న బియ్యం అక్రమ తరలింపు ఘటనలు పెరిగాయి. శివారులోని పలు ప్రాంతాల నుంచి తక్కువ ధరకు ప్రజల నుంచి సేకరిస్తున్నారు. ఆ బియ్యాన్ని ఓఆర్ఆర్ సమీప ప్రాంతాల్లోని పాత భవనాల్లో నిల్వ చేస్తున్నారు. అనంతరం ప్రత్యేక వాహనాల ద్వారా మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్ తదితర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ఆరు నెలల పరిధిలో 13 కేసుల్లో 200 టన్నులకు పైగా బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు.
**అనేక అనుమానాలు** తాజాగా చిట్కుల్‌లో రేషన్ బియ్యాన్ని గుర్తించిన స్థానికులు అధికారులకు సమాచారం ఇచ్చారు. సంబంధిత అధికారి అక్కడకు చేరుకొని బియ్యాన్ని సీజ్ చేశారు. రేషన్ దుకాణం నుంచి వచ్చిన బస్తాలు వచ్చినట్లే ఉండటంతో అంతా విస్మయానికి గురయ్యారు. ఆ బియ్యం ఎక్కడి నుంచి వచ్చాయో మరుసటి రోజు తేల్చుతామని అధికారులు చెప్పారు. ఇప్పటికీ తేల్చలేదు.
ముత్తంగిలో ఓ పాత షెడ్డులో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేసిన విషయాన్ని స్థానికులు అధికారులకు తెలిపినా.. చర్యలు కరవైన తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**ఇకపై విజిలెన్స్ అధికారుల తనిఖీలు**
– అనూప్, ఉప తహసీల్దార్, పౌరసరఫరాల విభాగం
విషయం తెలియగానే ఘటనా స్థలికి చేరుకొని బియ్యాన్ని సీజ్ చేస్తున్నాం. ఇకపై పౌర సరఫరాల అధికారులే కాకుండా విజిలెన్స్ అధికారులు సైతం అక్రమ రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకునే అధికారాన్ని ప్రభుత్వం కల్పించింది. తనిఖీలు ముమ్మరం చేసి, అక్రమ దందాను అడ్డుకుంటాం.

# వాడపల్లి.. పర్యాటక హోదా ఏదీ..!



దామరచర్ల : వాడపల్లి.. పడమర నుంచి దక్షణంగా ప్రవహించే కృష్ణా, ఉత్తరం నుంచి తూర్పునకు ప్రవహించే మూసీ నదుల సంగమ క్షత్రం. ఇక్కడే శ్రీమీనాక్షఅగస్త్యేశ్వరస్వామి కొలువై ఉన్నారు. రోజూ వందలాది మంది భక్తులు సంగమంలో పుణ్య స్నానాలు ఆచరిస్తారు. జీవ నదుల గలగలలు, ప్రకృతి రమణీయత, కాకతీయులు నిర్మించిన కోటలు, రెడ్డి రాజుల కాలం నాటి చారిత్రక కట్టడాలు వాడపల్లికి పర్యాటక శోభను తెచ్చిపెట్టాయి. ఈ క్షత్రానికి నేటికీ పర్యాటక హోదా దక్కడం లేదు.

**చారిత్రక విశేషాలు..**
సుమారు ఆరువేల ఏళ్ల క్రితం అగస్త్యేశ్వర మహాముని శివకేశవుల విగ్రహాలను కావడిలో పెట్టుకొని దక్షణ మండల యాత్రకు బయలుదేరాడు. ఈ ప్రాంతాని(వాడపల్లి)కి వచ్చే సరికి సంధ్యా సమయమైంది. కావడిని సమీపంలో ఉన్న గొల్లవాడికి ఇచ్చి సంధ్యవార్చుకొని వచ్చే సరికి పిల్లవాడు అక్కడ లేకపోవడం.. కావడిని ఎత్తుకుని బయలుదేరేందుకు ముని సిద్ధమవగా 'ఇది పవిత్ర స్థలం.. మేము ఇక్కడే కొలువుదీరి ఉంటాం..' అని ఆకాశవాణి పలకడంతో ఆయన శివకేశవులను ఇక్కడే ప్రతిష్ఠించారని స్థలపురాణాన్నిబట్టి తెలుస్తోంది. ఆ తర్వాతి కాలంలో 1270లో అనభీమారెడ్డి, అనవేమారెడ్డి సోదరులు ఈ ప్రాంతంలో పట్టణ నిర్మాణానికి భూమిని చదునుచేస్తుండగా శివకేశవుల విగ్రహాలు లభించడంతో శివుడికి శ్రీమీనాక్షఅగస్త్యేశ్వరస్వామి ఆలయం, కేశవుడికి శ్రీలక్ష్మనరసింహ స్వామి ఆలయం నిర్మించినట్లు పేర్కొంటున్నారు. పూర్వ కాలంలో ఈ ప్రాంతాన్ని 'బద్రికావనం' అని పిలిచేవారని తెలుస్తోంది. దేవాలయాల సమీపంలో కృష్ణా, మూసీ నదుల సంగమం గుండా ఓడల్లో అప్పటి పాలకులు వివిధ దేశాలతో వ్యాపార లావాదేవీలు చేశారని.. అందుకే ఈ ప్రాంతాన్ని ఓడపల్లె అని పిలిచేవారని.. కాలక్రమంలో వాడపల్లిగా పరిణామం చెందిందని చరిత్రకారులు పేర్కొంటున్నారు.
కృష్ణానది ఒడ్డున ముస్లిం ప్రభువుల ప్రతినిధి వజీర్ సుల్తాన్ పేరుమీద ఒక అతిథి గృహం నిర్మించారు. రెండు నదుల సంగమ స్థలి సమీపంలో మూసీ నది ఒడ్డున మూసీ నది నీరు ప్రతి రోజూ కృష్ణానదిలో ఎంతమేరకు కలుస్తుందో లెక్కించే నిమిత్తం నిజాం నవాబు నిర్మించి 'నీటి లెక్కింపు కేంద్రం' నేటికీ అలాగే ఉంది.
**ఆలయాల ప్రత్యేకత**శ్రీమీనాక్షఅగస్త్యేశ్వరస్వామి గర్భగుడి మూలవిరాట్ శివలింగం పైభాగాన పదివేళ్లు పట్టే రంధ్రం ఉంది. ఇందులో నీరు తోడిపోసిన కొద్దీ ఉబికి వస్తుంది. శ్రీలక్ష్మనరసింహస్వామి ఆలయంలో స్వామివారి విగ్రహం ఎదుట ఉన్న రెండు దీపాలలో ఒకటి కదులుతూ.. మరొకటి నిశ్చలంగా ఉంటుంది. వాడపల్లిలో ప్రతి పన్నెండేళ్లకు కృష్ణా పుష్కరాలు ఘనంగా జరుగుతాయి. వివిధ ప్రాంతాల ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరిస్తారు. ప్రసిద్ధ క్షత్రానికి పర్యాటకంగా గుర్తింపు తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

# చోదకా..పాటించు పంచతంత్రం




మిర్యాలగూడ : సమాజాన్ని పట్టి పీడిస్తున్న ప్రధాన సమస్యల్లో రోడ్డు ప్రమాదాలు ముఖ్యమైనవి. వీటి బారిన పడి అనేక మంది మృతి చెందుతుండగా వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఇందుక్కారణం వాహన చోదకుల్లో ఏకాగ్రత లోపమే ముఖ్య కారణమని అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో అనేక మంది రోడ్డు ప్రమాదాల బారిన పడుతూ జీవితాలను చిన్నాభిన్నం చేసుకుంటున్నారు. వీటి నివారణకు పంచతంత్రాల వంటి ఈ సూచనలు పాటిస్తే ఏకాగ్రత కోల్పోకుండా ఉండొచ్చని నిపుణులు సూచిస్తున్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా ఈ కథనం..
సరైన నిద్ర: వాహన చోదకులకు సరైన నిద్ర ఎంతో ముఖ్యం. నిద్రలేమితో బండి నడపడం వల్ల ఏకాగ్రత కోల్పోయి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. రాత్రి వేళ, తెల్లవారుజామున జరుగుతున్న ప్రమాదాల్లో అత్యధిక శాతం నిద్రలేమితో జరుగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఈ కారణాలతో జరిగేవి 30శాతం వరకు ఉన్నాయి.

**సమస్యలు వీడాలి**
డ్రైవింగ్ విధులకు వెళ్లే ముందు కుటుంబ సమస్యలను విడిచిపెట్టాలి. వీటి కారణంగా వాహనాలు నడిపేటప్పుడు ఏకాగ్రత కరవై ప్రమాదాలు జరిగే శాతం అధికమవుతుంది. ఒక్కోసారి చోదకులు విచక్షణ సైతం కోల్పోయే ప్రమాదం ఉంది. దీంతో ప్రమాదాలకు కారణమవుతున్నారు.

**చరవాణి వద్దు బాసూ**
ప్రస్తుత కాలంలో చరవాణి లేని జేబు, చెయ్యి లేదంటే అతిశయోక్తి కాదేమో. వాహనం నడిపేటప్పుడు చరవాణిలో మాట్లాడడం, చూడడం వల్ల చూపు దారి తప్పే అవకాశముంది. అవతలి వ్యక్తులతో సంభాషణ, కొన్ని వీడియోలు డ్రైవర్‌పై ప్రభావం చూపుతాయని నిపుణులు చెబుతున్నారు.

**మద్యం తాగావా..**
మద్యం మత్తు సైతం చోదకునికి విచక్షణ లేకుండా చేస్తుంది. అనుక్షణం అప్రమత్తంగా ఉండి ఎప్పుడు బ్రేక్ వేయాలి, ఎక్కడ యాక్సిలరేటర్ వాడాలి అనే ఆలోచన లేకుండా చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఇలా అధిక ప్రమాదాలకు మందు బాబులే కారణమవుతున్నారు.

**అంత వేగం వద్దన్నా..**
రోడ్డు ప్రమాద కారకాల్లో ముఖ్యమైనది అతివేగం. బండి వేగంగా ఉన్నప్పుడు అకస్మాత్తుగా ఎదురయ్యే ప్రమాదాలను డ్రైవర్ అంచనా వేయలేకపోతాడు. అతి వేగంలో చిన్న ఘటన జరిగినా ఆందోళనలో పెను ముప్పునకు దారితీయొచ్చు. ఉమ్మడి జిల్లాలో జరుగుతున్న ప్రమాదాల్లో ఇలా 40శాతం పైగా ఉన్నట్లు అంచనా.

# నేను.. మీ శిరోధైర్యాన్ని..!

మిర్యాలగూడ : నా గురించి అధికారులు, ప్రభుత్వాలు అవగాహన కల్పిస్తున్నా, వివిధ రూపాల్లో ప్రచారం చేస్తున్నా మీరు పెడచెవిన పెడుతూనే ఉన్నారు. దీంతో మీరూ నన్ను ధరించకుండా ప్రయాణాలు సాగిస్తూ ప్రాణాలు గాల్లో కలిపేసుకుంటూ మీ కుటుంబ సభ్యులను రోడ్డున పడేస్తున్నారు. ఈ బాధను చూడలేక మీ ప్రాణాలకు రక్షణ కల్పించాలని నా ప్రాధాన్యత గురించి వివరించేందుకు మీ ముందుకు వచ్చాను. ఇంతకీ నేనెవరో ఈ పాటికి మీకు అర్థమయ్యే ఉంటుంది. అవునండీ నేనే హెల్మెట్‌ను.

నేను లేక 30 శాతం ప్రమాదాలు..
దేశంలో జరుగుతున్న ప్రమాదాల్లో 30శాతం పైగా నేను లేకపోవడం వల్లనే జరుగుతున్నాయి. మిర్యాలగూడకు చెందిన ఓ యువకుడు నేను ఇంట్లో ఉన్నప్పటికీ భారం ఎందుకని నన్ను ఎప్పుడూ ఉపయోగించేవాడు కాదు. కొద్ది రోజులకు ఆ యువకుడు వాహనంపై వెళ్తుండగా లారీ ఢీకొని తలకు తీవ్రగాయమై ఆసుపత్రిలో వారం రోజుల పాటు మృత్యువుతో పోరాడి చివరకు జీవన్మృతుడిగా మిగిలిపోయాడు. నన్ను ధరించి ఉంటే కచ్చితంగా ప్రాణాలు నిలిచి ఉండేవని వైద్యులు చెప్పడంతో అయ్యో నా స్నేహితుడి ప్రాణాలు కాపాడలేకపోయానే అని ఎంతో కుమిలి పోయాను. ఇప్పుడు ఒంటరిగా మచ్చుపై దుమ్ములో మునిగిపోతున్నాను.

**మిత్రమా నన్ను ధరించు**



ప్రతి ద్విచక్ర వాహనదారుడు నాకు ప్రాణ స్నేహితుడే మీ ప్రాణాలు కాపాడుకునేందుకు నేను ఎంతో తహ తహలాడతాను. నిత్యం మీ తలపై ఎక్కి ఊరంతా తిరుగుతుంటే ఎంతో హాయిగా ఉంటాను. కానీ కొందరు మిత్రులు నన్ను కేవలం అలంకారప్రాయంగా పోలీసుల నుంచి తప్పించుకునేందుకే వాడతారు. అలాంటి వారు నాతో స్నేహం చేయక అనుక్షణం మృత్యువును వెంటబెట్టుకుని తిరుగుతుంటారు. మిత్రులారా ఒక్కసారి ఆలోచించండి మీ కోసం మన ఇంటి దగ్గర మీ తల్లిదండ్రులు, భార్యాపిల్లలు ఎంతగా ఎదురు చూస్తారో. నన్ను వదిలిన మరుక్షణమే నువ్వు మీ వారి ఆశలను సైతం వదులుతున్నావని గుర్తుంచుకో. ఇక నుంచి దూరం చిన్నదైనా పెద్దదైనా నన్ను నీ వెంట తీస్కుళ్లు కలకాలం ఇద్దరం సంతోషంగా ఉందాం.
ఇట్లు.. మీ 'ప్రాణ' స్నేహితుడు హెల్మెట్

## పీలిస్తే చిత్తు.. తరలిస్తే ఉచ్చు

వికారాబాద్ :ఈ ఏడాది ఫిబ్రవరి 12న కర్ణాటక నుంచి హైదరాబాద్ నగరానికి ద్విచక్ర వాహనంపై తరలిస్తుండగా.. పరిగి పట్టణ పరిసరాల్లో 3.25 కిలోల గంజాయి పట్టుకొని ఎక్సైజ్ పోలీసులు ఇద్దర్ని రిమాండ్‌కు పంపారు.
పరిగి మండలం లక్ష్మీదేవిపల్లి గేటు సమీపంలో పరిగికి చెందిన ఒకరు, రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌కు చెందిన మరో యువకుడి వద్ద కలిపి 260 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.
ఏపీ రాష్ట్రం విశాఖ నుంచి వికారాబాద్ వైపు వస్తున్న రైలులో గతనెల 9న గంజాయి రవాణా చేస్తున్నారన్న సమాచారంతో ఆబ్కారీ అధికారులు అప్రమత్తమయ్యారు. వికారాబాద్ రైల్వే ఆసుపత్రి సమీపంలో 26 కిలోల ఎండు గంజాయిని అధికారులు స్వాధీనపర్చుకున్నారు.
యువత చెడు అలవాట్లకు బానిసవుతోంది. క్షేత్రస్థాయిలో సరైన దిశా నిర్దేశం లేకపోవడంతో ప్రభావం ఆయా కుటుంబాలపై పడుతోంది. ముఖ్యంగా 20-25 ఏళ్ల వయసువారే గంజాయి తరలిస్తూ కేసుల్లో ఇరుక్కుంటున్నారు. పీలుస్తూ మత్తులో జోగుతున్నారు. నిత్యావసర సరకులు, ఇతర వస్తువుల మాటున దందా సాగిస్తున్నారు. ఇటీవల ఒక్క పరిగి ప్రాంతంలోనే మూడు కేసులు నమోదయ్యాయి. అయిదుగురి నుంచి 3.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ అధికారులు జిల్లావ్యాప్తంగా ఏడాదిలోనే 85 కిలోల ఎండు గంజాయి స్వాధీనం చేసుకుని 23 మందిపై కేసులు పెట్టారు.

**జిల్లా, రాష్ట్ర సరిహద్దుల నుంచి..**
గంజాయి చాలావరకు కర్ణాటక రాష్ట్రం నుంచి జిల్లాకు సరఫరా అవుతోంది. కొం దరు స్వార్థపరులు అమాయకులనే లక్ష్యంగా చేసుకుంటున్నారు. ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షి



స్తున్నా విక్రయాలకు అడ్డుకట్ట పడటం లేదు. పరిగి, వికారాబాద్, మోమిన్‌పేట, తాండూరు, బషీరాబాద్ తదితర ప్రాంతాల్లో తరచూ కేసులు నమోదవుతున్నాయి. రైలు సదుపాయమూ ఉండటంతో తాండూరు, వికారాబాద్ మీదుగా రవాణా అవుతోంది. పొరుగు జిల్లా సంగారెడ్డిలోనూ కేసులు కలకలం రేపుతున్నాయి. రంగారెడ్డి జిల్లా బాలానగర్ ప్రాంతంలోని పరిశ్రమల్లో వేల సంఖ్యలో కార్మికులు పనిచేస్తున్నారు. పరిగికి తక్కువ దూరం కావడంతో అక్కణ్నుంచి తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

**చాక్లెట్ల రూపంలోనూ..**
గంజాయిని చాక్లెట్ల రూపంలో అమ్ముతున్నారు. నాలుగు నెలల కిందట రంగారెడ్డి జిల్లా కొందర్గు నుంచి తెచ్చి పరిగిలో విక్రయిస్తున్నట్లు అనుమానం రావడంతో కొందరు కట్టడికి కృషి చేశారు. విషయం తెలుసుకున్న వ్యాపారులు వెనక్కి తగ్గారు. పోలీసు, ఆబ్కారీ అధికారులు తనిఖీలు విస్తృతం చేసి అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

## ఆ మలుపుల్లో.. పిలుపులే..!

భువనగిరి: ప్రధాన రహదారుల్లో ఉండే మూల మలుపుల వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కన్పించక పదుల సంఖ్యలో ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. హెచ్చరిక బోర్డులు, సూచికలు లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. జిల్లాలోని ప్రధాన రహదారులపై ప్రమాదకర మూలమలుపులను పరిశీలించింది.
భువనగిరి మండలం వడపర్తి వద్ద పదేళ్ల క్రితం గజ్వేల్ నుంచి భువనగిరి వైపు రెండు ద్విచక్ర వాహనాలపై వస్తున్న నలుగురిని ఫంక్షన్ హాలు సమీపంలోని మలుపు వద్ద లారీ ఢీకొట్టడంతో ముగ్గురు మృతి చెందగా ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. గతేడాదిలోనే మండలంలోని పలు మలుపుల వద్ద మొత్తం 76 రోడ్డు ప్రమాదాలు జరిగి 28 మంది మృతి చెందగా 49 మంది తీవ్ర గాయాలపాలయ్యారు.
యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట-గౌరాయిపల్లి, మాసాయిపేట-సైదాపురం, పాతగుట్ట-గొల్లగూడెం మధ్య ఉన్న మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. పదేళ్లలో ఐదుగురు మృత్యువాత పడ్డారు.
తుర్కపల్లి మండలం భువనగిరి జాతీయ రహదారిపై సంగ్యతండా, జేతురాంతండా, వాసాలమర్రి, తిర్మలాపురం వద్ద ఉన్న మలుపులు ప్రాణాలు తీస్తున్నాయి. కీసర-యాదగిరిగుట్ట రోడ్డులో మల్కాపురం, బద్దుతండా, వెంకటాపురం శివారులోని మలుపు రోడ్డులో ప్రయాణికు



లు ఇబ్బందులు పడుతున్నారు.
వలిగొండ మండల కేంద్రంలోని వెంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద గల మూల మలుపు వద్ద అనేక సార్లు లారీలు అదుపుతప్పి పల్టీకొట్టిన ఘటనలు చోటు చేసుకున్నాయి. రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం గ్రామ పరిధిలో మూలమలుపు వద్ద సుమారు పదేళ్ల క్రితం ఆర్టీసీ బస్సును లారీ ఢీకొన్న ఘోర ప్రమాదంలో 15 మంది అక్కడికక్కడే మృతి చెందగా.. పలువురు తీవ్ర గాయాలపాలయ్యారు.
బొమ్మలరామారం నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లే మార్గంలోని మైసిరెడ్డిపల్లి గ్రామం వద్ద ఉన్న మలుపు వద్ద నాలుగు సంవత్సరాల క్రితం జరిగిన ప్రమాదంలో నలుగురు ఇంజినీరింగ్ విద్యార్థులు మృతి చెందారు. ప్యారారం - సోలీపేట గ్రామాల మధ్యలో మలుపు వద్ద ప్రమాదాలు జరిగి పలువురు మృతి చెందారు.

చురకలు



## ప్రాణాలు పోతున్నా పట్టింపేది..?

హైదరాబాద్: ఇది హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి. ఆరు పలకలుగా నిర్మించడానికి మూడేళ్లనాడు ముహూర్తం పెట్టారు. గుత్తేదార, ఉప గుత్తేదారులు విభజించి చేపట్టిన పనులను సగంలోనే వదిలేయడంతో ప్రజల ప్రాణాలు తీస్తున్నాయి. భాగ్యలత నుంచి లక్ష్మారెడ్డిపాలెం దాకా రహదారి ప్రమాదకరంగా ఉంది. 2 నెలల్లో నలుగురి ప్రాణాలు తీయడమే కాదు.. పదుల సంఖ్యలో క్షతగాత్రులుగా మారినా గుత్తేదారులు, ఇంజినీరింగ్ అధికారులు, ప్రజాప్రతినిధులు కిమ్మనడం లేదు. వీరి నిర్లక్ష్యంతో వైద్య విద్యార్థిని ఐశ్వర్య సోమవారం ప్రాణాలు కోల్పోయింది.



ఎన్నాళ్లిలా..: వానొస్తే వరదలతో రహదారి నిండిపోతోంది. లేకుంటే ప్రమాదాలతో రక్తమోడుతోంది.

పెద్దఅంబర్‌పేట్ ఓఆర్ఆర్ నుంచి లక్ష్మారెడ్డి పాలెం హనుమాన్ టెంపుల్ వరకు 2 వంతెనలు నిర్మించారు. లక్ష్మారెడ్డిపాలెం నుంచి హయత్‌నగర్ రేడియో స్టేషన్ వరకూ జాతీయ రహదారిలోకి ఎవరూ రాకుండా గ్రిల్స్ అమర్చారు. ఇక్కడే సర్వీసు రోడ్లు అభివృద్ధి చేయలేదు. వాహనాల వేగం పెరిగినా, సామాన్య ప్రజలు సజావుగా రాకపోకలు సాగించేలా ఏర్పాట్లు లేవు.

ఇబ్బందులు: ప్రజల రవాణాకు అనుకూలంగా ఆర్అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకోలేదు. వందల సంఖ్యలో కాలనీలు, వేలాది మంది వెళ్లడానికి వీలుగా ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు లేవు.

## రూ.30 కోట్ల సర్కారు భూమి కబ్జా

రాయదుర్గం : ఖాజాగూడ పరిధిలో ప్రభుత్వ స్థలాలు రోజుకొకటి కబ్జాకు గురవుతున్నాయి. తాజాగా ఖాజాగూడ సర్వే నంబరు-27లో ప్రభుత్వ స్థలంలో మట్టి పోసి చదును చేసి రోడ్డు వేశారు. ఇనుప రేకులతో కంచె నిర్మిస్తున్నారు. 20 అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మాణం పూర్తి చేసి, నాలుగు రోజులుగా కంచె పనులు చేస్తున్నా, శేరిలింగంపల్లి



రెవెన్యూ అధికారులు అడ్డుకోవడం లేదు. కొన్ని నెలల క్రితమే హైడ్రా ఉన్నతాధికారులు ఈ స్థలాన్ని సందర్శించారు. అక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా. చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఆక్రమించిన స్థలం విలువ రూ.30 కోట్ల వరకు ఉంటుందని, పక్కనున్న వెంచర్ కోసమే ఇలా చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఆర్ఐ చంద్రారెడ్డిని వివరణ కోరగా క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

## వెన్నులో వణుకు.. కంటికి లేదు కునుకు

నల్గొండ : నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించాల్సి ఉంటుంది. పుర, పోలీసులు, స్వఛ్ఛంద సంస్థల సహకారంతో నిరాశ్రయులు ఎక్కడ కనిపించినా కేంద్రాలకు తరలించాలి. కానీ ఎక్కడా ఈ విధానం కొనసాగటం లేదు. మెప్మా ఆధ్వర్యంలో నిరాశ్రయుల గుర్తింపు చేపడుతున్నా.. వారికి ఆశ్రయం కల్పించడంలో విఫలమవుతున్నారు.

**జిల్లాలో ఎలా ఉందంటే ..**

ఉమ్మడి నల్గొండ జిల్లాలో 19 పురపాలికలు ఉన్నాయి. నల్గొండలో ఎనిమిది పురపాలికలు ఉండగా, ఒక్క నల్గొండలో మాత్రమే నిరాశ్రయుల కేంద్రం ఉంది. యాదాద్రి జిల్లాలో ఆరింటిలో భువనగిరిలోనే కేంద్రం నిర్వహిస్తున్నారు. సూర్యాపేట జిల్లాలో ఐదు పురపాలికలు ఉండగా, సూర్యాపేటలో మాత్రమే కొనసాగుతోంది. మిగతా పురపాలికల్లో ఎక్కడా నిరాశ్రయుల కేంద్రాలు లేవు.

**వాతావరణ పరిస్థితి ఇలా..**

గత వారం రోజులుగా చలి తీవ్రత పెరిగింది. మరో రెండుమూడు రోజుల వరకు ఇలాగే ఉండనుందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో నిరాశ్రయుల బాధ ఎవరికీ పట్టడం లేదు. కనీసం నేలపై పడుకొనేందుకు దుప్పట్లు, చాప లేకుండా గడుపుతున్నారు. కొందరైతే పట్టణాల్లో ఎవరైనా దానం చేసిన వాటిని వినియోగించుకుంటున్నారు.

**పురవాసుల కోరిక ఇలా..**

సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని నిరాశ్రయుల కేంద్రాలకు



తరలించి సౌకర్యాలు కల్పించాలి.

**అధికారి మాట**

చలితో ఇబ్బందులు పడుతున్న నిరాశ్రయులను వెంటనే గుర్తిస్తాం. బస్టాండ్లు, రోడ్ల వెంట రాత్రిపూట పర్యటించి వారిని కేంద్రానికి తరలిస్తాం. ఈ విషయంలో అధికారులు ఎవరు నిర్లక్ష్యం వహించినా సహించేది లేదు. సూర్యాపేటలో కేంద్రం నిర్వహణ సాగుతుందని పుర కమిషనర్ హన్మంతరెడ్డి తెలిపారు.

రోజురోజుకూ చలి తీవ్రత పెరుగుతోంది.. సాయంత్రం ఆరు గంటలకే జనం వణికిపోతున్నారు. అన్నీ ఉన్నవారు చలి నుంచి రక్షణ పొందేందుకు స్వెట్టర్లు, దుప్పట్లు వినియోగించి ఉపశమనం పొందుతున్నారు. కానీ పట్టణాల్లో నిరాశ్రయుల పరిస్థితి దయనీయంగా మారింది. రోడ్లు, ఫ్లైఓవర్లు, బస్టాండ్లలో చలికి తలదాచుకుంటున్నారు.

## ఆధార్ అప్‌డేట్ చేసుకున్నారా..?



హైదరాబాద్: హైదరాబాద్‌కు చెందిన యువతి కోఠి మహిళా కళాశాలలో చదువుతోంది. 2026లో జరిగే జేఈఈ పరీక్షకు దరఖాస్తు చేసేందుకు మీ- సేవకు వెళ్లగా.. ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. ఆధార్ కేంద్రానికి వెళ్లి అప్‌డేట్ చేయించుకొని దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చింది.

హయత్‌నగర్‌కు చెందిన యువకుడు స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసేందుకు వెళ్లగా.. ఆధార్ నవీకరణ చేసుకోవాలని సూచించారు. ఆధార్ అప్‌డేట్ చేయించుకొని అప్లై చేయాల్సి వచ్చింది.

ప్రభుత్వ పథకాలు, ధ్రువపత్రాలు, ఉపకారవేతనాలు ఇతరత్రా పొందాలంటే ఆధార్ కీలకమైంది. చిన్నప్పుడే ఆధార్ కార్డు తీసుకున్నా ప్రతి ఐదేళ్లకు, 15 ఏళ్లకు నవీకరణ చేసుకోవాలి. కొందరు చేసుకోకపోవడంతో ఇబ్బందులు తలెత్తున్నాయి. ఐదేళ్లు దాటి 15 సంవత్సరాలలోపు పిల్లల ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలని ఉడాయ్ సూచించింది.

**అప్పుడే పుట్టిన శిశువుల నుంచి..**

అప్పుడే పుట్టిన శిశువుల నుంచి ఐదేళ్లలోపు చిన్నారులకిచ్చే దాన్ని బాల ఆధార్ అంటారు. ఇందులో ఫొటో, పేరు, పుట్టిన తేదీ ఉంటాయి. పిల్లల వేలిముద్రలు, ఐరిస్ తీసుకోరు. తల్లిదండ్రుల వివరాలతోనే ఆధార్ జారీ చేస్తారు. ఐదేళ్ల తర్వాత ఫింగర్ ప్రింట్స్, ఐరిస్‌తో బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకోవాలని ఉడాయ్ సూచించింది.

**ఐదేళ్లు దాటిన తర్వాత..**

ఐదేళ్ల కన్నా తక్కువ వయసున్న పిల్లలకు ఆధార్ రిజిస్ట్రేషన్ చేసి ఉంటే.. ఐదేళ్లు దాటిన తర్వాత రీ రిజిస్ట్రేషన్ చేయించాలి. దీన్ని మాండేటరీ బయోమెట్రిక్ అప్‌డేట్ (ఎంబీయూ) అంటారు. ఇది మొదటి బయోమెట్రిక్ అప్‌డేట్. ఈ సమయంలో పూర్తి బయోడేటా సమర్పించాలి. ఇది కొత్తదే. కానీ పిల్లల ఆధార్ నంబరులో ఎలాంటి మార్పు ఉండదు. పిల్లల ఆధార్ తప్పనిసరి అని ఆధార్ రెగ్యులేషన్స్ 2016 చట్టం చెబుతోంది.

**నవీకరణ చేయకపోతే..**

పిల్లల ఆధార్ నవీకరణ చేయకపోతే నంబరు డీయాక్టివేట్ అవుతుంది. ఐదేళ్లు దాటిన చిన్నారుల ఆధార్ అప్‌డేట్ రెండేళ్లలోపు చేయించాలి. వారికి ఏడేళ్లు నిండేలోపు పూర్తి చేయాలి.

**ఏమేం కావాలి?**

పిల్లలకు తొలిసారి ఆధార్ తీసుకుంటున్నప్పుడు పుట్టినరోజు ధ్రువపత్రం, తల్లిదండ్రుల్లో ఒకరి ఆధార్ కార్డు అవసరం. ఐదేళ్లలోపు వారిని కేంద్రాలకు తీసుకెళ్లాల్సిన పనిలేదు. కానీ బయోమెట్రిక్ సమయంలో తప్పనిసరి. మళ్లీ 15 ఏళ్ల తర్వాత అప్‌డేట్ చేయించాలి. ప్రస్తుతం 17 ఏళ్ల లోపు పిల్లలు ఉచితంగా అప్‌డేట్ చేసుకోవచ్చు.

## నోటిఫై చేస్తే కదా.. వేటు పడేది



హైదరాబాద్: జల వనరుల సంరక్షణ కోసం హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) దాని పరిధిలోకి వచ్చే 11 జిల్లాల్లో బ్లూ అండ్ గ్రీన్ ప్రణాళికకు రూపకల్పన చేస్తోంది. త్వరలో హెచ్ఎండీఏకు కన్సల్టెంట్ సంస్థ ముసాయిదాను అందించనుంది. ఈ బ్లూ అండ్ గ్రీన్ ప్రణాళికలో భాగమైన చెరువుల పరిరక్షణకు అదే స్థాయిలో ప్రాధాన్యం లభించడం లేదు. కోర్టులు మొట్టికాయలు వేసినా కదలిక అంతంతే. చాలా చెరువులకు సంబంధించి పూర్తి నీటి నిల్వ స్థాయి(ఎఫ్‌టీఎల్) నిర్ధారణ అనుకున్నంత వేగంగా సాగడం లేదు. హెచ్ఎండీఏ పరిధిలో 3,500 వరకు చెరువులుండగా ఇప్పటివరకు 1,300 చెరువుల ఎఫ్‌టీఎల్‌కు సంబంధించి ఫైనల్ నోటిఫికేషన్ ఇచ్చారు. మహానగర పరిధిలో చాలా చెరువుల ఎఫ్‌టీఎల్‌లో 60 శాతం వరకు ఆక్రమణలున్నాయి. అధికారికంగా ఎఫ్‌టీఎల్ నిర్ధారణ లేకుండా ఆక్రమణలు తొలగిస్తే న్యాయపరమైన చిక్కులు ఎదురవుతున్నాయి. కోర్టులను ఆశ్రయించి స్టే తెచ్చుకుంటున్నారు. ఆ కేసులు తేలేవరకు వాటి జోలికి వెళ్లే పరిస్థితి లేదు. ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీరాజ్, హెచ్ఎండీఏ విభాగాల మధ్య సమన్వయం లోపమూ ఈ ప్రక్రియలో జాప్యానికి కారణమని చెబుతున్నారు. రెండు దశాబ్దాల నీటి నిల్వ, గ్రామ, రెవెన్యూ మ్యాపులను క్షుణ?ంగా పరిశీలించి ఎఫ్‌టీఎల్ నిర్ధారిస్తారు. తొలుత ప్రాథమిక ప్రకటన జారీ చేసి స్థానికుల అభ్యంతరాలు స్వీకరిస్తారు. తర్వాత హద్దులు నిర్ధారించి తుది నోటిఫికేషన్ జారీ చేస్తారు. ఇప్పటికే చాలా చెరువులకు ప్రాథమికంగా నోటిఫై చేసినా తుది నోటిఫికేషన్ జారీ చేయలేదు.

**అవుటర్ లోపల ఆక్రమణల పర్వం**

అవుటర్ రింగ్‌రోడ్డు వరకు 222 దాకా చెరువులు హైడ్రా పరిధిలో ఉన్నాయి. 24 చెరువులకే తుది ప్రకటన పూర్తిచేశారు. చాలా చెరువుల్లో ఆక్రమణలు ఉన్నా తొలగింపు సాధ్యం కావడం లేదు. భారీ షెడ్లు వేసి వ్యాపారాలు చేస్తున్నారు. స్థానిక నాయకుల అనుచరులమని చెప్పుకొనే కొందరు శిఖం, ఎఫ్‌టీఎల్ భూముల్లో గుడిసెలు వేసి పేదలకు అద్దెకిస్తున్నారు. కొందరైతే విక్రయిస్తున్నారు. వీటిని తొలగించడానికి వెళ్తున్న అధికారులకు పేదల నుంచి ప్రతిఘటన ఎదురవుతోంది.

హెచ్ఎండీఏ పరిధిలో తటాకాలు..

మొత్తం 3,500 అవుటర్ పరిధిలోనివి 222

## తటాకాలు.. కాలుష్య కాసారాలు



కోరుట్ల : కోరుట్ల మండల పరిధిలోని పలు గ్రామాల్లో చెరువులు మురుగు కాసారాలుగా మారాయి. కుంటలుగా మారుతున్నాయి. మండల పరిధిలోని 15 గ్రామాలు, పట్టణంతో కలిపి మొత్తం 60 చెరువులున్నాయి. ఇందులో ఎక్కువ తటకాల్లో నీరు కలుషితమవుతోంది. గ్రామాల్లోని ఇళ్ల నుంచి వెలువడే మురుగు నేరుగా చెరువులోకే చేరుతోంది. దీంతో పాటు కొట్టుకొచ్చే వ్యర్థాలు, ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు చేరి దుర్గంధం వెదజల్లుతున్నాయి. కోళ్ల వ్యర్థాలను, చెత్తను చెరువుల్లో పడేస్తుండటంతో నీరు కలుషితమై చేపల పెంపకానికి తీవ్ర ఇబ్బందికరంగా మారిందని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

**సమస్య తీవ్రత ఇక్కడే..**యూసుఫ్‌నగర్ గ్రామాన్ని ఆనుకొని ఉన్న పెద్దచెరువులో ఇళ్ల నుంచి వెలువడే చెత్తను పడేస్తుండటంతో డంపింగ్‌యార్డును తలపిస్తోంది. అయిలాపూర్ కుమ్మరికుంటలో కోళ్ల వ్యర్థాలు, కల్యాణ మంటపాల్లోని ప్లేట్లు, ప్లాస్టిక్ గ్లాసులు, వ్యర్థాలను పడేస్తున్నారు. ఇక్కడి పెద్దచెరువులో యూసుఫ్‌నగర్, అయిలాపూర్ గ్రామాల మురుగు చేరుతోంది. గుంలాపూర్ గ్రామంలో ఇళ్ల నుంచి మురుగు కాలువలను నేరుగా చెరువుకు అనుసంధానించడంతో వ్యర్థ జలం కలుస్తోంది.

కోరుట్ల పట్టణంలోని మద్దుల చెరువు(మినీ ట్యాంక్‌బండ్)కు ఎగువనున్న పలు కాలనీలను అనుసంధానించడంతో చెరువుంతా మురుగుతో నిండిపోతోంది. నీరు కలుషితమై ఏటా వేసవిలో వేల చేపలు మృత్యువాత పడుతున్నాయి. మద్దుల చెరువులో పాత ఇళ్లను కూల్చిన వ్యర్థాలను, మట్టిని, చెట్ల కొమ్మలను పడేసి పూడ్చటంతో చెరువు విస్తీరం అంతకంతకూ కుంచించుకుపోతోంది. ఎగువ నుంచి వ్యర్థాలు, మురుగు వచ్చి చేరుతున్నాయి. కోరుట్ల పట్టణానికి దిగువన కింది ప్రాంతంలో ఫుల్‌వాగు ఉంటుంది. పట్టణంలోని మురుగు వాగులో చేరుతోంది. ఈ వాగు ద్వారా దిగువన ఉన్న కల్లూరులోని పెద్దచెరువులో చేరుతోంది. చిత్రంలో కనిపిస్తోంది జోగినపల్లి గ్రామాన్ని ఆనుకొని ఉన్న పోతనికుం ట. ఊరిలోని మురుగు.. కాలువల ద్వారా వచ్చి ఈ తటాకంలో చేరుతోంది. మురుగుతో పాటు వ్యర్థాలు, ప్లాస్టిక్ గ్లాసులు, కవర్‌లు చేరడంతో కుంటలా తయారై దుర్గంధం వెదజల్లుతోంది.

## అక్రమాల కట్టడితోనే ఉపాధి!

కొత్తగూడెం: ఉపాధి హామీ పథకం పనులపై గతేడాది నిర్వహించిన సామాజిక తనిఖీల్లో భారీగా అక్రమాలు వెలుగుచూశాయి. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలంలోని 24 గ్రామపంచాయతీల్లో ఉపాధి, అటవీ, పంచాయతీరాజ్ శాఖల్లో జరిగిన అవకతవకలకు సంబంధించి సిబ్బందికి రూ.1,39,000 జరిమానా విధిస్తూ డీఆర్‌డీఓ ఆదేశాలు జారీ చేశారు. రూ.10,36,271 రికవరీ చేయాలని సూచించారు. విశ్రాంత ఉద్యోగులు, బినామీల పేర్లపై మస్టర్లు వేసి సొమ్ము కాజేసినట్లు తనిఖీ బృందాలు గుర్తించాయి.

ఉపాధి హామీ పథకంలో అవకతవకలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం నడుంబిగించింది. సామాజిక తనిఖీ వ్యవస్థను బలోపేతం చేయటంపై దృష్టిసారించింది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో కొన్నేళ్లుగా జరుగుతున్న అక్రమాలకు సంబంధించి రికవరీ ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. ఈనేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ తాజా నిర్ణయం క్షేత్రస్థాయిలో అక్రమాలకు చెక్ పెడుతుందని అధికారులు భావిస్తున్నారు.

**కొండంత అక్రమం.. గోరంత స్వాధీనం**

ఉపాధి పనులపై గ్రామాల వారీగా సమావేశాలు నిర్వహించి అక్రమాలను వెలికితీస్తారు. ఒక్కో మండలంలో ఎంతమొత్తం పక్కదారి పట్టిందో తనిఖీ బృందాలు ప్రాథమిక నివేదిక రూపొందిస్తాయి. కొన్ని మండలాల్లో ప్రాథమికంగా రూ.లక్షల్లో అక్రమాలను గుర్తించినా రికవరీకి వచ్చేసరికి రూ.వేలల్లో ఉండటం గమనార్హం. ఉన్నతాధికారులు పునఃపరిశీలన తర్వాత మొత్తం విలువను పూర్తిగా తగ్గించేస్తున్నారు. 2021 నుంచి 2024 (నవంబరు నాటికి) ఖమ్మం జిల్లాలో రూ.42,24,157 అక్రమాలను గుర్తిస్తే రూ.12,64,015 మాత్రమే రికవరీ చేశారు. భద్రాద్రి జిలాలో రూ.21,62,726 అక్రమాలు జరిగితే రూ.10,50,897 స్వాధీనపరచుకున్నారు.



'ఉపాధి హామీ పనుల రికార్డులను మండలాల వారీగా తీసుకున్నాం. వాటి ఆధారంగా తనిఖీలు జరుగుతున్నాయి' అని భద్రాద్రి కొత్తగూడెం డీఆర్‌డీఓ అదనపు పీడీ రవి 'కు తెలిపారు.

**ఆరు నెలలకోసారి తనిఖీలు**

ఉపాధిహామీ పనుల తీరుపై సాధారణంగా ఆరు నెలలకు ఒకసారి సామాజిక తనిఖీలు నిర్వహించాలి. కానీ ఏటా ఒక్కసారి మాత్రమే తనిఖీలు జరపటం వల్ల అవినీతి పెరిగిపోతోంది. కేంద్ర ప్రభుత్వ తాజా నిబంధనల ప్రకారం ఏటా రెండుసార్లు సామాజిక తనిఖీలు నిర్వహించాల్సిందే. గతంలో ఉపాధిహామీ పనుల రికార్డులను ఎప్పటికప్పుడు సమర్పించకపోయినా తనిఖీలు నిర్వహించారు. ఇకపై పనులు జరిగిన తీరుపై రూపొందించిన రికార్డులను అధికారులకు అందజేసిన తర్వాతే తనిఖీలు చేపడతారు.

గతంలో అవినీతి సొమ్ము రికవరీకి గడువు ఉండేది కాదు. ఇకపై నిర్ణీత సమయంలోపు చెల్లించాల్సి ఉంటుంది. ఉపాధిహామీ పథకంలో అక్రమాలకు బాధ్యులైనవారు సకాలంలో డబ్బులు చెల్లించకపోతే విధుల నుంచి తొలగించి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించాలి. సామాజిక తనిఖీలపై గ్రామసభలు పక్కాగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కేంద్రం ఆదేశించింది.

## ఏళ్ల కల.. సాకారం దిశగా..

కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యుత్తు సంస్థ సర్కిల్ (ఎస్ఈ) కార్యాలయానికి సొంత భవనం సమకూరబోతోంది. 2016 అక్టోబర్ 11న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏర్పాటైంది. అప్పటి నుంచి లక్ష్మీదేవిపల్లిలోని 33/11కేవీ ఉపకేంద్రం పక్కనే ఓ చిన్న రేకులషెడ్డు నిర్మించి ఎస్ఈ కార్యాలయం అని బోర్డు అమర్చారు. రాష్ట్రంలోనే అతిపెద్ద విస్తీర్ణం, అత్యధిక విద్యుత్తు కనెక్షన్లు కలిగిన ఈ జిల్లాలో సర్కిల్ కార్యాలయం లేకపోవటం ఇన్నాళ్లు వెలితిగా ఉండేది. ప్రజాప్రతినిధులు, ప్రజలు, విద్యుత్తు సంస్థ అధికారులు అనేకమార్లు ప్రభుత్వానికి, ఎన్‌పీడీసీఎల్ ఉన్నతాధికారులకు దరఖాస్తులు సమర్పించారు. ఎట్టకేలకు కొత్తగూడెం సర్కిల్ కార్యాలయానికి సొంత భవనం నిర్మించేందుకు ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి పచ్చజెండా ఊపారు.

**రూ.1.90 కోట్లు మంజూరు**

కొత్తగూడెం నడిబొడ్డున ఎస్ఈ, డీఈ కార్యాలయాల నిర్మాణానికి ఎన్‌పీడీసీఎల్ రూ.1.90 కోట్లు మంజూరు చేసింది. భజనమందిర్ రోడ్డు వెంట గల శ్రీరామచంద్ర బాలుర ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న డీఈ కార్యాలయం శిథిలావస్థకు చేరింది. దీనిని తొలగించి స్థలాన్ని చదును చేశారు. ఇక్కడ జీం2 పద్ధతిలో ఎస్ఈ, డీఈ కార్యాల



య భవనాలు నిర్మించనున్నారు. కొత్తగూడెం, పాల్వంచ, భద్రాచలం డివిజన్ల పరిధిలో తొమ్మిది సబ్ డివిజన్లు, 77 ఉపకేంద్రాలు ఉన్నాయి. జిల్లాలో 4,62,251 విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయని అధికారులు తెలిపారు. వీటిలో గృహ విద్యుత్తు కనెక్షన్లు (కేటగిరీ-1): 3,49,150, వాణిజ్య కనెక్షన్లు (కేటగిరీ-2): 42,926, వ్యవసాయ కనెక్షన్లు (కేటగిరీ-5): 58,357 ఉన్నాయని వెల్లడించారు. మిగిలినవి పరిశ్రమలు, దేవాలయాలు, చర్చిలు, మసీదులు, ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాలు, వాటర్ వర్క్స్ కనెక్షన్లు ఉన్నాయని చెప్పారు. 'జీం2 పద్ధతిలో భవనం నిర్మించబోతున్నాం. కిందిభాగాన్ని పార్కింగ్‌కు వదిలేస్తాం. మొదటి అంతస్తులో సర్కిల్ కార్యాలయం, రెండో అంతస్తులో డీఈ కార్యాలయం ఉంటాయి. తొమ్మిది నెలల్లో పనులు పూర్తిచేసేలా ప్రణాళిక రూపొందించాం' అని ఎస్ఈ జి.మహేందర్‌కు తెలిపారు.

చురకలు



# కంకర మింగుతున్న కింకరులు

నంద్యాల : ఖనిజ అక్రమ రవాణాను అరికట్టడంలో భాగంగా సీనరేజ్ వసూలు చేసే బాధ్యతను ప్రైవేటు సంస్థకు అప్పగించారు. ప్రభుత్వం ఓ రకంగా ఆలోచిస్తే.. అక్రమార్కులు మరోలా పావులు కదుపుతున్నారు. అందొచ్చిన అవకాశంతో అక్రమ మైనింగ్‌ను మరింత పెంచారు. ప్రైవేటు సంస్థతో కొందరు ఒప్పందాలు చేసుకుని అనుమతుల్లేకుండానే తవ్వేస్తున్నారు. కంకర, రోడ్డు మెటల్‌కు సంబంధించిన అనుమతులు వేళ్లమీద లెక్కపెట్టే స్థాయిలో ఉండగా.. పదుల సంఖ్యలో అక్రమ తవ్వకాలు సాగుతున్నాయి.

**నిబంధనలకు చెల్లు**

నంద్యాల జిల్లాలో రోడ్డు మెటల్ క్వారీ లీజులు ఎనిమిది మాత్రమే ఉన్నాయి. బనగానపల్లి కార్యాలయ పరిధిలో మూడు, నంద్యాల పరిధిలో ఐదింటికి మాత్రమే లీజులున్నాయి. కానీ పదుల సంఖ్యలో అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. పాణ్యం మండలం తమ్మరాజుపల్లె గద్దెలకొండలో రెండు లీజులు మాత్రమే అధికారికంగా ఉన్నాయి. మరికొన్ని రెన్యువల్ దశలో ఉన్నాయి. ఇక్కడ ఏకంగా 35 ప్రాంతాల్లో తవ్వకాలు జరుగుతుండటం గమనార్హం. ఆరు క్రషర్ యంత్రాల ద్వారా అక్రమ మైనింగ్ జరుగుతోంది. ఈ ప్రాంతమంతా కాలుష్య కోరల్లో చిక్కుకుపోయింది. క్వారీ నిర్వాహకులు నిబంధనలు తుంగలో



తొక్కి తవ్వకాలు చేస్తున్నారు. ఇక్కడ ఏమేరకు మైనింగ్ జరుగుతుందన్న వివరాలు.. అటు రెవెన్యూ, ఇటు గనుల శాఖల వద్ద లేవు. బనగానపల్లిలో రెండింటికి మాత్రమే అధికారిక అనుమతులుండగా మరో మూడింటిలో అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి.

**బండరాళ్లను వదలరు..**

కర్నూలు జిల్లాలో ఏడు కంకర లీజులున్నాయి. పత్తికొండ నియోజకవర్గ పరిధి.. కృష్ణగిరి మండలం కంబాలపాడు సమీపంలోని హెచ్ఎన్ఎస్ఎస్ కాల్వ నిర్మాణంలో భాగంగా బయట పడిన రాళ్లను పగులగొట్టి కంకరగా మారుస్తున్నారు. దీనిని డోన్ సమీపంలోని కంకర క్వారీలకు తరలిస్తున్నారు. మరికొంత రోడ్డు నిర్మాణాలకు వాడుతున్నారు. కల్లూరు మండలం.. ఉలిందకొండ సమీపంలో నాలుగు కంకర క్వారీలకు అనుమతులుండగా మరో క్వారీలో అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. ఓర్వకల్లు మండలంలో పూడిచెర్ల సమీపంలో ఒకచోట అనధికార క్వారీ నడుస్తోంది.

**కానరాని తనిఖీలు**అనుమతులున్న లీజుల నుంచి వసూలు చేసిన సీనరేజ్‌ను మాత్రమే సదరు సంస్థ ప్రభుత్వానికి చెల్లిస్తోంది. అనధికారికంగా.. అక్రమంగా తవ్వకాలు చేస్తున్న కంకర, రోడ్డు మెటల్ క్వారీల నుంచి తరలే 'సరకు' నుంచి వసూలవుతున్న మొత్తాన్ని స్వాహా చేస్తోంది. సీనరేజ్ వసూళ్ల బాధ్యతను ప్రైవేటు పరం చేసిన నాటి నుంచి గనుల శాఖ అధికారులు దాదాపు తనిఖీలు ఆపేశారు. ఇదే సమయంలో ఉమ్మడి జిల్లాలోని అన్ని క్వారీలపై సదరు ప్రైవేటు సంస్థ గురి పెట్టింది. అనుమతి ఉన్న క్వారీల్లో ఎలాగైతే సీనరేజ్ వసూలు చేస్తుందో.. అనధికార క్వారీల్లోనూ అలానే వసూళ్లకు పాల్పడుతూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతోంది.

# పోగు.. ఉపాధి పేగు

కర్నూలు : గద్వాల పట్టుచీరకు ఎమ్మిగనూరు పుట్టినిల్లు.. ఇక్కడ చేనేత ఉత్పత్తులు విదేశాలకు ఎగుమతి అవుతుంటాయి.. టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుతో మరింత వన్నెరాబోతోంది. ఇక్కడి కార్మికులకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో బనవాసిఫారం వద్ద యుద్ధప్రాతిపదికన టెక్స్‌టైల్ పార్కును నిర్మిస్తున్నారు. 77.37 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో 249 ప్లాట్లు అందుబాటులోకి తేనున్నారు. తొలిదశలో 24.38 ఎకరాల్లో లేఅవుట్‌ను అభివృద్ధి చేసి 107 ప్లాట్లు అందుబాటులోకి తెచ్చారు. తమిళనాడులోని ఈరోడ్, సేలం ప్రాంతాల టెక్స్‌టైల్ పార్కుల మాదిరిగా తీర్చిదిద్దనున్నారు. ఇప్పటికే రహదారుల నిర్మాణం పూర్తయ్యింది. మిగిలిన పనులు రెండు నెలల్లో పూర్తి చేసి ప్లాట్లను కార్మికులకు అప్పగించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇప్పటికే కొందరు వ్యాపారులు ముందుకొచ్చారు. సమగ్రమైన



నివేదికతో రావాలని ఏపీఐఐసీ అధికారులు సూచించారు.

**విదేశాలకు ఎగుమతి చేసేలా**టెక్స్‌టైల్ పార్క్ నుంచే ఆన్‌లైన్‌లో ఉత్పత్తులు విక్రయించుకొనే సౌకర్యం కల్పించనున్నారు. ప్రస్తుతం సింగపూర్, అమెరికా వంటి దేశాలకు చీరలు ఎగుమతి అవుతున్నాయి. ప్రభుత్వ పరంగా వేగంగా సాయం అందేలా 'ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ యూనిట్'ను ఏర్పాటు చేయనున్నారు.

**కార్మికులకు 22 ఎకరాలు**

టెక్స్‌టైల్ పార్కులో చేనేతల కోసం ప్రత్యేకంగా 22 ఎకరాలు కేటాయించనున్నారు. చేనేత కార్మికులు, మాస్టర్ వీవర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేలా రూ.50 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు. 1,500 వరకు అధునాతన ఎలక్ట్రానిక్ జాకార్డ్ మగ్గాలు అందుబాటులోకి తీసుకురాబోతున్నారు. ఇందుకు వర్క్‌షెడ్లు నిర్మించనున్నారు. వాటిని వీవర్లకు కేటాయిస్తారు. దీంతో అధునాతన విధానాల్లో పలు రకాల వస్త్రాలు ఉత్పత్తి చేయడానికి వీలుంటుంది. అదేవిధంగా ప్రత్యేక శిక్షణ కేంద్రం, డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం, డయ్యింగ్ సౌకర్యాలు, గోదాముల సదుపాయం, బ్రాండింగ్, ప్యాకేజింగ్‌లకు అవసరమైన ఏర్పాట్లు చేస్తారు.

# రాజకీయ అండ.. మాయమవుతున్న కొండ



ఏలేశ్వరం : అక్రమార్కుల కన్ను పెడితే.. కొండలు, గుట్టలు మాయం. ఏవిధమైన అనుమతులు లేకుండానే మట్టి, గ్రావెల్, ఇసుక ఇలా కంటికి కనిపించే ప్రకృతి సంపదను కొల్లగొట్టేస్తున్నారు. అనుమతి లేకుండా తవ్వకాలు జరుగుతున్నా ... అధికారులకు పట్టడంలేదు. తమ శాఖ పరిధిలోని ప్రభుత్వ వనరులు మాయమైపోతున్నా చోద్యం చూస్తూ ఉండడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఏలేశ్వరం మండలం రమణయ్యపేట నుంచి జె.అన్నవరం వెళ్లే ప్రధాన ర.భ.శాఖ రహదారిని ఆనుకునే నిబంధనలకు విరుద్ధంగా చేస్తున్న తవ్వకాలతో కొండ కరిగిపోతోంది. కళ్లెదురుగా కనిపిస్తున్న అవినీతి తంతును అడ్డుకోవడంలేదు. రోడ్డుని ఆనుకుని ఉన్న అల్లి కొండను రాజకీయ అండతో కొందరు గుల్ల చేస్తున్నారు.

**పర్యావరణానికి హాని**

జె.అన్నవరం శివారున ఉన్న అల్లి కొండపై నల్లరాయి తరలింపునకు ప్రైవేట్ వ్యక్తులకు గనుల శాఖ లీజు ఇచ్చింది. కొంత భాగాన్ని లీజుకు తీసుకోవడం, గుట్టుచప్పుడు కాకుండా పెద్ద మొత్తంలో బ్లాక్ మెటల్‌ను తవ్వేయడం యజమానులకు అలవాటుగా మారింది. ఇది చాలదన్నట్టు కొండ దిగువనే ఉన్న గ్రావెల్ తరలింపును మొదలెట్టారు. రాత్రి వేళ యంత్రాలతో తవ్వేస్తూ గ్రావెల్‌ను వాహనాల్లో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కొండ, పరిసరాల్లో ఉన్న మొక్కలను తొలగిస్తూ పర్యావరణ అనుమతులను కాలరాస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే కాకినాడ– పోలవరం జిల్లాల అనుసంధాన ర.భ.శాఖ రహదారి సమీపానే యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలను చేసుకుంటూ పోతున్నారు. రవాణాకు రహదారిని నిర్మించుకున్నారు.

**అడ్డగోలు తవ్వకాలు**గ్రావెల్ తవ్వకాలు, తరలింపులో నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. సరాసరి రహదారికి సమీపానే యంత్రాలతో పెద్ద పెద్ద గోతులు తీసి గ్రావెల్‌ను తరలిస్తున్నారు. ఐదు నుంచి పది అడుగుల లోతుకు వెళ్లి తవ్వకాలు చేయడంతో మేతకు వచ్చే పశువులు మృత్యువాత పడే ప్రమాదం ఉందని స్థానికులు వాపోతున్నారు. మనుషుల ప్రాణాలకూ ప్రమాదమే. ట్రాక్టర్ గ్రావెల్‌ను ఎదుటివారి అవసరాన్ని బట్టి రూ.1000 నుంచి రూ. 1500 వరకు అమ్మి అక్రమార్కులు జేబులు నింపుకుంటున్నారు. ప్రభుత్వ ఖజానాకు నయా పైసా ఆదాయం రాకపోగా, అనుమతి లేని తవ్వకాలు సాగిస్తూ రూ.లక్షలు గడిస్తున్నారు. ఇప్పటికే కొండ దిగువ అధిక భాగం.. రహదారికి సమానంగా మారింది. మరికొంత ప్రాంతం గుంతలతో ప్రమాదకరంగా కనిపిస్తోంది. రోజూ రాత్రి వేళ పలు ట్రాక్టర్లతో గ్రావెల్‌ను వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నా ... వివిధ శాఖల అధికారులు తమకు సంబంధం లేని వ్యవహారంగానే వదిలేస్తున్నారు. అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

# పల్లెల్లోనూ ఆకలి తీరుస్తారు!



కాకినాడ : పట్టణ ప్రాంతాల్లో రూ.5కే ఆకలిని తీర్చుతున్న అన్న క్యాంటీన్లు త్వరలో పల్లెల్లోనూ సేవలు అందించబోతున్నాయి. ప్రతి నియోజకవర్గంలోనూ ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ఇదివరకే ప్రకటించింది. రెండో విడతగా కాకినాడ జిల్లాలో జగ్గంపేట, తిమ్మాపురం, యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ వద్ద నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. మండల కేంద్రాలు, జనసమ్మర్థం ఎక్కువగా ఉన్నచోట నిర్మిస్తే అవసరార్థుల ఆకలి తీర్చడానికి అవకాశం ఉంటుందని ఎంపిక చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

**చక్కటి ఆదరణతో..**


ప్రస్తుతం జిల్లాలో 11 చోట్ల అన్న క్యాంటీన్ల ద్వారా ఆకలి తీర్చుతున్నారు. రూ.5కే నాణ్యమైన ఆహారం, అల్పాహారం లభించడంతో ఆదరణ పెరిగింది. దూరాభారం నుంచి పనుల కోసం కాకినాడ వచ్చినవారు సమీప క్యాంటీన్లకు వెళ్తున్నారు. పూటకు రూ.70–100 వరకు ఆదా అవుతుందని, రుచికరమైన భోజనం పెడుతున్నారని సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గతేడాది వీటిని నెలకొల్పినప్పటి నుంచి ఇప్పటివరకు 10 లక్షల మందికిపైగా ఆరగించారు. కాకినాడ నగరంలో అయిదు చోట్ల, తుని, పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోట, ఏలేశ్వరం, గొల్లప్రోలులో ఒక్కో చోట అన్న క్యాంటీన్లు ఉన్నాయి.

**జోరుగా నిర్మాణాలు..**

జగ్గంపేటలో అన్నక్యాంటీన్ పనులు దాదాపు పూర్తయ్యాయి. అల్యూమినియం గ్లాస్ కిటికీలు, గ్రానైట్ టేబుళ్లు నిర్మించాల్సి ఉంది. ఈనెలలోనే వినియోగంలోకి తెస్తారు.

కాకినాడ గ్రామీణ మండలం అచ్చంపేట కూడలి సమీపంలో నిర్మిస్తున్న క్యాంటీన్ 90 శాతం పూర్తయింది. సంక్రాంతికి ప్రారంభించే అవకాశం ఉంది. ఉప్పాడ కొత్తపల్లిలో ప్రహరీ, గ్రిల్స్, సంప్, పెయింటింగ్ మినహా 80 శాతం పనులు జరిగాయి.

# వారసత్వ రిజిస్ట్రేషన్లపై కొర్రీలు



ముమ్మిడివరం: వారసత్వ భూములను హక్కుదారులకు నామమాత్రపు రుసుంతో రిజిస్ట్రేషన్ చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఆస్తి విలువ రూ.10లక్షల లోపు ఉంటే రూ.100, అంతకు మించితే రూ.1000 రిజిస్ట్రేషన్ ఫీజుతో రిజిస్ట్రేషన్ చేయాలని నిర్ణయించారు. పలు కారణాలతో ఈ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. నెల రోజులు గడుస్తున్నా.. ఈ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఒక్క రిజిస్ట్రేషనూ జరగలేదు. తన తండ్రి ద్వారా సంక్రమించిన వారసత్వ భూమిని రిజిస్ట్రేషన్ చేయాలని ఓ వ్యక్తి ముమ్మిడివరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లగా.. ఆ కుటుంబ యజమాని పేరిట ఉన్న భూమి వెబ్ ల్యాండ్‌లో నమోదు కాకపోవడంతో సమస్య ఎదురైంది.

**వెబ్‌ల్యాండ్‌లో నమోదు కాకపోతే..**

భూములకు సంబంధించి ఏళ్ల తరబడి సమస్యలు ఉన్నాయి. ప్రధానంగా వెబ్‌ల్యాండ్‌లో సంబంధిత ఆస్తి యజమాని పేరు నమోదు కాకపోవడం. సర్వే నంబర్లలో పొరపాట్లు వంటివి ప్రధాన సమస్యగా ఉంది. గతంలో వీటిని అధికారులు ఇష్టానుసారం నమోదు చేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. సంబంధిత యజమానులు తమ పేరు మార్పు కోసం నానాతంటాలు పడుతున్నారు. 'వారసత్వ భూముల రిజిస్ట్రేషన్ విషయంలో ప్రభుత్వం నామమాత్రపు రుసుంతో వారసులకు భాగాలుగా రిజిస్ట్రేషన్ చేయడానికి అవకాశం కల్పించింది.' అని జిల్లా రిజిస్ట్రార్ నాగలింగేశ్వరరావు అన్నారు.

**25 మాత్రమే..**

జిల్లాలో 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నిత్యం ఒక్కోచోట 30 నుంచి 40 వరకు రిజిస్టేషన్లు జరుగుతాయి. జిల్లా వ్యాప్తంగా 350–400 రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. వారసత్వానికి సంబంధించి ఇప్పటి వరకు జిల్లాలో కేవలం 25 రిజిస్ట్రేషన్లు మాత్రమే జరగడం గమనార్హం. చాలాచోట్ల ఒక్కటీ కాలేదు.

**ప్రధాన సమస్యలు..**

ఎప్పటి నుంచో ఉన్న రెవెన్యూ సంబంధిత సమస్యలు.

వెబ్‌ల్యాండ్‌లో సదరు సర్వే నంబర్లు ఆన్‌లైన్ చేయకపోవడం.

1బీ అడంగల్‌లో నమోదు కాకపోవడం.

వారసులు కార్యాలయాలకు వెళ్తే రకరకాల ధ్రువీకరణ పత్రాలు అడగడం

నిబంధనల పేరుతో పలుసార్లు కార్యాలయాలకు తిప్పించడం.

# ఇఫ్కో.. ప్రగతికి మార్గమిదిగో!

నెల్లూరు: జిల్లా పారిశ్రామిక రంగంలో మరో మేలి అడుగు పడింది. దశాబ్దాల సమస్యకు పరిష్కారం లభించింది. రాచర్లపాడు సమీపంలో ఏర్పాటు చేసిన ఇఫ్కో కిసాన్ సెజ్ ప్రత్యేక ఆర్థిక మండలికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. భూములిచ్చిన వారికి పరిహారం చెల్లింపు అంశాలు కోర్టులో ఉన్నా.. ఆ భూముల్లో పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి. దీంతో గతంలో ఎరువుల పరిశ్రమ కోసం తీసుకోగా.. ప్రస్తుతం పారిశ్రామిక పార్కుగా మార్చేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఆ మేరకు పరిశ్రమల ఏర్పాటుకు ఇటీవల విశాఖలో జరిగిన పారిశ్రామిక సదస్సులో ఎంవోయూ కుదుర్చుకోవడం గమనార్హం.




**పరిశ్రమలను ఆకర్షించేలా..**

ఇఫ్కో సెజ్ జాతీయ రహదారికి ఆనుకుని ఉండటం.. రైలు, రోడ్డు, వాయు, జల మార్గాల ద్వారా రవాణా అవకాశాలు పుష్కలంగా ఉండటంతో పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతారని అధికారులు భావిస్తున్నారు. మొత్తం రూ. 870 కోట్లతో మౌలిక వసతుల కల్పనకు సిద్ధమవుతున్నారు. అందుకు సంబంధించిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణకు నోటీసును కూడా జారీ చేశారు. ఇప్పటికే మూడు ప్రధాన సంస్థలు పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రాగా.. రూ. 356 కోట్లతో రామ్కీ బయో ప్రైవేటు లిమిటెడ్ సంస్థకు డిసెంబరు 30న పర్యావరణ అభిప్రాయ సేకరణ జరగనుంది.

దీనిపై కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ.. 'ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు ప్రోత్సాహకాలను అందించనుంది. ఈ సెజ్‌తో ఎంఎస్ఎంఈ/ఎస్ఎంఈలకు, స్థానికులకు ఉపాధి, వ్యాపార అవకాశాలు లభిస్తాయి. పార్కు పూర్తిగా అభివృద్ధి చెందితే కావలి–నెల్లూరు మధ్య కీలక ఆర్థిక కారిడార్‌గా మారుతుంది' అని అన్నారు.

# సకాలంలో చికిత్సే కీలకం..

విశాఖపట్నం: ఉత్తరాంధ్రలో 'స్క్రబ్ టైఫస్' కేసులు పెరుగుతుండటంతో ప్రజలు భయపడుతున్నారు. తాజాగా వ్యాధి లక్షణాలతో దేవరాపల్లికి చెందిన 50 ఏళ్ల వ్యక్తి మరణించడంతో ఆందోళన చెందుతున్నారు. అయితే 'స్క్రబ్ టైఫస్'పై ఆందోళన అవసరం లేదని వైద్యులు చెబుతున్నారు. ఇది కొత్తగా వచ్చిన వ్యాధి కాదని, సకాలంలో చికిత్స తీసుకోవాలని సూచిస్తున్నారు.

కలెక్టర్ సూచనల మేరకు వైద్యులు, సిబ్బందితో కూడిన ర్యాపిడ్ రెస్పాన్స్ టీం (ఆర్ఆర్‌టీ)లు ఏర్పాటు చేశారు. ఒకే ప్రాంతంలో ఐదు కంటే ఎక్కువ కేసులుంటే ఆ బృందం వెళ్లి పరీక్షిస్తుంది.

ఇక్కడే ఎందుకంటే..ఈ ఏడాది ఇప్పటివరకు ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో 200కు పైగా కేసులు బయటపడ్డాయి. అందులో ఎక్కువ శాతం విశాఖలోవే.

జిల్లాలో ఆసుపత్రులు, ప్రయోగశాలలు ఎక్కువగా ఉన్నాయి. మెరుగైన వైద్య సదుపాయాలుండటంతో అనకాపల్లి, విజయనగరం జిల్లాల నుంచి అనుమానిత లక్షణాలున్న బాధితులు ఎక్కువగా ఇక్కడికి వస్తున్నారు. దీంతో ఇక్కడే కేసులు ఎక్కువగా బయట పడుతున్నాయి. అందులో అధిక భాగం కేజీహెచ్‌లో నిర్ధారణ అవుతున్నాయి.

మరోవైపు రాష్ట్రంలోనే ఎక్కువ కేసులు నమోదైన జాబితాలో విశాఖ ఉండటంతో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు.

ఎవరికైనా వ్యాధి లక్షణాలుంటే నిర్లక్ష్యం చేయకుండా సమీప ఆరోగ్య కేంద్రం వైద్యులను సంప్రదించాలని డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు సూచించారు.

లక్షణాలు..అకస్మాత్తుగా 99 డిగ్రీలకు పైగా జ్వరం, అలసట, తలనొప్పి, వాంతులు, దద్దుర్లు, శరీరంపై నల్లటి మచ్చలు.

అలా.. గుర్తించారుఆంధ్ర వైద్య కళాశాలకు చెందిన మైక్రోబయాలజీ విభాగ వైద్యులు గతేడాది దీనిపై పరిశోధన చేశారు. 2023 ఫిబ్రవరి నుంచి 2024 ఫిబ్రవరి వరకు కేజీహెచ్‌లో ఇన్‌పేషెంట్లుగా చేరిన మొత్తం 507 మంది అనుమానితుల నమూనాలు పరీక్షించారు. అందులో 49 మందికి స్క్రబ్ టైఫస్ పాజిటివ్‌గా గుర్తించారు. బాధితుల్లో మహిళల (30.6 శాతం) కంటే పురుషులే (69.4 శాతం) ఎక్కువగా ఉన్నారు. వారిలో ఆరుగురు జ్వరం రావడానికి ముందు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లినట్లు గుర్తించారు. వారిలోనూ యువత ఎక్కువగా ఉండటం గమనార్హం.

నిర్లక్ష్యం చేస్తేనే సమస్య..

'స్క్రబ్ టైఫస్'పై భయపడాల్సిన అవసరం లేదు. ఇది ఒకరి నుంచి మరొకరికి వ్యాపించదు. జ్వరం వచ్చిన 3 నుంచి 5 రోజుల్లో పరీక్షలు చేయించుకోవాలి. త్వరగా గుర్తించకపోవడం వల్ల సమస్య తీవ్రమవుతుంది' అని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు పేర్కొన్నారు.

# నిబంధనలకు నీళ్లు.. నచ్చినట్టు వసూళ్లు!

అనకాపల్లి : జిల్లాలోని వందల సంఖ్యలో క్వారీలు ఉన్నా.. గతంలో ప్రభుత్వానికి సీనరేజ్ రూపంలో ఒక్క రూపాయి కూడా ఆదాయం వచ్చేది కాదు. దీంతోపాటు అధికారిక క్వారీల్లో పరిమితికి మించి తవ్వేసేవారు. ఇవన్నీ పరిగణనలోకి తీసుకున్న కూటమి ప్రభుత్వం.. అక్రమ మైనింగ్, రవాణాను అడ్డుకట్ట వేసేందుకు సీనరేజ్ వసూళ్లను ప్రైవేటు సంస్థకు అప్పగించేసింది. దీంతో ఆ సంస్థ జిల్లాలో పలుచోట్ల అక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసింది. ఈ చెక్‌పోస్టుల్లో ఎక్కడా నిబంధనలు అమలు కావడం లేదు.

అంచనా ప్రకారం లెక్కేసి.. నిబంధనల ప్రకారం క్వారీలున్న ప్రాంతాల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజలకు, వాహనదారులకు అవగాహన కల్పించాలి. గ్రానైట్, గ్రావెల్, క్రషర్, నల్లరాయి, మెటల్ రవాణా వాహనాలకు వే బిల్లు లేకపోతే.. వాటి నుంచి సీనరేజ్ వసూలు చేయాలి. కానీ.. జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులు వద్ద ఎక్కడా వే బ్రిడ్జిలు లేవు. వాహనంలో ఎంత పరిమాణంలో సరకు వెళ్తోందో కూడా చూడటంలేదు. అంచనా ప్రకారం లెక్కలేసి.. డబ్బులు ఇవ్వాలంటూ హుకుం జారీ చేస్తున్నారు. ఇవ్వమంటే.. వాహనాన్ని కదలనీయడం లేదు. కొన్నిచోట్ల వాహనాల వెంట ద్విచక్రవాహనాలపై వెంబడించి మరీ నిలుపుదల చేసి డబ్బులు డిమాండ్ చేస్తున్నారు.

ఇటీవల పాయకరావుపేట మండలంలోని సత్యవరానికి చెందిన పడాల కృష్ణ సమీపంలోని క్వారీ బూడిదను పశువుల పాకను ఎత్తుచేసేందుకు ట్రాక్టర్‌తో తీసుకెళ్తుండగా.. ఇద్దరు బైక్‌పై వచ్చి ఆపారు. ట్రాక్టర్ బూడిదకు రూ. 800 ఇవ్వాలని ముక్కుపిండి వసూలు చేశారు.

రసీదులు ఇవకుండానే..కాంట్రాక్టు పొందిన సంస్థ ముద్రించిన బిల్లులు కూడా ఇవ్వడంలేదు. కొన్నిచోట్ల చేతి రాతతో.. వాహనం నంబర్, సమయం, తేదీ, చెక్‌పాయింట్ పేరు రాసి అదే రసీదంటూ డ్రైవర్ చేతిలో పెట్టేస్తున్నారు.

## అక్కడ అందరూ.. 'తాపీ'గుంటారు..!

పుత్తూరు :అద్భుతమైన ఇళ్ల నిర్మాణం మొదలు పెట్టాలంటే నేటి కాలంలో అందరూ ఇంజినీర్లను సంప్రదించి నిర్మాణాలు చేస్తున్నారు. కానీ పుత్తూరు, పలమనేరుకు చెందిన తాపీమేస్త్రీలు ఇంజినీర్లకు తీసిపోని విధంగా నిర్మాణాలు చేపడుతూ ఔరా అనిపిస్తున్నారు.

**గోవిందపాళెం మేస్త్రీలకు డిమాండు ఎక్కువే..**

పుత్తూరు మున్సిపాలిటీలోని గోవిందపాళెంలోని తాపీమేస్త్రీలకు భలే డిమాండ్. ఎన్నో ఏళ్లుగా ఇదే వృత్తిని ఎంచుకుని జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం గ్రామంలో సుమారు వంద కుటుంబాలు ఉన్నాయి. అందరూ తాపీమేస్త్రీలే. పుత్తూరులో వందల భవనాలు వీరి చేతుల మీదుగా నిర్మించినవే. నగరిలో ఎన్ఎంసీ థియేటర్, తిరుపతి సంధ్య థియేటర్, కేఎస్ఆర్ కల్యాణ మండపం ఇలా చెప్పుకొంటూ పోతే పెద్ద జాబితాయే



ఉంది. వంశపారంపర్యంగా ఇదే వృత్తిలో కొనసాగుతుండటంతో అందులోని మెలకువలు నేర్చుకుని ఆ రంగంలో రాణిస్తుండటం విశేషం.

**ఇంటికొకరు..**సాధారణంగా గ్రామాల్లో అందరూ ఒకే మాటకు కట్టుబడి ఉండటం చూశాం. కానీ ఆ గ్రామంలో మాత్రం అందరూ ఒకే పనిని ఎంచుకోవడం విశేషం. పలమనేరు మండలంలోని గొబ్బిళ్లకోటూరులో సుమారు 500 గృహాలు ఉన్నాయి. ఇక్కడ ఇంటికొకరు తాపీ పనివారు ఉంటారు. అయితే ఎందుకు అందరూ ఒకే రకం పని నేర్చుకున్నారంటే వారి దగ్గర సమాధానం లేదు. సమీప బెంగళూరులో నిర్మాణ పనుల కూలీలకు డిమాండు ఉండటంతో ఉపాధి నిమిత్తం వీరంతా ఎక్కువగా అక్కడికే వెళ్తుంటారు. గంగవరం మండలం బండమీదజరావారిపల్లెలో కూడా 90 శాతం మంది ఈ పని చేస్తున్నారు. పలమనేరు

## కట్టాలంటే కాసులమోత.. వికటిస్తే కూల్చివేత

తిరుపతి : తిరుపతిలోని తిరుమల బైపాస్ సమీపంలో ఓ భారీ బహుళ అంతస్తుల భవన నిర్మాణం గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించారు. అప్పట్లో అధికార పార్టీ నాయకుల అండదండలతో పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు రూ.5 లక్షల లంచం తీసుకొని నిర్మాణానికి అనుమతించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారం లోకి రావడంతో మరోసారి అధికారులు వాలిపోయారు. మరో రూ.4 లక్షలు తీసుకొని పనుల కొనసాగింపునకు ఆమోదించారు. రెండోసారి లంచం తీసుకున్న అధికారి బదిలీ కావడం.. అతని స్థానంలో వచ్చిన మరో అధికారి రూ.4 లక్షలు తీసుకొని పనులను చూసీచూడనట్లు వదిలేశారు. సుమారు రూ.13 లక్షల లంచం ఇచ్చుకున్నా.. ఆ భవన నిర్మాణంపై తీవ్ర విమర్శలు రావడంతో నగరపాలక కమిషనర్ కూల్చివేతకు ఆదేశించారు. మామూళ్లు తీసుకున్న అధికారులే దగ్గరుండి ఆపని చేపట్టడం గమనార్హం.

తిరుపతిలో ఎవరైనా భవన నిర్మాణం చేపట్టారంటే కొంతమంది అధికారులు కాకుల్లా వాలిపోతున్నారు. ఏవేవో నిబంధనలు చెప్పి బెదిరిస్తారు. అడిగినంత ఇచ్చుకుంటే అటువైపు కన్నెత్తి చూడరు. బయటి వ్యక్తులు నిర్మాణంపై ఫిర్యాదు చేస్తే.. భవనం కూల్చినట్లు ఉన్నతాధికారులను ఫొటోలతో ఏమార్చుతారు. తప్పనిసరిగా కూల్చాల్సి వస్తే.. లంచం ఇచ్చిన వ్యక్తికి మొండిచేయి చూపించి కూలగొడతారు. ఈ తతంగం తిరుపతి నగరంలో సాధారణమై పోయింది.

**కక్కలేక.. మింగలేక..**

తిరుపతి నగరంలో అక్రమ భవనాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. కొంతమంది అధికారులు దొడ్డిదారిన అనుమతులిస్తూ అడ్డగోలుగా జేబులు నింపుకొంటున్నారు. ఇన్నాళ్లు దర్జాగా సాగిన వీరి అవినీతి దందాకు ప్రభుత్వం కళ్లెం వేసింది. కూటమి ప్రభుత్వం అక్రమ, అనధికారక భవనాలు, అంతస్తులను కూల్చివేయాలని ఆదేశించడంతో.. కొందరి పరిస్థితి కక్కలేక.. మింగలేక అన్నట్లుగా మారింది. దీంతో కొత్త నాటకాలు ప్రారంభించారు. ఇన్నాళ్లు అక్రమ నిర్మాణాలను



ప్రోత్సహించిన అధికారులే కూల్చివేతలకు ఎగబడుతుండటంతో అక్రమ భవన నిర్మాణదారుల్లో ఆందోళన మొదలైంది. అప్పుడే అన్ని అనుమతులు తీసుకొని.. ప్రభుత్వానికి రుసుములు చెల్లించినా సరిపోయేదని ఇప్పుడు మదనపడుతున్నారు.

**అనుమతులు సాధ్యం కాదని..**

తిరుపతిలో నిషేధిత జాబితా భూములు, తితిదే భూములు, కాలువ పోరంబోకు స్థలాలు ఎక్కువగా ఉన్నాయి. నిబంధనల ప్రకారం వీటిల్లో నిర్మాణాలకు అనుమతులు పొందడం సాధ్యం కాదు. ఇదే ఆ విభాగం అధికారులకు కలిసిస్తోంది. ఎల్ఆర్ఎస్, బీపీఎస్ సౌకర్యాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలోనూ విఫలమవుతున్నారు.

**అవగాహన లేకే..**

రాష్ట్రంలో స్థిరాస్తి వ్యాపారాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం భవన నిర్మాణాలు, లేఅవుట్ల ఏర్పాటు కోసం సింగిల్ విండో విధానాన్ని తీసుకువచ్చింది. అనుమతులు సులభతరం చేసింది. ఆన్‌లైన్ విధానంలో పలు రకాల మినహాయింపులతో గంటల వ్యవధిలోనే అనుమతులు పొందే ఏర్పాట్లు చేసింది. ఐదు అంతస్తుల భవనాలకు ప్రభుత్వ గుర్తింపు కలిగిన లైసెన్సుడ్ ఇంజినీర్ల ద్వారా దరఖాస్తు చేసి రుసుములు చెల్లిస్తే అనుమతులు సులువుగా వచ్చేస్తాయి. వీటిపై చాలామందికి అవగాహన లేకపోవడంతో అధికారులతో లాలూచీ పడుతున్నారు.

## శునకాలకు ప్రత్యేక ఆహార జోన్లు..!



పలాస : వీధుల్లో తిరిగే శునకాల కోసం ప్రత్యేక ఆహార జోన్లు ఏర్పాటు చేయాలని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ జారీ చేసిన ఉత్తర్వులతో అధికారులు కుస్తీ పడుతున్నారు. రోడ్లు, బహిరంగ ప్రదేశాల్లో శునకాలకు ఆహారం ఇవ్వడాన్ని నిషేధించాలని స్పష్టం చేయడంతో స్థలాల ఎంపికపై దృష్టి సారించారు. ప్రధాన కూడళ్లల్లో హెల్ప్‌లైన్ నంబరుతో కూడిన బోర్డులు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. త్వరలోనే నిబంధనల ప్రకారం నూతన విధానం అమలయ్యేలా పర్యవేక్షిస్తామని స్పష్టం చేశారు. పలాస-కాశీబుగ్గ, ఆమదాలవలస పురపాలక సంఘాలు, శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో పరిస్థితిపై కథనం.

**జంట పట్టణాల్లో అన్వేషణ**

కాశీబుగ్గ సంత మైదానం సమీపంలో, రైల్వే గేటు, పలాస పాత కోర్టు సమీపంలో శునకాల కోసం ప్రత్యేక ఆహార జోన్లు ఏర్పాటు చేయడానికి స్థలాలు అన్వేషిస్తున్నారు. ఆహారం వేయడానికి నిధులు కేటాయించకపోవడంతో ప్రజలకు అవగాహన కల్పించడానికి సమాయత్తమవుతున్నారు. శునకాలు ఎక్కువగా సంచరించే ప్రాంతాలపై ప్రధానంగా దృష్టి సారించారు.

**వార్డుకు ఒకటి**శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో వార్డుకు ఒకటి చొప్పున 48 ప్రాంతాల్లో శునకాలకు ఆహారం పెట్టేలా కేంద్రాల ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. వాటి సమాచారం తెలియజేయడానికి నగరపాలక సంస్థ తరఫున హెల్ప్‌లైన్ నంబరుతో ప్రధాన కూడళ్ల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. అనుమతి తీసుకుని పెంపుడు కుక్కల్ని పెంచాలని కోరుతున్నారు.

**ఆమదాలవలసలో అగమ్యగోచరం**ఆమదాలవలస పురపాలక సంఘంలో ఫీడింగ్ కేంద్రం ఊసే లేదు. 436 శునకాలకు సంతాన నియంత్రణ శస్త్రచికిత్స చేసినా వాటికి ఆహారం అందించేలా ఏర్పాట్లు చేయలేదు. ఎక్కడెక్కడ నెలకొల్పాలనే విషయంపై స్పష్టత లేకపోవడంతో పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

## నానో మాకొద్దు..!




: రబీలో వ్యవసాయానికి అవసరమైన మేర ఎరువులు దొరక్క రైతులు ఒత్తిడికి గురవుతుండగా..కొందరు డీలర్లు నానో ఎరువులు అంటగట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. యూరియా, డీఏపీ బస్తా కావాలంటే కచ్చితంగా తీస్కుళ్లాల్సిందేనని అంటగడుతున్నారు. వాటి వినియోగంపై అవగాహన లేకపోవడంతో తలలు పట్టుకుంటున్నారు.

ఇదీ పరిస్థితి జిల్లాలో ఎరువుల సరఫరాకు సంబంధించి ఐదుగురు గుత్త వ్యాపారులు, 300 మందికి పైగా వ్యాపారులు, 181 మంది డీలర్లు ఉన్నారు. ప్రతి ఎరువుల బస్తాకు 1:2 నిష్పత్తిలో నానో ఎరువులు తీస్కుళ్లాల్సి వస్తోందని డీలర్లు వాపాపోతున్నారు.

గుత్త వ్యాపారుల అజమాయిషీతో డీలర్లు, వ్యాపారులు తలలు పట్టుకుంటున్నారు. యూరియా, డీఏపీ కావాలంటే తప్పనిసరిగా తాము చెప్పినట్లు సరకు తీస్కుళ్లాల్సిందేనని స్పష్టం చేస్తున్నారు.

వ్యవసాయాధికారులు సైతం పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో అన్నదాతల్లో గందరగోళ పరిస్థితి నెలకొంది.

ఒకవైపు ఎరువుల కొరత, మరోవైపు నానో ఎరువులను అంటగట్టడంపై రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. వీటి పిచికారీపై అవగాహన, సాంకేతికత అందుబాటులో లేకపోవడంతో విముఖత చూపుతున్నారు.

**అవగాహన అవసరం ..**- త్రినాథస్వామి, జేడీ, వ్యవసాయ శాఖ, శ్రీకాకుళం నానో ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన అవసరం. ఈ విషయమై వచ్చే వారంలో సదస్సులు నిర్వహిస్తాం.

## తాత్కాలిక శౌచాలయాలకు రూ.87లక్షలా?



పుట్టపర్తి: సత్యసాయి శతజయంతి వేడుకల సందర్భంగా చేసిన ఏర్పాట్లు, అభివృద్ధి పనులకు.. గుత్తేదార్లు పెట్టిన బిల్లులకు పొంతనే ఉండటం లేదు. ఇష్టారాజ్యంగా బిల్లులు తయారు చేసి.. నిధులు నొక్కేసేందుకు యత్నాలు మొదలెట్టారు. ఇందుకు ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ఓ అధికారిని గుత్తేదారులు ప్రసన్నం చేసుకుని ముందస్తుగా ముడుపులు అందించినట్లు సమాచారం. గతేడాది నవంబరు 18 నుంచి 23 వరకు సత్యసాయి శతజయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఇందుకుగాను ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో జిల్లా కేంద్రం పుట్టపర్తిలో వీధిదీపాలు ఏర్పాటు, రహదారులకు ఇరువైపులా పిచ్చిమొక్కల తొలగింపు, తాత్కాలిక శౌచాలయాల ఏర్పాటు, రహదారుల నిర్మాణం.. తదితర పనులు చేపట్టారు. ఆయా పనులకు రూ.కోట్లలో ఖర్చయిందని, నిధులు విడుదల చేయాలని గుత్తేదారులు బిల్లులు సమర్పించారు.

**ఏవి.. ఎక్కడున్నాయో..**

పారిశుద్ధ్యం మెరుగుకు పరికరాలు, బ్లీచింగ్, ఫాగింగ్ యంత్రాలను కొనుగోలు చేశారు. ఎన్ని పరికరాలు కొనుగోలు చేశారో.. అవి ఎక్కడున్నాయో తెలియదు. నేటికీ కార్మికులు పరికరాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోలు చేసిన పరికరాలకు రూ.39 లక్షలు వెచ్చించినట్లు బిల్లు పెట్టారు. రహదారులకు ఇరువైపులా పిచ్చిమొక్కలు తొలగింపు, యంత్రాలతో పార్కింగ్ ప్రాంతాల్లో శుభ్రం చేయించడం, తాగునీరు ఏర్పాటు, అదనంగా పారిశుద్ధ్య కార్మికుల నియామానికి రూ.30 లక్షలు ఖర్చు చేసినట్లు బిల్లులు రూపొందించారు. వీధిదీపాల ఏర్పాటుకు రూ.46 లక్షలు ఖర్చు చేసినట్లు నమోదు చేశారు. ప్రధాన రహదారులు తప్ప మున్సిపాలిటీ పరిధిలోని 10 నుంచి 20వ వార్డు వరకు చాలాచోట్ల వీధిదీపాలు ఏర్పాటు చేయలేదు. కొనుగోలు చేసి ఎక్కడ ఏర్పాటు చేశారో తెలియని పరిస్థితి.

**కొత్తవి నిర్మించినా.. అంత ఖర్చు కాదు**

భక్తుల సౌకర్యార్థం కర్ణాటకనాగేపల్లి, కమ్మవారిపల్లి రహదారి, తహసీల్దార్ కార్యాలయం, అమూల్య లేఅవుట్, ఆనంద్ విల్లాస్, శిల్పారామం తదితర ప్రాంతాల్లో తాత్కాలిక శౌచాలయాలు ఏర్పాటు చేశారు. వీటి కోసం రూ.87 లక్షలు ఖర్చు చేసినట్లు లెక్కలు చూపుతున్నారు. కొత్తవి నిర్మించినా.. అంత డబ్బు ఖర్చు కాదని స్థానికులు చెబుతున్నారు.

**నిబంధనల మేరకే చెల్లిస్తాం**

క్రాంతికుమార్, మున్సిపల్ కమిషనర్

శత జయంతి వేడుకల ఏర్పాట్లు, అభివృద్ధి పనులకు అనుగుణంగా బిల్లులు మంజూరు చేస్తాం. ఎక్కడా అవినీతికి తావులేకుండా పరిశీలన చేసి.. నిబంధనలకు మేరకే గుత్తేదారులకు బిల్లుల చెల్లింపు చేస్తాం.

## అనంత యార్డులో సమస్యలెన్నో..



అనంతపురం : ఉమ్మడి జిల్లాలో అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డు పెద్దది. వేలాదిగా రైతులు, వ్యాపారులు క్రయవిక్రయాలు సాగిస్తుంటారు. ఏడాదికి రుసుం వసూళ్లు రూ.5.10కోట్ల పైమాటే. అయితే సమస్యలు రాజ్యమేలుతున్నాయి. పునర్విభజనతో అనంతపురం అర్బన్ నియోజకవర్గ పరిధి వరకు ఉంది. రాప్తాడు, శింగనమల నియోజకవర్గాల్లో వేర్వేరుగా యార్డులు ఏర్పాటయ్యాయి. దీంతో ఉద్యోగులను విభజించి ఆయా యార్డులకు సర్దుబాటు చేశారు. సిబ్బంది కొరత పట్టిపీడిస్తోంది. ఈనెల 8న అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్ అధ్యక్షతన కొత్త పాలకవర్గం కొలువుదీరనుంది. యార్డు అభివృద్ధితోపాటు రైతులు, వ్యాపారులకు వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది.**అభివృద్ధి అస్తవ్యస్తం**గత వైకాపా ప్రభుత్వం 2020లో ఎనిమిది అభివృద్ధి పనులకు రూ.12.10 కోట్లు మంజూరు చేసింది. ఆ పనులన్నీ అసంపూర్తిగా ఉన్నాయి.యార్డులో పండ్ల వ్యాపార సముదాయ దుకాణాలు 39, చీనీ వ్యాపార దుకాణాలు 27 ఉన్నాయి. అన్నింటిని అద్దెకిచ్చారు. గత పాలకవర్గం సభ్యులు ఒకే సామాజిక వర్గానికి చెందిన దుకాణాదారులతో అద్దెలు వసూలు చేయకుండా వత్తాసు పలికారు. దీంతో నాలుగేళ్లుగా అద్దెలు మొండి బకాయిలుగా మిగిలిపోయాయి.

కేంద్ర ప్రభుత్వం రూ.40 లక్షలతో గ్రేడింగ్ యంత్రం అందించింది. ఒక్క రోజు కూడా పనిచేసిందేలేదు. తడి, పొడి చెత్తను ఎరువుగా మార్చేందుకు స్వచ్ఛభారత్ కింద కేంద్ర ప్రభుత్వం 2019లో రూ.5లక్షలతో విలువైన యంత్రం పంపింది. అది మూలనపడింది. రైతుల ఆకలి తీర్చేందుకు రాయితీ భోజనం అందించాల్సి ఉన్నా.. అమలు కావడం లేదు.అన్నదాతలు విశ్రాంతి తీసుకునేందుకు నిర్మించిన భవనం ఇప్పటికీ తెరుచుకోలేదు. యార్డు ఎంపికశ్రేణి కార్యదర్శి గోవిందు నాలుగు నెలల కిందట ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు డిప్యూటేషన్‌పై వెళ్లారు. ఇక్కడ మార్కెటింగ్‌శాఖ ఏడీ రాఘవేంద్రరావుకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు.

చీనీ సంతలో కొన్నేళ్ల నుంచి మురుగు సమస్య వేధిస్తున్నా పట్టించుకునే నాథుడే లేడు. ధరలు ప్రదర్శించే బోర్డు పాడైపోయి ఏడాదవుతున్నా కొత్తది ఏర్పాటు చేయలేదు. ఈ సమస్యలను కొత్త పాలకవర్గం పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## మంత్రి ఆదేశించినా..! ఆక్రమణలు మామూలే

రాజమహేంద్రవరం : పుష్కరాలకు వచ్చే భక్తులను దృష్టిలో పెట్టుకొని రహదారులు, కాలువలను విస్తరించాలని మంత్రి నారాయణ అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. ఇటీవల నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆక్రమణలపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. రోడ్లు విస్తరించాలంటే ముందుగా ఆక్రమణలు తొలగించాలి. ఇందుకుగాను నగరంలో రద్దీగా ఉన్న రహదారులు, వాటి పరిధిలోని ఆక్రమణలు గుర్తించారు. తొలుత మూలగొయ్యి, జాంపేట, ఆజాద్ చౌక్, కంబాలచెరువు ప్రాంతాల్లో ఆక్రమణలు తొలగింపు ప్రారంభించారు. ఈ ప్రక్రియ మధ్యలోనే నిలిచిపోయింది. దీంతో తొలగించిన చోట మళ్లీ ఆక్రమణలు వెలిశాయి. ఏకంగా నడకదారుల పై దుకాణాలు, రోడ్డుపైనే వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా ఇక్కడ



40 నుంచి 60 అడుగుల రోడ్డు ఉన్నప్పటికీ కనీసం వెళ్లేందుకు 20 అడుగుల కూడా కనిపించకపోవడం గమనార్హం. దుకాణాలు రోడ్డుపైకి వస్తే, కొనుగోళ్ల కోసం వచ్చిన వాహనదారుల వాహనాలు రోడ్డు సగం ఆక్రమించేస్తున్నాయి. దీంతో ఉన్న సగం రోడ్డులోనే వాహనాలు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. నగరంలో ప్రధాన ప్రాంతాల్లో ఇదే దుస్థితి నెలకొంది. దేవీచౌక్, మెయిన్ రోడ్డు, జాంపేట, గోరక్షణపేట, కోరుకొండ రోడ్డు, కోటిపల్లి బస్టాండ్ రోడ్డు, అప్సరా థియేటర్ రోడ్డు, కోటగుమ్మం, డీలక్స్ సెంటర్ తదితర ప్రాంతాల్లో ఈ పరిస్థితి నెలకొంది. జాంపేట వద్ద బిర్యానీ సెంటర్లు, చికెన్ దుకాణాలను నెలవారీ మామూళ్లకు అలవాటు పడిన యంత్రాంగం చూసిచూడనట్లు వదిలేసినట్లు సమాచారం. ముఖ్యంగా పెద్ద దుకాణాల విషయంలో భారీగానే మామూళ్లు పిండేస్తున్నారు. రానున్న పుష్కరాల నేపథ్యంలో ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని భవిష్యత్తు కార్యాచరణ దిశగా అడుగు వేస్తుంటే ఆదిలోనే హంస పాదు అన్నట్లు పరిస్థితి మారిపోయింది.

## ఉపాధి పని దినాల పెంపు

రావులపాలెం : ఇప్పటి వరకు ఉపాధి హామీ పథకంలో పనిదినాలు 100 రోజులు ఉండేవి. వీటిని 125 రోజులకు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వ్యవసాయ, ఉద్యాన పంటలకు ఈ పథకాన్ని అనుసంధానం చేయడంతో రైతులు, వేతనదారులకు మేలు చేకూరనుంది.

**3.36 లక్షల మందికి ప్రయోజనం**

అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని 22 మండలాల్లో 385 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. జాబ్ కార్డులు 2.2 లక్షలు ఉండగా ఉపాధి శ్రామికులు 3.36 లక్షల మంది ఉన్నారు. జిల్లాలో జల సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, పాడి పశువులకు గోకులం షెడ్లు, మ్యాజిక్



డ్రెయిన్లు, సీసీ రోడ్ల నిర్మాణం, పండ్ల తోటల పెంపకం, ఉద్యాన పంటల సాగు, ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులను ఉపాధి హామీ పథకం నిధులతో చేపడుతున్నారు. రోజుకు శ్రామికులు గరిష్ట వేతనం రూ.307 పొందుతున్నారు.

**త్వరలోనే అమలు**

వంద రోజుల నుంచి 125 రోజులకు పనిదినాలు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలోనే అమలు చేస్తాం. పనిదినాలు పెరగడం వల్ల వేతనదారులకు గరిష్ఠ ఆదాయం వస్తుంది. మధుసూదన్, డ్వామా పీడీ

## 'సూర్య'డర్

నంద్యాల : దేశవ్యాప్తంగా కోటి సౌర విద్యుత్తు ఫలకాలు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. పీఎం 'సూర్యఘర్ యోజన'ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఉమ్మడి జిల్లాలో వినియోగదారులు సద్వినియోగం చేసుకునేలా అధికారులు విస్తృత ప్రచారం చేశారు. పథకం వినియోగించుకునేందుకు చాలామంది ఆసక్తి చూపుతున్నా బ్యాంకర్ల నుంచి సహకారం అంతంతమాత్రంగానే ఉంది. వివిధ కొర్రీలు పెట్టి పథకానికి తూట్లు పొడుస్తున్నారు.

**సదుద్దేశంతో శ్రీకారం చుట్టినా..**

కర్నూలు జిల్లాలో 6,46,025, నంద్యాల జిల్లాలో 5,21,518 మంది గృహ విద్యుత్తు వినియోగదారులు ఉన్నారు. లోఓల్టేజీ సమస్యలు, విద్యుత్తు సరఫరాలో అవాంతరాలను అధిగమించడం.. రూ.వేల విద్యుత్తు బిల్లుల నుంచి ఉపశమనం పొందేందుకు కేంద్రం ఈ పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటివరకు పరిశీలిస్తే నంద్యాల జిల్లాలో 2,200, కర్నూలు జిల్లాలో 1,581 యూనిట్లు మాత్రమే ఏర్పాటయ్యాయి. బ్యాంకుల ద్వారా రాయితీ రుణాలు ఇస్తున్నట్లు చెబుతున్నా క్షేత్రస్థాయిలో అమలవడం లేదు. వ్యాపారులు, ఉద్యోగులకు మాత్రమే బ్యాంకర్లు మంజూరు చేస్తున్నారు.

**అడ్డంకులెన్నో..**

ఉమ్మడి జిల్లాలో పెద్దఎత్తున రైతులున్నారు. వీరు సోలార్ యూనిట్ల కోసం బ్యాంకర్లను సంప్రదిస్తే సిబిల్ స్కోర్, లావాదేవీలు, గతంలో తీసుకున్న రుణాలపై ఆరా తీస్తున్నారు. వ్యక్తిగత వివరాలు అడుగుతుండటంతో వీరు పథకానికి దూరమవుతున్నారు.

ఇంటి యజమాని అంగీకరించకపోవడంతో అద్దె ఇంట్లో ఉన్నవారు పథకాన్ని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు.

60 ఏళ్లు దాటినవారికి రుణం ఇవ్వడం లేదు.

కర్నూలు నగరంతోపాటు నంద్యాల, ఆదోని తదితర పట్టణాల్లో వేలాది బహుళ అంతస్తు భవనాలున్నాయి. ఇక్కడ ఎవరైనా యూనిట్ ఏర్పాటు చేసుకోవాలని భావిస్తే అపార్టుమెంటులో నివసిస్తున్న 10 కుటుంబాల వారు సంతకాలు చేయాల్సి రావడం అడ్డంకిగా మారింది. ఇలా.. సూర్యఘర్‌కు వివిధ వర్గాలవారు దూరమయ్యారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 11,67,543 మంది విద్యుత్తు వినియోగదారులు ఉండగా.. వారిలో కనీసం 0.5 శాతం మందికి కూడా 'సూర్యఘర్' అందని పరిస్థితి నెలకొంది.

**రూ.కోటి అవకాశం కోల్పోయినట్లే..**

గ్రామంలో వంద శాతం ఇళ్లకు సౌర ఫలకాలు ఏర్పాటుచేస్తే.. కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహంగా రూ.కోటి వరకు నిధులు విడుదల చేస్తుంది. కర్నూలు జిల్లాలో 484, నంద్యాల జిల్లాలో 489 గ్రామాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో ఏ ప్రాంతంలోనూ ఈ అవకాశాన్ని వినియోగించుకోలేదు. గ్రామాలవారీగా లక్ష్యాలను నిర్దేశించుకుని బ్యాంకులు రుణాలు ఇవ్వాల్సి ఉంది.

# కీలక మార్గాలు.. ఎన్నో అడ్డంకులు!

విశాఖపట్నం : భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాని కి నగరం, సమీప ప్రాంతాల నుంచి సులభంగా చేరుకోవటానికి విశాఖ మహాప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) ప్రతిపాదించిన ఏడు రోడ్ల పనుల్లో అనుకున్నంత వేగం కనిపించడం లేదు. అడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కి అన్నట్లుంది. కొన్ని సమస్యలను పరిష్కరించడంలో అధికారులు వేగంగా స్పందించటం లేదు. ముఖ్యంగా టీడీఆర్‌ల మంజూరులో జాప్యమే అవరోధంగా ఉంది.

**ఆటంకాలు తొలగితే..**

అడవివరం– గండిగుండం రోడ్డును మాస్టర్‌ప్లాన్‌లో 200 అడుగులుగా ప్రతిపాదిస్తే ప్రస్తుతం వంద అడుగుల్లో నిర్మిస్తున్నారు. ఈ మార్గంలో అటవీశాఖ భూములున్నాయి. ఆ శాఖ నుంచి అభ్యంతరా లొస్తున్నాయి. దీనిపై వీఎంఆర్‌డీఏ కమిషనర్ ఇటీవల కలెక్టర్‌తోనూ సమావేశమ య్యారు. సుమారు 400 విద్యుత్తు స్తంభాలను మార్చాల్సి ఉంది. బోయపాలెం–మంగమారిపేట రోడ్డులో 39 ఆస్తులకు టీడీఆర్లు




మంజూరు చేయాల్సి ఉంది. పరదేశిపాలెం– గంభీరం మార్గానికి 600 మీటర్లలోని స్థలాలకు టీడీఆర్లు మంజూరు చేయాలి. నెరెళ్లవలస– తాళ్లవలస రోడ్డులో 40 ప్రయివేటు ఆస్తులతో పాటు ఒక ఎంపీపీ స్కూల్ ఉంది. దాన్ని అక్కడి నుంచి తరలించడం క్లిష్టంగా ఉంది. చిప్పాడ– పోలుపల్లి రోడ్డుకు ఇంకా ఆర్‌డీపీ, ఎలైన్‌మెంట్ తయారు చేయాలి. శివశక్తినగర్– హరిత ప్రాజెక్టు మార్గంలో ప్రైవేటు స్థలాలు ఇవ్వటానికి కొందరు ముందుకు రాలేదు. 'ప్రతి వారం పనుల ప్రగతిపై నివేదిక తెప్పించుకొని పరిశీలిస్తున్నాం. సమస్యలున్న చోట క్షేత్రస్థాయిలో పరిశీలించి పూర్తయ్యేలా చూస్తున్నాం' అని వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్‌గోపాల్ పేర్కొన్నారు. మొత్తం రోడ్లు: 7
వ్యయం (అంచనా): రూ. 174.64 కోట్లు

# అర్ధాకలితో పది విద్యార్థులు!!

మాధవధార : పదో తరగతిలో మెరుగైన ఫలితాలే లక్ష్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో వంద రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా డిసెంబరు ఒకటి నుంచే ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సెలవు రోజుల్లో తరగతులను నిర్వహించినా మధ్యాహ్న భోజనం అందించ నున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇంతవరకు బాగానే ఉన్నా.. సాయంత్రం అల్పాహారం లేక విద్యార్థులు ఖాళీ కడుపుతో ప్రత్యేక తరగతుల్లో ఉంటున్నారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు పిల్లలను చదివిస్తున్నారు. ఉదయం ఇంటి దగ్గర ఆహారం తీసుకుని, మధ్యాహ్నం పాఠశాలలో భోజనం చేస్తున్నారు. సాయంత్రం పాఠశాల విడిచిన తరువాత పది నిమిషాలు విరామం ఇచ్చి మళ్లీ వారికి రాత్రి 7 వరకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఈ సమయంలో ఆకలిగా ఉండటంతో తరగతుల పట్ల ఏకాగ్రత చూపలేకపోతున్నారు. అల్పాహారం అందిస్తే ఉత్సాహంగా హాజరవుతా రని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు.

**మూడేళ్లుగా లేదు..:** గతంలో జీవీఎంసీలో ఉన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థులకు... మధ్యాహ్న భోజనం సరఫరా చేసే అక్షయపాత్రకే నిధులు కేటాయించి, సాయంత్రం పూట ప్రత్యేక తరగతుల విద్యార్థులకు అల్పాహారం అందించేవారు. మూడేళ్ల క్రితం వైకాపా ప్రభుత్వం



జీవీఎంసీ పరిధిలోని పాఠశాలలన్నీ జిల్లా విద్యాశాఖ పరిధిలోకి తీసుకు రావడంతో అప్పటి నుంచి జీవీఎంసీ నిధులు కేటాయింపు నిలిపివేసి ంది. దీంతో విద్యార్థులకు అల్పాహారం అందడం లేదు. జీవీఎంసీలోని 21 ఉన్నత పాఠశాలలకు మేయర్, కమిషనర్, కార్పొరేటర్లు స్పందించి అల్పాహారం అందించేలా తగు చర్యలు తీసుకోవాలని పలువురు ఉ పాధ్యాయులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

**చాలా మంది పరిస్థితితే..:** ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న విద్యార్థులు చాలా మంది ఏమీ తినకుండా వస్తున్నారని, కొన్ని చోట్ల ఉపాధ్యాయులు బిస్కెట్లు, అరటి పండ్లు వంటివి ఇస్తున్నారు. గతంలో స్వచ్ఛంద సంస్థలు, దాతలు, నాయకులు, సహకరించి అల్పాహారం అందించేవారు. దాతలు, పాలకులు ఈ అంశంపై దృష్టిసారించాల్సి ఉంది. 21 పాఠశాలల్లో పదోతరగతి విద్యార్థులు: 2,283 మంది బాలురు: 1,144 బాలికలు 1,139

# రొయ్య 'ధర'హాసం

పాయకరావుపేట : రొయ్య మీసం మెలేస్తోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధానాలతో దెబ్బతిన్న ఆక్వా రైతులకు ధరల పెరుగుదలతో ఊరట లభిస్తోంది. అక్టోబరు వరకు ఒడుదొడుకులతో ఇబ్బంది పడగా.. ప్రస్తుతం ఎగుమతులు ఆశాజనకంగానే ఉండటంతో పరిస్థితులు కుదురుకుంటున్నాయి. రొయ్యల కౌంట్ ధరల్లో రూ.20 నుంచి 40 వరకు వ్యత్యాసం ఉండటం, క్రిస్మస్ నేపథ్యంలో ఎగుమతుల కు డిమాండ్ నెలకొనడంతో సాగుదారుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. జిల్లాలో పాయకరావుపేట, నక్కపల్లి, అచ్యుతాపురం, ఎస్.రాయవరం, ఎలమంచిలి మండలాల పరిధిలో రెండు వేల ఎకరాలకుపైగా రొయ్యల చెరువులున్నాయి. ఇక్కడి నుంచి వియత్నాం, చైనా, జపాన్, అమెరికా దేశాలకు రొయ్యలు ఎగుమతి అవుతున్నాయి. అమెరికా ఆంక్షల నేపథ్యంలో 20 శాతం వరకు ఆక్వా రైతులు పంట విరామం ఇచ్చారు. వేసవిలో వైట్ గట్, విబ్రియో, ఈహెచ్‌పీ వ్యాధుల ప్రభావంతో రొయ్యల దిగుబడి తగ్గింది. ప్రస్తుతం చలిగాలులు వీస్తుండటంతో వైట్‌స్పాట్ వ్యాప్తి చెందుతోంది. దీంతో రొయ్యలకు డిమాండుతో పాటు ధర పెరుగుతూ వస్తోంది. సీడ్‌లో నాణ్యత లేకపోవడంతో రొయ్యలు వ్యాధుల బారిన పడుతున్నాయని, పెట్టుబడి వ్యయం తగ్గించుకునేందుకు తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ సీడ్ వేస్తున్నారని పాయకరావుపేటకు చెందిన ఆక్వా రైతు యజ్జల చంద్రశేఖర్ చెబుతున్నారు. ఇలా చేయడం వల్ల సాగుదారులు నష్టపోతున్నారన్నారు. తాజాగా ఊహించిన దానికన్నా ధర పెరగడంతో కష్టాల నుంచి ఒడ్డున పడతామని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఏకోపాధ్యాయ బడుల్లో సర్దుబాటు సమస్య



గోరంట్ల : జిల్లా వ్యాప్తంగా ఏకోపాధ్యాయ ప్రాథమిక పాఠశాలల్లో డిసెంబరు మాసంలో సర్దుబాటు సమస్య తీవ్రంగా ఉ న్నట్లు ఉపాధ్యాయులే అంటున్నారు. సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగులు నవంబరు, డిసెంబరు నెలల్లో ఆ ఏడాదికి సంబంధించి మిగిలిన ఉ న్న అన్నిరకాల సెలవులను వినియోగించుకుంటారు. ఈక్రమంలో ఆయా మండలాల్లో ఉపాధ్యాయులను సర్దుబాటు చేయడం ఎంతవరకు తలకుమించిన భారంగా ఉన్నట్లు తెలుస్తోంది. దేశంలోనే ఏకోపాధ్యాయ పాఠశాలలున్న ముందు వరుసలో ఏపీ ఉన్న విషయం తెలిసిందే. ఈక్రమంలో శ్రీసత్యసాయి జిల్లాలో 733 ఏకోపాధ్యాయ పాఠశాలలున్నాయి. అలాంటి పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడు సెలవు పెడితే సీఆర్‌ఎంటీలు, ఎంటీఎస్‌లు, లేదా పక్కమండలాల ఉ పాధ్యాయులను సర్దుబాటు చేస్తున్నారు. అయితే మారుమూల గ్రామాల పాఠశాలలకు వెళ్లడానికి చాలామంది ఇష్టపడడం లేదు. కొన్నిచోట్ల బతిమాలాడాల్సిన పరిస్థితి కొనసాగుతున్నట్లు సమాచారం. ఎక్కువ పాఠశాలలున్న మండలాల్లో పరిస్థితి మరీ ఇబ్బందిగా ఉందని అంటున్నారు. జిల్లాలో ప్రథమ స్థానంలో గోరంట్ల: మండలంలో 85 ప్రాథమిక పాఠశాలలుండగా 45 ఏకోపాధ్యాయ బడులున్నాయి. ఇక్కడ సర్దుబాటు చేయడం తలకుమించిన భారం. త్వరలో మండలానికి అయిదుగురు అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు రానున్నారు. గతంలో ఇక్కడ 11 మంది సీఆర్‌ఎంటీలు ఉండగా ఆసంఖ్య ప్రస్తుతం తగ్గినట్లు తెలుస్తోంది.

జిల్లా: శ్రీసత్యసాయి
మండలాలు: 32 ప్రాథమిక పాఠశాలలు: 1611
ఏకోపాధ్యాయులున్నవి : 733

అత్యధికంగా ఉన్న మండలాలు: గోరంట్ల, తనకల్లు, కదిరి (ఒక్కో మండలంలో 40కి పైగా)పలు చోట్ల సర్దుబాటు చేస్తున్నాం: జానొరెడ్డప్ప, డీవైఈవో, పెనుకొండ సమస్య వాస్తవమే.. అయితే ఎక్కడా సమస్య ఎదురవకుండా సర్దుబాటు చేస్తున్నాం. నిబంధనల ప్రకారం పది లోపు విద్యార్థులున్నచోట ఒక ఉపాధ్యాయుడే ఉంటారు. మినిమం టైం స్కేల్, సీఆర్‌ఎంటీ, ఇద్దరు ఉన్నచోట్ల నుంచి సర్దుబాటు చేస్తున్నాం. త్వరలో జిల్లాకు 68 మంది అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు రానున్నారు. అప్పుడు ఈసమస్య ఇంకా తగ్గుతుంది.

# మునగ.. తినాలి బాగా!



రాయదుర్గం : ప్రణాళిక : స్వయం సహాయక, రైతు సంఘాల సభ్యులను గుర్తించి మునగ సాగు చేయడంపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఇందులో భాగంగానే అనంత జిల్లాలో రాయదుర్గం, రాప్తాడు మండలాలను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు.

**ఏం చేస్తారు :** సాగు విస్తీర్ణం పెంచడం, రైతులకు ఆదాయ వనరుగా మారుస్తారు. సెర్ప్ అధికారులు క్షేత్ర స్థాయిలో అవగాహన పెంచుతు న్నారు. రైతుల ఎంపిక, మొక్కలు నాటే బాధ్యతను డీఆర్‌డీఏ అధికారులు పర్యవేక్షించనున్నారు. విత్తడం, నీరు పెట్టడం, ఎరువులు, పర్యవేక్షణకుగాను ఉపాధి హామీ పథకం కింద (పనికి తగిన వేతనం) రెండేళ్ల వ్యవధిలో ఎకరాకు రూ.1.32 లక్షలు మంజూరు చేస్తారు. రైతులే విత్తనాలు కొనుగోలు చేసి ఎకరా విస్తీర్ణంలో 4 వేల విత్తనాలు నాటితే మూడు నెలలకే పంట చేతికి వస్తుంది.

**ఏర్పాట్లు ఎలా?**


డ్వాక్రా సంఘాల్లోని సభ్యుల కుటుంబాలను యూనిట్‌గా తీసుకుని ఆకును పొడిగా మార్చేందుకు అవసరమైన యంత్రాలు, ఆయా ప్రాంతాల్లో శుద్ధి ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నారు. దిగుబడి ఒకేసారి వస్తే అందుకు అవసరమైన ఏర్పాట్లు అధికారులు చేపడతారు. ఇప్పటికే తమిళనాడులో పంట సాగుపై పరిశీలించి, ఇక్కడ అమలు చేస్తున్నారు. కార్యాచరణ ఇలా: పంట సంరక్షణ, ఆకు శుద్ధి చేయడం, మార్కెట్ సదుపాయం కల్పించడం వంటి బాధ్యతలు నిర్వహిస్తారు.. రైతులకు అండగా నిలిచేందుకు క్షేత్ర స్థాయిలో కార్యాచరణ చేపట్టారు. ఏడాదికి 4 పంటల ద్వారా వచ్చే దిగుబడిని పొడిగా మార్చేందుకు కావాల్సిన యంత్రాలు, సామగ్రిని సైతం ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

లాభాలు ఎన్నో..: రామ్మోహన్, ఆయుర్వేద వైద్యులు, రాయదుర్గం పలు వ్యాధులకు చికిత్సల్లో మునగ పొడి వాడుతున్నారు.
రోగ నిరోధక శక్తిని మెరుగుపరుస్తుంది.
ఆకులు వినియోగంతో కీళ్లనొప్పులు తగ్గిపోతాయి.
ఐరన్ విరివిగా లభించడంతో రక్తహీనత దరిచేరదు.
కొలెస్ట్రాల్, రక్తపోటును నియంత్రణలో ఉంచుతుంది.

జిల్లాలో 200 ఎకరాల్లో సాగు: సలీమ్‌బాషా, డ్వామా పీడీ జిల్లాలో రెండు మండలాలకు కలిపి మొదటి విడతలో 200 ఎకరాల్లో మునగ సాగు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. డీఆర్‌డీఏ అధికారులు రైతులను ఎంపిక చేస్తున్నారు.
మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తాం
గంగాధర, డీపీఎం, జీవనోపాధుల కల్పన విభాగం, సెర్ప్
క్షేత్ర స్థాయిలో మహిళలు, రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పటికే 40 మంది రైతులను ఎంపిక చేయగా.. ఒక్కొక్కరు ఒక ఎకరా సాగు చేసేందుకు ముందుకు వచ్చారు. రాయదుర్గం మండలం చదం గొల్లలదొడ్డిలో నలుగురు రైతులతో విత్తనాలు నాటించాం. మూడు నెలల్లో పంట చేతికి వస్తుంది. మార్కెటింగ్ సదుపాయానికి చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే పలు సంస్థలతో చర్చలు జరిపాం.

# కండలు పీకుతున్నాయ్

ధర్మవరం : జిల్లాలో వీధికుక్కలు, పందుల సంతతి విపరీతం గా పెరుగుతోంది. ఏ ఊరికెళ్లినా.. ఏ వీధిలో చూసినా అవి గుంపులుగా సంచరిస్తూ హడలెత్తిస్తున్నాయి. చిన్నారులు, పెద్దలపై దాడులకు తెగబడుతూ కండలు పీకుతున్నాయి. జనం బయటకు రావాలంటేనే భయపడిపోతున్నారు. ఇటీవల కదిరిలో ఓ బాలుడిపై కుక్కలు విచక్షణ రహితంగా దాడి చేయడంతో కొంత భాగం చెవి తెగిపోయింది. ధర్మవరంలో పంది దాడిలో ఓ మహిళకు చెందిన రెండు చేతివేళ్లు తెగిపడ్డాయి. ఇలా.. గత ఆరు నెలల్లో వందల మంది క్షతగాత్రులుగా మారారు. మున్సిపాలిటీల్లో పరిస్థితి మరింత దయనీయంగా మారింది. కుక్కలు, పందుల నివారణలో ఆశాఖ అధికారులు ఉదాసీన వైఖరి అవలంభిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.



**శునకాలకు శస్త్రచికిత్సలేవీ?**

ధర్మవరం, కదిరి, హిందూపురం మున్సిపాలిటీల్లో కుక్కల కు.ని శస్త్రచికి త్సలకు ఏటా రూ.కోటి దాకా ఖర్చు చేస్తున్నారు. ధర్మవరంలో 2,996, కదిరి 1,790, హిందూపురం 2,000 వీధికుక్కలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఆరు నెలల్లోపు, వయసుమీరిన కుక్కలను లెక్కించలేదు. ధర్మవరం, హిందూపురంలో ఒక్కో కుక్కకు కు.ని శస్త్రచికిత్సకు రూ. 1,600 ఖర్చుపెడితే, కదిరిలో రూ. 1,370 వ్యయం చేస్తున్నారు. కుక్కల కేంద్రం నిర్వహణకు ప్రతి మున్సిపాలిటీ నుంచి ఏటా రూ. 15 లక్షలకు పైగానే నిధులను బడ్జెట్‌లో కేటాయించి వినియోగిస్తున్నారు. కానీ ఆ కేంద్రాల్లో దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. రోజూ 10 నుంచి 14 కుక్కలకు శస్త్రచికిత్సలు చేయాల్సి ఉండగా కేవలం ఐదారింటికేనే సరిపెడుతున్నారు. ఫలితంగా వాటి సంతతి వేగంగా పెరుగుతుందని గణాంకాలు చెబుతున్నాయి. చర్యలు తీసుకుంటాం: సాయికృష్ణ?, ధర్మవరం మున్సిపల్ కమిషనర్‌పందులను వారంలోపు తరలించాలని వాటి యజమానులకు నోటీసులిచ్చాం. స్పందించని పక్షంలో తగిన చర్యలు చేపడతాం. కుక్కల శస్త్రచికిత్సలు వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించాం. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం.

# ఈ–శ్రమ్‌తో భరోసా

చీడికాడ : భవన నిర్మాణ కార్మికులా.. ఉపాధి శ్రామికులా.. ఏదైనా గార్మెంట్స్ దుకాణాలు, సంస్థల్లో పని చేస్తున్నారా..? అయితే 'ఈ–శ్రమ్'లో పేర్లు నమోదు చేసుకోండి. ఇప్పటికే నమోదైతే సర్లే.. లేదంటే త్వరపడండి. దీంతో ఎన్నో ప్రయోజనాలున్నాయి. జిల్లాలో నమోదు ప్రక్రియ జరుగుతోందని కార్మిక శాఖ చోడవరం సహాయ అధికారి సూర్యనారాయణ తెలిపారు.

**ఉపయోగాలివీ..:** సభ్యత్వం పొందిన ప్రతి సభ్యుడికి రూ.రెండు లక్షల ఉచిత ప్రమాద బీమా వర్తిస్తుంది. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతే రూ.రెండు లక్షలు, అంగవైకల్యం బారిన పడితే ఆర్థికసాయం అందుతు ంది. ఈ కార్డుతో దేశంలో ఎక్కడైనా రేషన్ సరకులు తీసుకోవచ్చు.

ఎలా చేయాలంటే.. : 18 నుంచి 59 ఏళ్ల మధ్య వయసున్న వారు ఈ–శ్రమ్ పోర్టల్‌లో ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. కార్మిక శాఖ




కార్యాలయం, మీసేవా కేంద్రాలు, ఆధార్ లింక్ కలిగిన చరవాణి ద్వారా నమోదు చేసుకోవచ్చు. గ్రామ, వార్డు సచివాలయాల్లోనూ ఈ సేవలు పొందవచ్చు.

**అవసరమైన పత్రాలు :** ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా నంబరు, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్, చరవాణి నంబరు.

వీరంతా అర్హులే.. వ్యవసాయం, ఉపాధి హామీ పథకం శ్రామికులు, ఆశా కార్యకర్తలు, ఇళ్లు, దుకాణాల్లో పని చేసేవారు, తోపుడు బండ్లు, చిరు వ్యాపారులు, అన్నిరకాల చేతి వృత్తుల వారు, భవన నిర్మాణ కార్మికులు, మత్స్యకారులతోపాటు ఈపీఎఫ్, ఈఎస్ఐలో సభ్యత్వం లేనివారు అర్హులు. వివరాలకు సమీపంలోని కార్మిక శాఖ కార్యాలయ ంలో సంప్రదించవచ్చు.

# అగడ్త ఆక్రమణకు అడుగులు

నాగలాపురం : 'అగడ్త' భూముల చుట్టూ నెలకొన్న వివాదాలు వీడటం లేదు. నాగలాపురంలోని రూ.10 కోట్ల విలువైన ఈ భూముల్లో గతంలో కొంతవరకు విక్రయాలు జరగ్గా.. ప్రస్తుతం మిగిలిన వాటికోసం పావులు కదుపుతున్నారు. గ్రామ పంచాయతీ, రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో ఆలయాభివృద్ధికి ఉపయోగపడాల్సిన భూములు కాస్తా అన్యాక్రాంతమవుతున్నాయి. గ్రామంలోని సుప్రసిద్ధ వేదనారాయణ స్వామి ఆలయం 1967లో తితిదేలో విలీనంకాగా.. ఆలయం విస్తరించిన 4.17 ఎకరాలతోపాటు 3.09 ఎకరాల్లోని సన్నిధివీధి, పుష్కరిణి దస్త్రావేజులను రెవెన్యూ అధికారులు తితిదేకు అప్పగించారు. ఆలయ చరిత్రతో ముడిపడిన మొసళ్లకుంటగా పిలిచే అగడ్తకు సంబంధించిన రెండెకరాలకు పైగా భూములను నాడు అధికారులు విస్మరించారు. ఆలయం చుట్టూ నివాసాలున్న 23 కుటుంబాలు ఖాళీ చేయించాలన్న ఉద్దేశంతో అప్పటి ఈవో పీవీఆర్‌కే ప్రసాద్ చొరవతో రెవెన్యూ అధికారులు అగడ్త భూముల్లో పట్టాలు ఇచ్చారు. సదరు



భూమి మురుగునీటిలో ఉండటంతో నిర్వాసితులు నగదు పరిహారం సైతం కోరారు. 1982లో ఈవో బదిలీ కావటంతో కథ కంచికి చేరింది. ఇటీవల భూముల ధరలు విపరీతంగా పెరగటంతో ప్లాట్లు వేయడానికి ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. కొందరు తరతరాలుగా వస్తోందని విన్నవిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ, తితిదే అధికారులు స్పందించాల్సి ఉంది.

**హక్కులు పంచాయతీవే..** అవి పూర్తిగా గ్రామకంఠం భూములే. గతంలో కొందరు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఖాళీగా ఉన్న భూములపై పంచాయతీకి తప్ప మరెవరికీ హక్కులు లేవు. వాటికి అనుభవ పట్టాలు ఇవ్వలేం. హనుమాన్‌నాయక్, తహసీల్దారు

# తోడేళ్లు.. తెగబడుతున్నాయి

పుత్తూరు : మట్టి దందా ఎంతకూ ఆగడంలేదు. రాత్రికిరాత్రి కొండలు, గుట్టలు తవ్వి అమ్మేస్తున్నారు. నిన్న పుత్తూరు మండలంలో దందా సాగగా.. నేడు ఈ అక్రమాలకు తిరుపతి–చెన్నై హైవేలోని వడమాలపేట మండలం అంజేరమ్మ కనుమ తూర్పు ప్రాంతం వేదికైంది. ఎస్వీపురం రెవెన్యూ పరిధిలో తిరుపతికి చెందిన ఓ రియల్టర్ (వైకాపా నేత) కొంత భూమి కొనుగోలు చేశాడు. అందులో ప్లాట్లు వేసేందుకు సమీప కొండను దర్జాగా తవ్వేసి మట్టి తరలిస్తున్నాడు. గత ప్రభుత్వ హయాంలో రూ.లక్షలు ఆర్జించిన వైకాపా నేత.. ఇప్పటికీ అక్రమాలు సాగిస్తున్నా అధికారులు 'మౌనం' దాల్చడం గమనార్హం. మరో కూటమి నేత రాత్రికిరాత్రి టిప్పర్లలో తరలిస్తున్నారు.



**నిద్రపోతున్న అటవీశాఖ..**

వాస్తవానికి ఇక్కడ అటవీశాఖ సరిహద్దు ఉంది. రెవెన్యూ, అటవీశాఖ అధికారులు సంయుక్త సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించాలి. అయితే రెవెన్యూ అధికారులు మాత్రం.. అవన్నీ అటవీ అధికారులు చూసుకోవాలని, తమకేమీ సంబంధం లేదని బుకాయిస్తున్నారు.

**సర్వే చేయించాం..** ఎస్వీపురం రెవెన్యూ లెక్క దాఖలాలోని భూమిని సర్వే చేయించాం. పట్టా ఉంది. రాత్రివేళ గ్రావెల్ తరలిపోతున్న విషయం తెలియదు. అటవీ అధికారులు హద్దులు నిర్ణయించుకోవాలి. జరీనా, తహసీల్దార్

చురకలు



# రైతుకు 'నిమ్మ'ళం కరవు

వెంకటగిరి: కనీస గిట్టుబాటు లేకపోవడంతో నిమ్మ రైతులు విలపిస్తున్నారు. కోత, మార్కెట్ రవాణా ఖర్చులు సైతం దక్కకపోవడంతో లబోదిబోమంటున్నారు. తెలుగు రాష్ట్రాల్లో గూడూరు నిమ్మ మార్కెట్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇక్కడ నుంచి వ్యాపారులు ఇతర రాష్ట్రాలకూ ఎగుమతి చేస్తుంటారు.

**దిగజారిన ధరలు..**

గూడూరు మార్కెట్‌లో కిలో నిమ్మ రూ.7 నుంచి 12 మధ్య ఉంది. మూడు వారాలుగా ఇవే ధరలు. కోత, రవాణా ఖర్చులు కలిపి 50కిలోల కాయలను మార్కెట్‌కు చేర్చాలంటే రూ.320 నుంచి 400 వరకు అవుతోంది. కిలో రూ.10 చొప్పున అమ్మినా 500 వస్తోంది. దానిలో 10శాతం కమీషన్ ఇవ్వాలి. చివరకు రైతుకు ఏమీ మిగలడం లేదు.



కాయలు తెంచకుంటే తోటలు దెబ్బతినే అవకాశాలు ఉన్నాయి. ఇలాచేస్తే తిరిగి పూత రావడానికి ఎక్కువ కాలం పడుతుంది. నవంబరు, డిసెంబరులో పూతవస్తే మార్చి, ఏప్రిల్‌లో కోతకు వస్తాయి. అప్పుడు మంచి ధర ఉంటుంది. ఆ కారణంగా ఇప్పుడు ధర లేకున్నా కాయలు తెంచుతున్నామంటున్నారు రైతన్నలు.

**గల్లీ నుంచి.. ఢిల్లీ దాకా..** ఇక్కడ నుంచి.. పొరుగు రాష్ట్రాలతో పాటు ఢిల్లీ, జైపుర్, ఆగ్రా, గ్వాలియర్, పట్నా, కోల్‌కతా వంటి నగరాలకూ పంపిస్తుంటారు. రోజూ 600 నుంచి 700 టన్నుల సరకు రవాణా చేస్తారు. అక్కడా ధర లేకపోవడంతో పరిస్థితి దారుణంగా ఉంది. ప్రభుత్వం స్పందించి గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతున్నారు.

# కన్నీటి మేట

చిత్తూరు :చిత్రంలోని రైతు పేరు శ్రీనివాసులనాయుడు. కేవీబీపురం మండలం కళత్తూరు రెవెన్యూ పరిధిలో 14 ఎకరాల పొలంలో వరద సృష్టించిన బీభత్సానికి ఇసుక మేట వేసింది. ఎకరాకు రూ.లక్ష వెచ్చించి పొలాలు యథాస్థితికి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. పొలం చుట్టూ రూ.4 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన రాళ్ల కంచె, మూడు మోటార్లు, విద్యుత్తు నియంత్రికలు ఎక్కడ ఉన్నాయో ఇప్పటికీ జాడలేదు. ఇలాంటి కష్టాల కన్నీటిగాథలు కళత్తూరు, పాతపాళ్లెం, ఎస్ఎల్‌పురం, ఓళ్లూరు గ్రామాల్లో వందలసంఖ్యలో ఉన్నాయంటే అతిశయోక్తికాదు.

రాయలచెరువు గండి రైతుల కంట కన్నీటి ఇసుక మేటలు నింపింది. చెరువు కింద ఆయకట్టు 1200 ఎకరాలే అయినప్పటికీ అనధికారికంగా మరో 200 ఎకరాలు సాగు చేస్తున్నారు. గండిపడి 38 రోజులు పూర్తవుతున్నా సాధారణ స్థితికి చేరుకోక సుమారు 874 మంది రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పంటపొలాల్లో నిండిన ఇసుక, బండరాళ్లు, వ్యర్థాలను తొలిగించేందుకు కొంతమంది ఉపక్రమించే



ప్రయత్నం చేస్తున్నప్పటికీ ప్రయోజనం కనిపించడం లేదు. రెండు నుంచి నాలుగు అడుగుల మేర పేరుకుపోవడంతో జీవనం దుర్భరంగా మారనుంది. బతుకుదెరువుకు వలసలు తప్పవని కన్నీటి పర్యంతమవుతున్నారు. ప్రభుత్వమే ఇసుక, రాళ్లు, వ్యర్థాలను తొలిగిస్తే తమకు బాసటగా నిలిచినట్లు ఉంటుందని కర్షకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**త్వరలో చేయూత?**

రైతులకు నెలరోజుల్లో ప్రభుత్వం చేయూతనిస్తుందని ఇటీవల కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. ఇప్పటి వరకు పశువులు, ఇళ్ల మరమ్మతులకు ప్రభుత్వం అందించిన సాయాన్ని పంపిణీ చేశామన్నారు. పంటనష్టంపై సర్వేలు పూర్తయిన వెంటనే బాధితులను సాయం అందుతుందన్నారు.

# ఆలూరులో ఖద్దరు పవర్

కర్నూలు: ఆలూరు నియోజకవర్గ పరిధిలో పవన విద్యుత్తు సంస్థల పనుల్లో 'ఖద్దరు' జోక్యంతో ఆయా సంస్థల యాజమాన్యాలు దిక్కుతోచని స్థితిలో పడ్డాయి. తెదేపాకు చెందిన కొందరు స్థానిక నేతలు జోక్యం చేసుకొని దందా చేయడం వివాదాస్పదంగా మారింది. సంస్థ చేపట్టే సివిల్ పనులు తమతోనే చేయించుకోవాలని ఓ వైపు తెదేపా నేతలు, మరోవైపు వైకాపా నేతలు తీవ్రమైన ఒత్తిళ్లు తెస్తున్నారు. ఆస్పరి, చిన్నహొతూరు గ్రామాల పరిధిలో చేస్తున్న పనులను అడ్డగించడంతో వివాదం తలెత్తింది. సోమవారం మధ్యాహ్నం మొదలైన వివాదం రాత్రి వరకు కొనసాగింది.

పవన విద్యుత్తు సంస్థల్లో కీలకమైన నిర్మాణ పనులను వైకాపాకు చెందిన ఓ మాజీ ఎమ్మెల్యే దక్కించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో ఆయన ఆ పార్టీకి చెందినవారినే పనుల్లో నియమించుకోవడం, వారికే ప్రాధాన్యం ఇస్తుండటంతో వివాదాలకు ఆజ్యం పోసినట్లైంది. ఇప్పటికే పలు ఒప్పందాలు కుదుర్చుకోవడంతో పాటు పనులు ప్రారంభించారు. ఆలూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా వైకాపాకు చెందిన విరూపాక్షి ఉండగా... తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా వైకుంఠం జ్యోతి ఇటీవల బాధ్యతలు చేపట్టారు. తాము స్థానిక ఎమ్మెల్యే మనుషులమని చెప్పి పలువురు వైకాపా నాయకులు సంస్థలో చేయాల్సిన పనులు ఇప్పటికే దక్కించుకున్నారు. సదరు సంస్థ అద్దె ప్రాతిపదికన తీసుకునే వాహనాలు వైకాపా వారే ఏర్పాటు చేసినట్లు సమాచారం.

పనులన్నీ వైకాపా వారికే ఎలా కట్టబెడతారని ఆయా సంస్థల యాజమాన్యాలపై స్థానిక తెదేపా నేతలు తిరగబడటం ఉద్రిక్తంగా మారింది. ఇరుపార్టీల వారికి సమాన అవకాశాలు కల్పించాలి.. తొలి ప్రాధాన్యం తెదేపా వారికే ఇవ్వాలని పట్టుబట్టారు. ఆ మేరకు దిద్దుబాటు చర్యలు తీసుకోకపోతే పనులు చేయనివ్వమని హుకుం జారీ చేశారు.

విషయాన్ని ఆస్పరికి చెందిన తెదేపా నేతలు సోమవారం రాత్రి ఆలూరు నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి జ్యోతి దృష్టికి తీసుకెళ్లారు. వివాదం సామరస్య పూర్వకంగా పరిష్కరించుకొనేందుకు వీలుగా సంస్థ ప్రతినిధులు ఇరు పార్టీల నాయకులతోనూ చర్చలు జరుపుతున్నట్లు

# ఎరువులున్నా ఎదురీత



చిత్తూరు : యూరియా పంపిణీపై ఖరీఫ్‌లో ఎదురైన ఉదంతాలతోనూ అధికారులు కళ్లు తెరవలేదు. ఫలితంగానే ఇప్పుడు పొలాల చుట్టూ తిరగాల్సిన కర్షకులు దుకాణాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా రైతులకు ఫోన్లు చేసి వారి అభిప్రాయాలు తెలుసుకోగా ఎరువుల లభ్యతలో తిరుపతి 18వ, చిత్తూరు 26వ స్థానంలో నిలిచింది.

**కృత్రిమ కొరత సృష్టిస్తూ**

జిల్లాలోని హోల్‌సేల్ ఎరువుల వ్యాపారుల వద్ద సరిపడా నిల్వలున్నా వారు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. మరోసారి వస్తుందో రాదో అని చెబుతూ రిటైల్‌గా కొద్ది మొత్తంలోనే అమ్ముతున్నారు. దాంతో వారు రైతులకు ఇదే విషయం చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే అన్నదాతలు ఆలస్యం చేస్తే మళ్లీ దొరుకుతుందో లేదోనని భావించి మూడు–నాలుగు బస్తాలు ఇంట్లో ఉంచుకుంటున్నారు. చిత్తూరు జిల్లాలో జనవరి నుంచి రబీ ఊపందుకుంటుంది. ఇప్పుడు పెద్దగా డిమాండ్ లేకపోయినా ముందు జాగ్రత్తగా కొందరు నిల్వ చేసుకుంటున్నారు. అదేబాటలో మిగతా రైతులూ వెళ్తున్నారు. ఫలితంగా ఎరువుల లభ్యతలో చిత్తూరు చిట్టచివరి స్థానంలో ఉంది. తిరుపతిలోనూ ఇదే పరిస్థితి.

**ఆర్ఎస్‌కేలలో ఇవ్వకుండా** ఏ మండలానికి ఎంత యూరియా అవసరమో ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చి ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలనే విషయాన్ని అధికారులు పట్టించుకోవడంలేదు. క్షేత్రస్థాయిలోని ఆర్ఎస్‌కేల్లో పంపిణీ సక్రమంగా లేదు. కొందరు సిబ్బంది నిల్వలున్నా లేవని తిప్పిస్తున్నారు. జిల్లా, నియోజకవర్గ కేంద్రాలకు సమీపంలో ఇలాంటి దుస్థితి నెలకొంది.

ఉదాహరణకు యాదమరి మండలంలోని అన్నదాతలను ఆర్ఎస్‌కేల సిబ్బంది చిత్తూరుకు పంపిస్తున్నారు.

**అధిక ధరకు విక్రయిస్తే చర్యలు**

చిత్తూరు జిల్లాలో యూరియా కొరత లేదని, రబీ సీజన్‌కు అన్ని పంటలకు 20,183 టన్నుల యూరియా అవసరమని ప్రణాళిక సిద్ధం చేశామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ? తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో తగినంత యూరియా అందుబాటులో ఉందని, ఈ నెలాఖరుకు 600 టన్నులు జిల్లాకు రానున్నదని చెప్పారు. డీలర్లు నిబంధనలు ఉల్లంఘించి కృత్రిమ కొరత సృష్టించినా.. అధిక ధరకు విక్రయించినా లైసెన్సు రద్దు చేసి, చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. చిత్తూరు జిల్లాలో అక్టోబరు– డిసెంబరు వరకు అవసరం (టన్నుల్లో) : 5,747అందుబాటులో ఉన్నది : 6,617 అక్టోబరు నుంచి డిసెంబరు 15 వరకు విక్రయించింది 4,217

# నాణ్యత దారి తప్పింది



నంద్యాల : మండలం బిల్లలాపురంలో ఉపాధిహామీ నిధులు వెచ్చించి రహదారి నిర్మించారు. పనుల్లో నాణ్యత లేనట్లు అధికారులు గుర్తించారు. రూ.20,991 రికవరీ చేయాలని ఆదేశించారు. జిల్లాలో రహదారులు, భవన నిర్మాణాలకు కూటమి ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు కేటాయించింది. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో అధికారులు పనులు చేపట్టారు. చాలా ప్రాంతాల్లో నాణ్యత తేలిపోయింది. కమీషన్లకు కక్కుర్తి పడిన కొందరు గుత్తేదారులతో కుమ్మక్కయ్యారు. ప్రజాధనాన్ని పక్కదారి పట్టించారు. జిల్లాలోని వివిధ మండలాల పరిధిలో ఏడాది కాలంలో జరిగిన పనులపై నాణ్యత విభాగం అధికారులు తనిఖీలు జరపగా అక్రమాలు బయటపడ్డాయి.

**పల్లె పండగలోనూ నిధుల స్వాహా**

జిల్లాలో పల్లె పండగ కింద ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని ఆరు మండలాలు, శ్రీశైలం నియోజకవర్గంలో ఐదు, బనగానపల్లి ఐదు, నంద్యాల రెండు, పాణ్యం రెండు, నందికొట్కూరు ఐదు, డోన్ నియోజకవర్గ పరిధిలోని మూడు మండలాల్లో గతేడాది డిసెంబరు నుంచి ఇప్పటి వరకు చేసిన వివిధ పనులను పరిశీలించారు. 28 మండలాల్లో 503 పనులకు సంబంధించి సుమారు రూ.5 కోట్ల విలువైన పనులను తనిఖీ చేశారు. అందులో 38 పనులు సరిగా జరగలేదని.. రూ.1.77 కోట్ల విలువ చేసే పనుల్లో నాణ్యత కరవైందని గుర్తించి రికవరీకి ఆదేశాలు జారీ చేశారు.

**463 చోట్ల పరిశీలన**

జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో జడ్పీ, పీఐయూ విభాగం, ఎంపీ ల్యాడ్స్‌కు సంబంధించి వివిధ పనులు జరిగాయి. వివిధ మండలాల్లోని గ్రామాల్లో 463 చోట్ల నాణ్యత విభాగం అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రత్యేకంగా గ్రామాల్లో నిర్మించిన 312 రహదారులను తనిఖీ చేశారు.

రహదారులు నాసిరకంగా నిర్మించారని.. భవనాల నిర్మాణానికి సంబంధించి నాలుగుచోట్ల అంతర్గత పనులు తూతూమంత్రంగా సాగినట్లు నివేదికలో పొందుపరిచారు. 25 పనులు క్షేత్రస్థాయిలో సరిగా జరగలేదని పేర్కొన్నారు.

**రికవరీ ఎక్కడెక్కడంటే..**

నంద్యాలలో నూతనంగా నిర్మించిన తహసీల్దారు భవనంలో ఫ్లోరింగ్ పనులు సరిగా లేనట్లు గుర్తించారు. బనగానపల్లి నియోజకవర్గ పరిధిలోని కోవెలకుంట్ల, సంజామల మండలాల పరిధిలో రూ.3.50 లక్షల విలువ చేసే నాలుగు పనులు, ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని చాగలమర్రి, రుద్రవరం మండలాల్లో రెండు పనులు, ఆత్మకూరు మండలంలో ఒక పని సరిగా లేదని నివేదించారు.

# ఆసామి కాని భూస్వామి



భీమవరం : కళ్లెదుటే ఇనామ్ భూములు.. కానీ అవసరాలకు అమ్ముకోలేక.. సాగుకు రుణాలు అందక ఎన్నో ఇబ్బందులు పడ్డారు అన్నదాతలు. అయినా గత ప్రభుత్వానికి వారి బాధలు పట్టలేదు. కూటమి ప్రభుత్వం ఆ భూములున్న రైతుల సమస్యల పరిష్కారానికి ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తోంది. నలుగురు సంతానం. పాతపాడులో రెండున్నర ఎకరాల భూములు ఉన్నాయి. వాటిని విక్రయించి పిల్లలకు వివాహాలు చేద్దామంటే కొనేవారు లేరు. గ్రామంలో పనులు కూడా లేవు. ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. – కొప్పాడ పుల్లయ్య, పాతపాడు అమ్మాయి పెళ్లి చేసేందుకు ఉన్న ఎకరం భూమిని అమ్మేందుకు ప్రయత్నించగా నిషిద్ధ జాబితాలో ఉండటంతో తక్కువకు అడిగారు. బ్యాంకు రుణం కోసం ప్రయత్నించినా ఫలితం లేదు. అధిక వడ్డీకి అప్పు తెచ్చి వివాహం చేశా. జిల్లాలోని పెంటపాడు, ఉమామహేశ్వరం, కాళీపట్నం గ్రామాల్లో సుమారు 8500 ఎకరాల ఇనామ్ భూములు ఉన్నాయి. వాటికి రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో భూమదింపు లేక కుటుంబ అవసరాల కోసం మార్కెట్ ధర కంటే తక్కువకే విక్రయిస్తున్నారు. మొగల్తూరు, పేరుపాలెం తదితర ప్రాంతాల్లో ఎకరం రూ.50 లక్షల నుంచి రూ.కోటి ధర పలుకుతుండగా పక్కనే ఉన్న ముత్యాలపల్లి, కాళీపట్నంలో ఇనామ్ భూములను ఎకరం రూ.30 నుంచి 35 లక్షలకు విక్రయించాల్సి వస్తోంది. అవసరాన్ని సాకుగా చూపించి ఒక్కోసారి అనుకున్న ధర కూడా చెల్లించడం లేదని, ఆడపిల్లలకు పసుపు కుంకుమలుగా ఇచ్చిన భూములకు రిజిస్ట్రేషన్లు జరగకపోవడంతో భార్యాభర్తల మధ్య తగాదాలు వస్తున్నాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గతంలో చేసిన చట్టంలో తప్పు దొర్లడంతో 1956 నుంచి 2013 వరకు జారీ చేసిన రైత్వారీ పట్టా భూములు నిషిద్ధ జాబితాలోకి చేరాయి. 2019లో అప్పటి తెదేపా ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ఇనామ్స్ చట్టం తీసుకురాగా.. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం ఆదేశాలతో జిల్లాలో సమస్య ఉన్న ప్రాంతాల్లో 11 బృందాలు రైతుల వివరాలు సేకరిస్తున్నాయని డీఆర్వో శివన్నారాయణరెడ్డి తెలిపారు. మొగల్తూరు మండలం కాళీపట్నంలో సాగు చేసుకుంటున్న భూములకు పట్టాదారు పాస్‌బుక్, టైటిల్ డీడ్ లేక ఇబ్బందులు పడుతున్నాం. పిల్లల చదువులకు, కుటుంబ అవసరాలకు అప్పులు చేయాల్సి వస్తోంది.

– సుమారు 3500 మంది రైతుల ఆవేదన

# కోళ్లు కూస్తున్నాయ్.. ఊళ్లు పిలుస్తున్నాయ్!

పాలకొల్లు : సంక్రాంతి అంటే ముందుగా గుర్తొచ్చేది గోదావరి జిల్లాలే. పండగ రోజుల్లో చేసే ఏర్పాట్లకు ఉమ్మడి పశ్చిమ పెట్టింది పేరు. ఏటా మాదిరిగానే వైభవంగా పల్లె పండగను జరుపుకోవడానికి ఎక్కడికక్కడ ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో నిర్వాహకులు ఓ అడుగు ముందుకేసి ఏ ఈ ఏడాది భారీ కార్యక్రమాలకు రంగం సిద్ధం చేస్తున్నారు. విదేశాలతో పాటు దేశంలో ప్రధాన నగరాలు, పట్టణాల నుంచి జిల్లాకు వచ్చే అతిథులందరూ కొత్త అనుభూతికి లోనయ్యేలా కొందరు ఈవెంట్స్ నిర్వాహకులు సైతం ఆకర్షణీయ కార్యక్రమాలతో సిద్ధమవుతున్నారు.

**ఆత్మీయ ఆతిథ్యం**

సంక్రాంతికి వచ్చే అతిథులంతా ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా ఆయా గ్రామాల్లోనే రోజంతా గడిపేలా నిర్వాహకులు ప్రణాళికలు రూపొందించారు. ఉదయం భోగిమంట నుంచి జిల్లాలో పేరుగాంచిన వంటకాలతో అల్పాహారం, భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రికి విందు పూర్తి ఉచితంగా అందించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. పాలకొల్లు మండలం పూలపల్లిలో నిర్వాహకులు సంక్రాంతి అతిథుల కోసం దూపుడుపోతు బిర్యానీ, పందుగప్ప బిర్యానీవంటి ఐదారు రకాల వంటకాలను మూడురోజులూ అందుబాటులో ఉంచాలని నిర?యించారు. ఈ మేరకు ఇప్పటికే వంట మేస్త్రీలకు ఆర్డర్లు ఇచ్చేశారు.



**ప్రత్యేక ప్యాకేజీలు**

అతిథిగృహాలు, హొటళ్ల నిర్వాహకులు కొందరు సంక్రాంతి ప్యాకేజీలు ప్రకటించారు. రూ.10 వేలు చెల్లిస్తే మూడు రోజుల బస, విందు, వినోదాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. సంక్రాంతి విలేజ్ ఫెస్ట్ పేరిట భోగి రోజున గ్రామీణ ప్రాంతంలో ఫొటో షూట్, పతంగులు ఎగరేయడం, కొబ్బరి తోటల్లో స్టేజ్ షోలు ఉంటాయి. సంక్రాంతి నాడు మండువా లోగిళ్ల సందర్శన, కోడి పందేలు, గోదావరి నది అందాల సందర్శన, ట్రాక్టర్లపై గ్రామంలో సరదా రైడ్, రాత్రికి క్యాంప్ ఫైర్, కనుమ రోజున బీచ్‌తో పాటు ప్రసిద్ధ దేవాలయాల సందర్శన, నది లేదా సముద్రం ఒడ్డున ఆత్మీయ సమావేశం వంటి కార్యక్రమాలను అతిథుల కోసం రూపొందించారు. వీటికి సంబంధించిన టారిఫ్‌లన్నీ సామాజిక మాధ్యమాల్లో ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.

# ఎన్నేళ్లైనా రానీ.. కన్నీళ్లైనా రాలనీ!

ఏలూరు : ఈ చిత్రంలో కనిపిస్తోంది రామసింగారం రెవెన్యూ పరిధిలోని 10 ఎకరాల భూమి. దీన్ని 30 ఏళ్ల కిందట ప్రభుత్వం సైనికుల కోటాలో ఓ సైనికుడికి కేటాయించింది. అతను దాన్ని విక్రయించగా తహసీల్దార్ ధ్రువీకరణతో వెంకట్రావు అనే వ్యక్తి కొని రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అందులో 17 ఏళ్లుగా కోకో, ఆయిల్‌ఫామ్ సాగు చేస్తున్నారు. ఈ భూమిపై బ్యాంకు నుంచి పంట రుణాలు కూడా పొందారు. 'ఐదేళ్ల కిందట 22ఏ జాబితాలో చేర్చారు. తహసీల్దార్ నుంచి కలెక్టర్ వరకు అందరికీ అన్ని పత్రాలు అందజేశా. తీరా సైనికులకు కేటాయించినట్లు సైనిక పుస్తక రిజిస్టర్ నకలు తీసుకురావాలని ఇబ్బంది పెడుతున్నారు. వారి వద్ద ఉండే పత్రాన్ని ఎక్కడి నుంచి తేవాలని' వెంకట్రావు వాపోతున్నారు.

జిల్లాలో ఫ్రీహోల్డ్, 22ఏ, చుక్కలు, అసైన్డ్‌మెంట్ భూముల యజమానులు, వాటిలో ఇళ్లు నిర్మించుకున్న వారి ఇబ్బందులు వర?నాతీతం. ఈ సమస్య పరిష్కరించాలని, లేకపోతే ప్రజల్లోకి



వెళ్లలేకపోతున్నామని గత నెలలో జరిగిన జిల్లా సమీక్షా కమిటీ సమావేశంలో మంత్రి పార్థసారథి సహా ఏలూరు, దెందులూరు ఎమ్మెల్యేలు బడేటి రాధాకృష్ణయ్య, చింతమనేని ప్రభాకర్ ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన పూర్తిగా ఒక రోజు ఈ సమస్యలపై గ్రీవెన్స్ తీసుకుని సాధ్యమైనంత వరకు ఆ రోజు లేదా నెలలోపు పరిష్కరించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఆ మేరకు మంగళవారం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నా బాధితులకు తెలిసేలా ప్రచారం చేయలేదు. ఎమ్మెల్యేలకు సోమవారం ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. బాధితులు లేకుండా సమస్యలను ఎలా పరిష్కరిస్తారని ప్రజాప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు.

ఈ భవనాలు ఏలూరు శాంతినగర్ ఏడో లైనులో ఉన్నవి. ఎన్టీఆర్ హయాంలో ఇక్కడ భూములను పేదలకు ఇళ్ల స్థలాలుగా కేటాయించగా బ్యాంకు రుణాలు పొంది నిర్మించుకున్నారు. తీరా ఆ భూములు జలవనరుల శాఖకు చెందినవి అని ఏడేళ్ల క్రితం 22ఏ జాబితాలో చేర్చడంతో రిజిస్ట్రేషన్ జరగడం లేదు. ఈ ఇళ్లను కొందరు ఆడపిల్లలకు కట్నకానుకలుగా ఇచ్చారు. ఏలూరు రామకృష్ణాపురంలో సర్వే నంబరు 6–77లో ఉన్న ఐదెకరాల భూమిని 1989లో కౌన్సిల్‌లో తీర్మానం చేసి విక్రయించగా దాన్ని కొనుగోలు చేసి చాలా మంది ఇళ్లు నిర్మించుకున్నారు. వాటికి రిజిస్ట్రేషన్ చేశారు. ఇప్పుడు వాటిని ఫ్రీహోల్డ్ జాబితాలో చేర్చి తొలగించకుండా ఇబ్బంది పెడుతున్నారని బాధితురాలు ఉండి కోమలి తెలిపారు. 22ఏ కేసుల పరిష్కార వేదిక నేడుస్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో 22ఏ కేసుల పరిష్కారానికి మంగళవారం ప్రత్యేక వేదిక నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెట్రిసెల్వితెలిపారు. ప్రభుత్వ, అటవీ పరిధిలోకి రానివి: 10 వేల ఎకరాలు జిల్లాలో ఫ్రీహోల్డ్ భూములు: 8912 ఎకరాలు

చురకలు



## 3 నెలల్లో ఇంత లుక్కు ఎలా పాజిబుల్?

తీగ లాంటి లుక్కుతో రాకుమారిలా మారిపోవాలని కోరుకోనిది ఎవరు? అయితే బొద్దుగుమ్మ వామిక గబ్బి సైజ్ జీరో రూపానికి మారేందుకు ఎంతగా శ్రమిస్తోందో తాజాగా కొన్ని వీడియోలు, ఫోటోల రూపంలో రివీల్ చేసింది. వామిక ఇప్పుడు పూర్తి మేకోవర్ తో ఆశ్చర్యపరుస్తోంది. కేవలం మూడు నెలల్లోనే ఇంత మార్పు సాధ్యమైందా? అని అనుమానించేంతగా ఈ కొత్త లుక్కు షాకిస్తోంది. హే వైలీ .. అర్జున్... నువ్వు నన్ను 3 నెలల్లో ఈ స్థితికి తీసుకురావాలి. మనం డిసెంబర్‌లో ప్రారంభిద్దాం... మీ ప్రయాణానికి శుభాకాంక్షలు గురూజీ అని వ్యాఖ్యను జోడించింది. వామిక ఇప్పటికే తాను ఆశించిన మేకోవర్ ని సాధించింది. మునుముందు మరో ఛాలెంజ్ కి రెడీ అవుతోంది.. వామిక ఇటీవల వరుణ్ ధావన్ సినిమాలో నటించింది. ఆ తర్వాత పెద్ద తెర కమిట్ మెంట్లపై సరైన సమాచారం లేదు. వామిక గత కెరీర్ మ్యాటర్ లోకి వెళితే... బాలీవుడ్ క్లాసిక్ జబ్ వి మెట్ లో ఒక చిన్న పాత్రతో బాలనటిగా ప్రయాణాన్ని ప్రారంభించింది. తన



యుక్తవయసులో కథానాయికగా మారిపోయింది. తు మేరా 22 మై తేరా 22, ఇష్క్ బ్రాందీ, లాంటి చిత్రాల్లో నటించింది. నిక్కా జైల్దార్ సిరీస్ విజయంతో పంజాబీ సినీపరిశ్రమలోను గుర్తింపు పొందింది. వామికా గబ్బి చండీగఢ్‌కు చెందిన పంజాబీ కుటుంబానికి చెందిన యువతి. తండ్రి గోవర్ధన్ గబ్బి, గబ్బీ అనే మారుపేరుతో హిందీ - పంజాబీ రెండింటిలోనూ ప్రఖ్యాత రచయిత. చండీగఢ్‌లోని సెయింట్ జేవియర్స్ స్కూల్‌లో తన ప్రారంభ విద్యను పూర్తి చేసింది. చండీగఢ్‌లోని డిఏవీ కళాశాల నుండి ఆర్ట్స్‌లో డిగ్రీని పొందింది. సాహిత్య వాతావరణంలో పెరిగిన వామిక వినోద పరిశ్రమలో సృజనాత్మకంగా రాణించాలని కలలు కంది. ఈ బ్యూటీ రొమాంటిక్ డ్రామా మాలై నెరతు మయక్కంతో తమిళ సినిమాల్లోకి అడుగుపెట్టింది. గోధాతో మలయాళ సినీరంగంలోను ఆరంగేట్రం చేసింది. ఇందులో ఆమె పంజాబీ రెజ్లర్‌గా నటించింది. గోధాలో వామిక నటనకు విమర్శకుల ప్రశంసలు దక్కాయి. హిందీ వెబ్ సిరీస్ గ్రహణ్, మై: ఎ మదర్స్ రేజ్, మోడరన్ లవ్: ముంబై లాంటి సిరీస్ లతో వామిక గబ్బి అందరి దృష్టిని ఆకర్షించింది. వామికకు సోషల్ మీడియాల్లో భారీ ఫాలోయింగ్ ఉంది.

## శ్రుతిహాసన్ ఇంట్లో పూజలు పునస్కారాలు ఉండవా?

శ్రుతి హాసన్ కెరీర్ దేదీప్య మానంగా సాగిపోతున్న సంగతి తెలిసిందే. తెలుగు, తమిళ, హిందీ సినిమాలతో బిజీ బిజీగా ఉంది. విజయాల పరంగా వెనుకబడినా అవకాశాల పరంగా కొదలేదు. ఏదో పరిశ్రమలో సినిమాలు చేస్తోంది. వాల్తేరు వీరయ్యతో మాస్ హిట్ అందుకోగా అటుపై సలార్ మరో విజయం ఖాతాలో వేసుకుంది. ఇతర భాషల్లో కొన్ని సినిమాలు రిలీజ్ అయ్యాయి. ఇటీవలేకూలీతో అలరించింది. తాజాగా ఈ బ్యూటీ బాలీవుడ్-సౌత్ ఇండస్ట్రీ మధ్య వ్యత్యాసం చెప్పే ప్రయత్నం చేసింది. సౌత్ పరిశ్రమలో తారలు ఎంతో వినయంతో ఉంటారంది. ఇక్కడ సంస్కృతి సంప్రదాయాలకు ప్రాధాన్యత ఇస్తారు. సినిమా ప్రారంభోత్సవం రోజున దేవుడి పటాల ముందు కొబ్బరి కాయలు కొట్టడం..దేవుళ్లకు నమస్కరించడం.. మనసులో కోరికలు కోరుకోవడం.. పూజలు చేయడం వంటివి కనిపిస్తాయి. సౌత్ లో అన్ని పరిశ్రమల్లో ఇలా కనిపిస్తుంది. పరిశ్రమలోకి అడుగు పెట్టిన కొత్తలో నాకు ఇదంతా చాలా కొత్తగా



అనిపించేదంది. ఎందుకంటే మా ఇంట్లో అలా చేయడం ఎప్పుడూ చూడలేదు. ఆచారాలను మా ఇంట్లో వారు ఎవరు నమ్మరు. పూజలు..పునస్కారాలు పెద్దగా ఉండవు. కానీ ప్రతీ విషయంలోనూ క్రమ శిక్షణ ఉంటుందంది. సౌత్ లో ఉన్నట్లు ఈ రకమైన కల్చర్ బాలీవుడ్ లో పెద్దగా కనిపించదన్నారు. చాలా తక్కువ మంది మాత్రమే చేస్తారని, హిందీ సినిమాలు చేస్తున్నప్పుడే ఈ రెండు పరిశ్రమల మధ్య వ్యత్యసం తెలిసిందన్నారు. సౌత్ లో బాగా డబ్బు సంపాదించిన వారు కూడా చాలా పద్దతులు పాటిస్తుంటారు. వారు ఇప్పటికీ అదే పాత పద్ధతి కొనసాగించడం చూస్తుంటే వీరు ఇంకా పాత అంబాసిడర్ కారులోనే ప్రయాణిస్తున్నారా? అనిపిస్తుందన్నారు. ఆడంబరమైన వస్తువులతో తమ విజయాన్ని నిరూపించుకోవాలనుకోరంది. కమల్ హాసన్ కూడా ఆచారాలు పాటించరు. దేవుళ్లు..దెయ్యాలు గురించి టాపిక్ ను ఆయన టచ్ చేయరు. పలు సందర్భాల్లో ఆయన చేసిన వ్యాఖ్యలు కూడా వివాదాస్పదమయ్యాయి. ఈ నేపథ్యంలో క్షమాపణలు చెప్పాలనే డిమాండ్ వ్యక్తమైనా? కమల్ మాత్రం ఎక్కడా తగ్గలేదు. తాను నమ్మిన సిద్దాంతానికే కట్టుబడి ఉంటారు.కమల్ లాగే తనయ శ్రుతి హాసన్ కూడా ఉంటుందని ఆమె మాటల్ని బట్టి తెలుస్తోంది.




## మొదట్లో ఐరన్ లెగ్.. కట్ చేస్తే స్టార్ హీరోయిన్స్.. ఎవరంటే?



సినిమా ఇండస్ట్రీలోకి రావడానికి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. హీరోయిన్లు మాత్రమే కాదు హీరోలు కూడా చాలా ఇబ్బందులు పడతారు. అయితే హీరోయిన్లు ఇండస్ట్రీలో స్టార్స్ గా రాణించాలి అంటే కమిట్మెంట్లు, క్యాస్టింగ్ కౌచ్ లు ఇలా ఎన్నో ఉంటాయి. ఇవన్నీ దాటుకొని ఇండస్ట్రీలో రాణిస్తేనే ముందుకు వెళ్తారు. అయితే సినిమాల్లోకి వచ్చిన మొదట్లోనే అందరికీ హిట్స్ పడిపోవు. ఎన్నో ఫ్లాప్ సినిమాలను, అవమానాలు ఎదుర్కొన్నాకే హిట్ సినిమాలు పడతాయి. అలా కొత్త హీరోయిన్ ఇండస్ట్రీకి వచ్చి రెండు మూడు సినిమాలు హిట్ కొడితే ఓకే.. లేకపోతే మాత్రం ఐరన్ లెగ్ అనే ముద్ర వేస్తారు. అలా ఇండస్ట్రీకి వచ్చిన కొత్తలో ఐరెన్ లెగ్ ముద్ర వేసుకొని ఆ తర్వాత సినిమాల్లో స్టార్ హీరోయిన్స్ గా రాణించిన వాళ్లు ఎంతోమంది ఉన్నారు. వారెవరో ఇప్పుడు చూద్దాం..

**విద్యాబాలన్:** బాలీవుడ్ బోల్డ్ బ్యూటీ విద్యాబాలన్ గురించి ప్రత్యేక పరిచయాలు అక్కర్లేదు. అయితే ఈ హీరోయిన్ సినిమాల్లోకి వచ్చిన కొత్తలో ఐరన్ లెగ్ అనే ముద్ర వేసుకుంది. దానికి కారణం మోహన్ లాల్ తో ఆగిపోయిన చక్రం మూవీ..ఈ సినిమా డైరెక్టర్ కి - హీరో కి మధ్య గొడవలు రావడంతో ఆగిపోయింది. ఈ సినిమాలో హీరోయిన్ గా తీసుకున్న విద్యాబాలన్ కి బిగ్ షాక్ తగిలింది. ఎందుకంటే మోహన్ లాల్ తో సినిమా అనగానే విద్యాబాలన్ కి దాదాపు 8,9 సినిమాల్లో ఆఫర్స్ వచ్చాయి.కానీ ఎప్పుడైతే చక్రం మూవీ ఆగిపోయిందని తెలిసిందో ఆ తర్వాత రాత్రికి రాత్రే ఏకంగా 8,9 సినిమాల నుండి విద్యాబాలన్ ని తీసేసారట. దాంతో విద్యాబాలన్ పై ఐరన్ లెగ్ ట్యాగ్ వేశారు. కానీ ఆ తర్వాత డర్టీ పిక్చర్ అనే మూవీ తో విద్యాబాలన్ ఇండస్ట్రీని షేక్ చేసింది.

**రమ్యకృష్ణ:** సౌత్ స్టార్ హీరోయిన్ రమ్యకృష్ణ కూడా సినిమాల్లోకి వచ్చిన కొత్తలో ఐరన్ లెగ్ ముద్ర వేసుకుంది. ఈ ముద్దుగుమ్మ మొదట తమిళ సినిమా ద్వారా సినిమాల్లోకి వచ్చింది. ఆ తర్వాత తెలుగులో భలే మిత్రులు మూవీతో ఎంట్రీ ఇచ్చింది. అయితే 1984లో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన రమ్యకృష్ణకి దాదాపు ఏడు సంవత్సరాలు గడ్డుకాలం నడిచిందట. ఆమె చేసిన సినిమాలన్నీ ఫ్లాప్ అవ్వడంతో ఐరన్ లెగ్ అనే ట్యాగ్ ని తగిలించారు. కానీ విశ్వనాథ శాస్త్రి దర్శకత్వంలో వచ్చిన సూత్రధారులు సినిమా రమ్యకృష్ణ కెరియర్ ని మార్చేసింది. ఈ సినిమాతో ఆమెకు వరుస సినిమాల్లో ఆఫర్స్ వచ్చాయి. అలా సినిమాల్లోకి వచ్చాక దాదాపు 7 సంవత్సరాలు ఐరన్ లెగ్ అనే ముద్రతోనే రమ్యకృష్ణ ఇండస్ట్రీలో రాణించింది. ఆ తర్వాత ఈమెకు తెలుగు, తమిళ భాషల్లో బ్రహ్మరథం పట్టారు.

**నయనతార:** ఈ హీరోయిన్ మలయాళ సినిమాలతో ఇండస్ట్రీలోకి వచ్చినప్పటికీ ఆ సినిమాలు ఏవి అంత గుర్తింపు తెచ్చిపెట్టలేదు. కానీ తెలుగు, తమిళ భాషలో విడుదలైన చంద్రముఖి సినిమా నయనతారకి మంచి క్రేజ్ తెచ్చింది.ఆ తర్వాత వచ్చిన గజిని కూడా నయన్ కెరీర్ ని మార్చేసింది.అలా తెలుగు, తమిళ భాషల్లో ఇప్పడికి స్టార్ హీరోయిన్ గా రాణించింది.

**శృతిహాసన్ :** కమల్ హాసన్ కూతురు అయినప్పటికీ శృతిహాసన్ కి వరుస డిజాస్టర్స్ తప్పలేదు. అలా ఇండస్ట్రీ లోకి వచ్చిన కొత్తలో లక్, అనగనగా ఓ ధీరుడు, 3, ఓ మై ఫ్రెండ్,7 ఓం అరివు వంటి వరుస సినిమాలు ఫ్లాప్స్ అయ్యాయి. కానీ ఎప్పుడైతే పవన్ కళ్యాణ్ తో గబ్బర్ సింగ్ మూవీలో చేసిందో. ఆ తర్వాత ఈమె దశ తిరిగిపోయింది. ఈ మూవీతో ఐరన్ లెగ్ హీరోయిన్ కాస్తా స్టార్ హీరోయిన్ గా మారిపోయింది. ఇక ఈ మధ్యకాలంలో శృతిహాసన్ ప్లాపుల్లో ఉన్న హీరోలకు గోల్డెన్ హీరోయిన్ గా మారిపోయింది.

## కొత్త సంవత్సరంలో డెకాయిట్.. రిలీజ్ ఎప్పుడంటే?




టాలీవుడ్ యంగ్ హీరో అడివి శేష్.. ఇప్పుడు పలు సినిమాలతో బిజీగా ఉండగా.. అందులో ఒకటి డెకాయిట్. విభిన్నమైన కథలతో ఇప్పటికే ఆడియన్స్ ను మెప్పించి సూపర్ హిట్లు అందుకున్న అడివి శేష్.. ఇప్పుడు డెకాయిట్ మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. పూర్తి యాక్షన్ డ్రామాగా ఆ సినిమా రెడీ అవుతోంది. అడివి శేష్ హీరోగా ఇప్పటికే నటించిన క్షణం, గూఢచారి చిత్రాలకు సినిమాటోగ్రఫర్ గా వర్క్ చేసిన షనీల్ డియో.. ఇప్పుడు డెకాయిట్ కు దర్శకత్వం వహిస్తున్నారు. ఆ సినిమాతోనే ఆయన డైరెక్టర్ గా పరిచయమవుతున్నారు. హీరోయిన్ గా మృణాల్ ఠాకూర్ నటిస్తున్నారు. ముందు ఫిమేల్ లీడ్ రోల్ కు శ్రుతి హాసన్ అనుకున్నా.. ఆమె తప్పుకున్నారు. అయితే డెకాయిట్ మూవీ 2025 క్రిస్మస్ కానుకగా డిసెంబరు 25న రిలీజ్ చేస్తున్నట్టు మేకర్స్ కొన్ని రోజుల క్రితం అనౌన్స్ చేశారు. అందుకు తగ్గట్టే షూటింగ్ షెడ్యూల్ ను కూడా ప్లాన్ చేశారు. జెట్ స్పీడ్ లో చిత్రీకరణ నిర్వహించాలని అనుకున్నారు. కానీ డెకాయిట్ షూటింగ్ లోనే అడవి శేష్ ఇటీవల గాయపడడంతో చిత్రీకరణ వాయిదా పడింది. ఇంకా సినిమాకు సంబంధించిన కీలక సీన్స్ ను షూట్ చేయాల్సి ఉంది. అయితే అడివి శేష్ ఇప్పుడు గాయం నుండి కోలుకున్నా.. ప్రస్తుతం వైద్యుల సలహాతో విశ్రాంతి తీసుకుంటున్నారు. దీంతో షూటింగ్ మళ్లీ ప్రారంభమవ్వడానికి కాస్త సమయం పడుతుంది. దీంతో మేకర్స్ సినిమా రిలీజ్ ను వాయిదా వేశారు. క్రిస్మస్ కు విడుదల చేయడం లేదు. తాజాగా సినిమా కొత్త రిలీజ్ డేట్ ను అనౌన్స్ చేశారు. వచ్చే ఏడాది ఉగాది పండుగ కానుకగా మార్చి 19న రిలీజ్ చేస్తున్నామని అఫీషియల్ గా మంగళవారం ఉదయం ప్రకటించారు మేకర్స్. ఆ సమయంలో స్పెషల్ పోస్టర్ కూడా రిలీజ్ చేశారు.

అందులో అడివి శేష్, మృణాల్ ఠాకూర్ యాక్షన్ మోడ్ లో కనిపించారు. ఓ యాక్షన్ సీన్స్ కు సంబంధించిన పిక్ గా తెలుస్తోంది. కొత్త పోస్టర్ అందరినీ ఆకట్టుకుంటోంది. ఇక సినిమా విషయానికొస్తే.. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియా యార్లగడ్డ నిర్మిస్తున్నారు. సునీల్ నారంగ్ కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. బాలీవుడ్ ఫిల్మ్ మేకర్, యాక్టర్ అనురాగ్ కశ్యప్ కీలక పాత్రలో కనిపించనున్నారు. తెలుగులో డెకాయిట్ తోనే ఆయన అరంగేట్రం చేస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. మరి కొత్త సంవత్సరంలో రానున్న డెకాయిట్ ఎలా మెప్పిస్తుందో చూడాలి.

## గార్జియస్ లుక్ లో అమృత!

అమృత అయ్యర్.. ఈ పేరు గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. తెలుగులో చేసింది తక్కువ సినిమాలే అయినా తన అద్భుతమైన నటనతో అందరి దృష్టిని ఆకట్టుకుంది ఈ ముద్దుగుమ్మ. ముఖ్యంగా ప్రముఖ యాంకర్ ప్రదీప్ మాచిరాజుతో కలిసి '30 రోజుల్లో ప్రేమించడం ఎలా?' అనే సినిమాతో ఓవర్ నైట్ లోనే లైమ్ లైట్ లోకి వచ్చేసింది. ఆ తర్వాత ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో యంగ్ హీరో తేజ సజ్జ నటించిన హనుమాన్ సినిమాలో హీరోయిన్గా నటించి మరోసారి ప్రేక్షకులను అబ్బురపరిచింది. ఈ సినిమాలో ఈమె నటనకు విమర్శకుల ప్రశంసలు కూడా లభించాయి. అంతేకాదు ఈ సినిమా తర్వాత ఆఫర్లు వరుసగా తలుపు తడతాయని అందరూ అనుకున్నారు. కానీ అనుకున్నంత స్థాయిలో అవకాశాలు అయితే రాలేదు. ఇక బచ్చల మిల్లి సినిమాలో అల్లరి నరేష్ సరసన హీరోయిన్గా నటించినా కానీ ఈ సినిమా కూడా ఈమెకు కలిసి రాలేదని చెప్పాలి. ఇకపోతే అటు సినిమాలకు ఇటు సోషల్ మీడియాకి కూడా కాస్త దూరంగా ఉన్న ఈమె తాజాగా తన స్నేహితులతో కలిసి సరదాగా గడిపిన క్షణాలను ఇంస్టాగ్రామ్ వేదికగా షేర్ చేసుకుంది..ఆ ఫోటోలలో



చాలా గార్జియస్ లుక్ లో కనిపించి అందరి దృష్టిని ఆకట్టుకుంది అమృత అయ్యర్. తాజాగా స్లీవ్ లెస్ ముదురు నీలం రంగు దుస్తులు ధరించిన ఈమె.. ఆ దుస్తులలో తన ఆత్మవిశ్వాసాన్ని రేకెత్తించింది. బోల్డ్ స్లిట్ తో కప్పబడిన స్కర్ట్ ఆమెకు క్లాసీ లుక్కును అందించింది. ఈ గ్లామర్ లుక్కులో చాలా రిలాక్స్ గా కనిపించి సరికొత్త వైబ్ క్రియేట్ చేసింది అమృత అయ్యర్. ప్రస్తుతం ఈమె షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి చాలా రోజుల తర్వాత ఇలాంటి లుక్కులో చూసేసరికి అభిమానులు ఈ ఫోటోలను తెగ లైక్, షేర్ చేస్తున్నారు. అమృత అయ్యర్ విషయానికి వస్తే.. 1994 మే 14న తమిళనాడులోని చెన్నైలో తమిళ్ మాట్లాడే కుటుంబంలో జన్మించింది. కర్ణాటకలోని బెంగళూరులో పెరిగిన ఈమె అక్కడే ఎన్ హెచ్ ఆర్ పాఠశాలలో స్కూల్ విద్యాభ్యాసం పూర్తి చేసి, సెయింట్ జోసెఫ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ లో డిగ్రీ పూర్తి చేసింది. 2018లో తమిళ చిత్రం పడైవీరన్ సినిమాతో తొలిసారి హీరోయిన్ గా అడుగుపెట్టిన ఈమె ఆ తర్వాత బిగిల్, లిఫ్ట్ వంటి చిత్రాలు చేసి ప్రేక్షకులను మెప్పించింది.. రెడ్ చిత్రం ద్వారా తెలుగు ప్రేక్షకులను పలకరించిన ఈమె.. ఆ తర్వాత 30 రోజుల్లో ప్రేమించడం ఎలా అనే సినిమా చేసి ఆకట్టుకుంది. హనుమాన్ సినిమాతో వంద కోట్ల క్లబ్లో చేరిన ఈమె బచ్చల మిల్లి , అర్జున ఫాల్గుణ సినిమాలు చేసింది..

## ఒకేసారి ముగ్గురు సూపర్ స్టార్స్‌తో మమిత..!

'ప్రేమలు' సినిమాతో ఓవర్ నైట్‌లో స్టార్ హీరోయిన్‌గా మారిన ముద్దుగుమ్మ మమిత బైజు. అంతకు ముందు వరకు మలయాళ సినిమాలకు పరిమితం అయిన మమిత బైజు ఇప్పుడు వరుస తమిళ సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉంది. టాలీవుడ్ నుంచి కూడా ఈ అమ్మడికి ఆఫర్లు తలుపు తడుతున్నాయని తెలుస్తోంది. ఇటీవలే తమిళ మూవీ డ్యూడ్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ప్రదీప్ రంగనాథన్ హీరోగా నటించిన డ్యూడ్ సినిమా రూ.100 కోట్లకు మించి వసూళ్లు నమోదు చేసిన నేపథ్యంలో మమిత మరింత బిజీగా కోలీవుడ్‌లో మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. తెలుగులోనూ డ్యూడ్‌కి మంచి రెస్పాన్స్ దక్కింది. అందుకే తెలుగు ఫిల్మ్ మేకర్స్ నుంచి ఈమెకు ఆఫర్లు తలుపు తడుతున్నాయని తెలుస్తోంది. మొత్తానికి మమిత బైజు ఒకే ఏడాది వరుసగా పెద్ద హీరోల సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అవుతోంది.

**విజయ్ జన నాయగన్ సినిమాలో మమిత బైజు...** ఇప్పటికే తమిళ్



సూపర్ స్టార్ విజయ్ హీరోగా నటిస్తున్న జన నాయగన్ సినిమాలో మమిత ముఖ్య పాత్రలో కనిపించబోతుంది. ఆ సినిమాలో హీరోయిన్ రోల్ కానప్పటికీ చాలా కీలకమైన పాత్ర అంటూ సమాచారం అందుతోంది. ఆ సినిమా మమిత కెరీర్ గ్రాఫ్ ను మరింతగా పెంచుతుందనే విశ్వాసంను చాలా మంది వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు తమిళ మరో సూపర్ స్టార్ సూర్య హీరోగా రూపొందుతున్న సినిమాలోనూ మమిత బైజు నటిస్తోంది. సూర్యకు జోడీగా నటిస్తున్న నేపథ్యంలో ఆ సినిమాపై మమిత చాలా ఆశలు పెట్టుకుంది. ఈ రెండు సినిమాలు వచ్చే ఏడాదిలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతున్నా యి. ఈ రెండు సినిమాలు కాకుండా మమిత బైజు మరో కొత్త సినిమాలోనూ మమిత నటించేందుకు రెడీ అయింది. అది కూడా తమిళ సూపర్ స్టార్ మూవీ కావడంతో ఒకే సారి ముగ్గురు స్టార్స్ తో నటించే అవకాశం దక్కించుకున్న అరుదైన రికార్డ్‌ను సొంతం చేసుకుంది.

**ధనుష్ హీరోగా మమిత బైజు హీరోయిన్‌గా...** తమిళ సూపర్ స్టార్ ధనుష్ నటించబోతున్న D54 సినిమాలో మమిత బైజు హీరోయిన్‌గా ఎంపిక అయింది. అధికారికంగా బయటకు రానప్పటికీ కోలీవుడ్ వర్గాల్లో ఈ విషయమై ప్రముఖంగా చర్చ జరుగుతోంది. కోలీవుడ్ లో ఒకే ఏడాది అంటే 2026 లో ముగ్గురు సూపర్ స్టార్స్‌తో నటించిన సినిమాలతో మమిత బైజు బ్యాక్ టు బ్యాక్ ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536